ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

| శనివారం | సంపుటి : 11 | పేజీలు : 12 |
|---|---|---|
| 19.04.2025 | సంచిక : 270 | వెల: రూ. 4/- |

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV





### జేఈఈ (మెయిన్) సెషన్-2
## ఫైనల్ కీ మళ్లీ విడుదల..

న్యూఢిల్లీ(జనంసాక్షి):జేఈఈ (మెయిన్) సెషన్- 2 పరీక్షల తుది కీ మళ్లీ విడుదలైంది. తొలుత గురువారమే జేఈఈ (మెయిన్) రెండో సెషన్ పేపర్ -1కు సంబంధించిన తుది కీని జాతీయ పరీక్షల మండలి విడుదల చేసినప్పటికీ.. కొద్దిగంటల్లోనే తొలగించింది. ఇందుకు

మిగతా 2లో..



## ఢిల్లీకి గులాములం కాబోము

**వారి పరిపాలనకు తమిళనాడు ఎన్నటికీ తలొగ్గదు**

**భాషా వివాదం నేపథ్యంలో ఇప్పటికే ఆ విషయాన్ని కేంద్రానికి తెలియజేశాం: సీఎం స్టాలిన్**

చెన్నై(జనంసాక్షి):తమిళనాడులో 2026లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ

మిగతా 2లో..

# తెలంగాణకు మరో భారీ పెట్టుబడి

## హైదరాబాద్‌లో రూ.10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు



- సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న ఎన్‌టీటీ- డేటా, నెయిసా సంస్థలు
- టోక్యోలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో సంస్థల ప్రతినిధులతో ఒప్పందం
- రుద్రారంలో రూ.562 కోట్లతో మరో పరిశ్రమ ఏర్పాటుకు తోషిబా డీల్
- జపాన్ పర్యటనలో రెండో రోజూ భారీ పెట్టుబడులు సాధించిన రాష్ట్ర బృందం
- హైదరాబాద్ అభివృద్ధికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానన్న ముఖ్యమంత్రి

టోక్యో(జనంసాక్షి):జపాన్‌పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులను సాధించింది. రూ. 10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్‌టీటీ- డేటా, నెయిసా సంస్థలు సంయుక్తంగా ఈ డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నాయి. టోక్యోలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందాలపై ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు.

మిగతా 2లో..

## తెలంగాణ స్వాగతం పలుకుతోంది

**రాష్ట్రంలో పెట్టుబడులతో అభివృద్ధి చెందండి**

**ఇండియా-జపాన్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ రోడ్‌షోలో పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం**

టోక్యో(జనంసాక్షి):తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియా-జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో తెలంగాణ రాష్ట్ర అధికారిక బృందం పాల్గొని, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించింది. వివిధ రంగాలకు

మిగతా 2లో..






- పలు ప్రాంతాలకు నిలిచిన విద్యుత్ సరఫరా
- సహాయకచర్యల్లో జాప్యంతో ప్రజలు ఇబ్బందులు
- పరిస్థితిపై అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష
- కొన్నిచోట్ల వడగళ్ల వర్షంతో దెబ్బతిన్న వాహనాలు
- పలుచోట్ల కూలిన చెట్లు..ట్రాఫిక్‌కు అంతరాయం
- నగరంపై క్యుములోనింబస్ మేఘాలు ఆవరణ



# అకాల వర్షంతో నగరం అతలాకుతలం

## హైదరాబాద్‌లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం



హైదరాబాద్(జనంసాక్షి): అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరం అతలాకుతలమైంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సహాయకచర్యల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు ఈ నేపథ్యంలో సహాయక చర్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ అధికారులను అప్రమత్తం చేశారు. కూలిన చెట్లను వెంటనే తొలగించాలని డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ఆదేశించారు.ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి భారీ వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రోడ్లపై నీరు నిలిస్తే వెంటనే తొలగించాలని పొన్నం సూచించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. బండ్లగూడలో 8 సెం.మీ వర్షపాతం నమోదైంది. బహదూర్‌పురలో 7.8 సెం.మీ , చార్మినార్‌లో 7.6 సెం.మీ, నాంపల్లిలో 6.9 సెం.మీ, అంబర్‌పేటలో 5 సెం.మీ, ఖైరతాబాద్‌లో 4.4 సెం.మీ, కుత్బుల్లాపూర్‌లో 4.3 సెం.మీ ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో జోరువాన కురిసింది. ఎస్‌ఆర్ నగర్, బోరబండ, జూబ్లీహిల్స్, కోఠి, నాంపల్లి, హిమాయత్‌నగర్, కార్వాన్, కుత్బుల్లాపూర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. వర్షం

మిగతా 2లో..

# ఇంకెన్నాళ్లీ మతరాజకీయాలు?

**భాజపాకి కులం, మతం పేరుతో పబ్బగడుపుకోవడం తప్ప అభివృద్ధి పట్టదు**

**వారు పాలిస్తున్న రాష్ట్రాల్లో సన్నబియ్యం ఇస్తున్నారా?**

**తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశారో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పాలి**

**ఊకదంపుడు ఉపన్యాసాలు మానాలి : టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**




హైదరాబాద్(జనంసాక్షి):భాజపా నేతలు ఇంకెన్నాళ్లు రజాకార్ల గురించి మాట్లాడతారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. వాళ్లు మతం గురించి తప్ప.. అభివృద్ధి గురించి ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ భాజపా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు."భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఇస్తున్నారా? కులం, మతం పేరుతో రాజకీయాలు తప్ప.. భాజపాకి అభివృద్ధి పట్టదు. మతం పేరుతో చేసే రాజకీయాలకు కాలం చెల్లింది. మూసీ పునరుజ్జీవం విషయంలో భాజపాకి

మిగతా 2లో..

# కర్ణాటకలో రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించండి

**సిఎం సిద్ధరామయ్యకు రాహుల్ లేఖ**

**విద్యావ్యవస్థలో నేటికి బలహీన వర్గాలు కులవివక్షను ఎదుర్కొంటున్నాయని వెల్లడి**

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆత్మహత్య చేసుకున్న సెంట్రల్ వర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల పేరు అందరికీ గుర్తుండే ఉంటుంది. గతంలో పలు కారణాలతో హెచ్‌సీయూలో ఆత్మహత్యకు పాల్పడ్డ దళిత విద్యార్థి రోహిత్ వేముల పేరును చాలా కాలం తర్వాత కాంగ్రెస్

మిగతా 2లో..



# పేదల కన్నీటిని తుడిచేందుకే భూభారతి

**రైతులు కోల్పోయిన భూములు వారికే చెందాలనే లక్ష్యంతో కొత్త చట్టం తెచ్చాం**

- ధరణితో ఇష్టారీతిన భూ బదలాయింపులు
- పైసా ఖర్చు లేకుండా భూభారతిలో ఫిర్యాదులు
- తహసిల్దార్ పరిధిలో సమస్యలు పరిష్కారం
- ఉమ్మడి జిల్లాకో సిసిఎల్‌ఏ, ట్రిబ్యునల్ ఏర్పాటు
- వెంకటాపూర్‌లో భూభారతి అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి



ములుగుబ్యూరో(జనంసాక్షి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం సామాన్య రైతులకు న్యాయం జరిగేవిధంగా ఉంటుందని, రైతుల కళ్లలో ఆనందం చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్మని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూ భారతి కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ బుద్ద ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.భూ భారతి రెవెన్యూ సదస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నముక రైతు అని, రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైధరణి పోర్టల్ తీసుకువచ్చి గులాబీ నాయకులు ఇష్టా రీతిని వారి పేర్లపై వందల ఎకరాలు పట్టాలు చేయించుకుని, చట్టాన్ని చుట్టంగా మలుచుకుని రైతు బంధు పొందారు తప్పా సామన్య పేదరైతుకు న్యాయం జరిగిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన

మిగతా 2, 3లో..



# మస్క్‌తో మోదీ మంతనాలు

**ఫోన్‌లో చర్చించుకున్న ఇరువురు**

**సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహకార ప్రాముఖ్యతపై చర్చించాం**

**ఈ రంగాల్లో అమెరికాతో మరింత దగ్గరయ్యేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉంది : ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):టారిఫ్‌ల విషయంలో భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని డోజ్ విభాగ అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్‌లో చర్చలు జరిపారు.ఈ విషయాన్ని మోదీ 'ఎక్స్' వేదికగా

మిగతా 9లో..

# కంచ గచ్చిబౌలి భూములపై విచారణ చేపట్టాలి

**మోదీకి కేటీఆర్ విజ్ఞప్తి**

**ప్రధానిగా పర్యావరణంపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయమిదని వ్యాఖ్య**



హైదరాబాద్(జనంసాక్షి): ప్రధాని నరేంద్రమోదీకి భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక విజ్ఞప్తి చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రధానిగా పర్యావరణంపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన సమయమిదన్నారు. ఈ మేరకు 'ఎక్స్' ద్వారా ప్రధానిని ఆయన కోరారు. "కంచ గచ్చిబౌలి భూముల ఆర్థిక అక్రమాలపై విచారణ చేపట్టాలి. కాంగ్రెస్, భాజపా కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలి. దీనిపై ప్రధాని వ్యాఖ్యలకే పరిమితం కాకుండా చర్యలు తీసుకోవాలి. కంచ గచ్చిబౌలి అంశం వందల ఎకరాల పర్యావరణ విధ్వంసం మాత్రమే కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 2లో..

# బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో మహిళలకు పెద్దపీట

**ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్న పార్టీ అధినేత కెసిఆర్**

గజ్వేల్ (జనంసాక్షి):ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలన్నారు. సభపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ మహిళా నేతలతో పాటు పలువురు నాయకులతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. సభలో మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు-, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు చేస్తూ కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్

మిగతా 2లో..



# విదేశీ విద్యార్థులపై ట్రంప్ కఠినవైఖరి

**కేవలం నెల వ్యవధిలోనే.. 1000 మంది వీసాల రద్దు!**

**అమెరికా కోర్టులను ఆశ్రయిస్తున్న విద్యార్థులు**




న్యూయార్క్(జనంసాక్షి):అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ విద్యార్థులపైనా ఉక్కుపాదం మోపుతున్నారు.గడిచిన కొన్ని వారాల్లోనే 1000 మందికిపైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను రద్దు చేసినట్లు సమాచారం. దీంతో ట్రంప్ యంత్రాంగం తీరుపై అనేక మంది విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. వీసా రద్దు చేసే క్రమంలో ఫెడరల్ ప్రభుత్వం సరైన రీతిలో వ్యవహరించడం లేదని వాదిస్తున్నారు. వీసాలను రద్దు చేస్తూ ఫెడరల్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వందలాది విదేశీ విద్యార్థులకు నిర్బంధం, డిపోర్టేషన్ ముప్పు

మిగతా 2లో..



### ఛత్తీస్‌గఢ్‌లో 22 మంది మావోయిస్టుల
## లొంగుబాటు

సుక్మా(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో శుక్రవారం 22 మంది మావోయిస్టులు భద్రతా దళాల ముందు లొంగిపోయారు. వారిలో 12 మందిపై రూ.40 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. అమానవీయ మావోయిస్టు భావజాలం, స్థానిక గిరిజనులపై జరిగిన దురాగతాలతో నిరాశ చెందామని పేర్కొంటూ తొమ్మిది మంది మహిళలు సహా 13 మంది మావోయిస్టులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్సెస్ (సీఆర్‌పీఎఫ్) సీనియర్ అధికారుల ముందు లొంగిపోయారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరంతా పలు హింసాత్మక,

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
19.04.2025

## పేదల కన్నీటిని తుడిచేందుకే భూభారతి

హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడగానే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపి సామాన్య రైతుకు శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా భూ భారతి చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చిన మేరకు భూ భారతి చట్టం తీసుకువచ్చామని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని ఎంచుకున్నట్లు- తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సాదా బైనామాద్వారా రైతులు పెట్టుకున్న దరఖాస్తులు రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల 24 వేలు ఆన్‌లైన్ లో ఉన్నాయని, అన్నింటికీ భూ భారతిలో అవకాశం కల్పించి రైతులకు న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తామన్నారు. పేదల ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## ఇంకెన్నాళ్లీ మతరాజకీయాలు?

స్పష్టత లేదు. భాజపా నేతలకు రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలనే సోయి లేదు. మెట్రో విస్తీర్ణంలో హైదరాబాద్ రెండో స్థానం నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయింది. మెట్రో రెండో దశకు కేంద్రం అనుమతి, నిధులు తీసుకురావాలనే ఆలోచన లేదు"అని మహేశ్‌గౌడ్ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ,బీఆర్ఎస్ నాటకాలాడుతన్నాయని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ తో కలిసి కిషన్ రెడ్డి లాలూచీ నాటకాలాడుతున్నారని మండిపడ్డారు. పొద్దున లేస్తే కులాలు ,మతాలు పంచాయతీ పెట్టేప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి కాదు కిస్మత్ రెడ్డి. కష్టం లేకుండా గెలుస్తున్నారని అన్నారు. మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. పొద్దున లేస్తే కిషన్ రెడ్డి ముస్లిమ్ జపం చేస్తడు. అక్బరుద్దిన్ ఒవైసీ మీదనే కిషన్ రెడ్డి రాజకీయం చేస్తడు. పోయిన జన్మలో ఒవైసీ, కిషన్ రెడ్డి బ్రదర్స్ అయి ఉంటారని అన్నారు. చెప్పుతో ఎవరిని కొడతారు కిషన్ రెడ్డి. నువ్ మగాడివి అయితే 10 ఏండ్లలో నీ నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చకు రా అంటూ సవాల్ చేశారు. దిగజారుడు భాష రాజకీయాల్లో మంచిది కాదు. 8 మంది ఎంపీలు ఎమ్మెల్యేలు,ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండీ రాష్ట్రానికి ఏం తెచ్చారని నిలదీసారు.. కిషన్ రెడ్డికి మతం తప్ప అభివృద్ధిపై దృష్టి లేదు. రాష్ట్ర అభివృద్ధిపై కిషన్ రెడ్డి, సంజయ్ ..ఎంపీలతో ఏనాడైనా మాట్లాడారా.పనికిరాని వాళ్లు ఏఐ పోస్టులు పెడితే కిషన్ రెడ్డి వాటిని కాపీ కొడతాడు. బండి సంజయ్ ఎపుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదు. సన్నబియ్యం కేంద్రానివి అంటడు. మరి బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఎందుకివ్వట్లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పంజాబ్ ఉగ్రవాది హర్‌ప్రీత్ సింగ్ అరెస్ట్

**అమెరికాలో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**చండీఘడ్(జనంసాక్షి):** పంజాబ్ పోలీసుల్ని వణికించిన ఉగ్రవాది హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ హ్యాపి పాసియాను అమెరికాలో అరెస్టు చేశారు. హర్‌ప్రీత్ అరెస్టుకు చెందిన ఫోటోలను విడుదల చేశారు. అతన్ని ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కస్టడీకి తీసుకెళ్లారు. అక్రమ రీతిలో అమెరికాలో ప్రవేశించిన హరిప్రీత్ .. బర్నర్ ఫోన్ల ద్వారా అరెస్టు నుంచి ఇన్నాళ్లూ తప్పించుకున్నాడు. ఇండియాలో అతను మోస్ట్ వాంటెడ్ క్రిమినల్. అతని తలపై 5 లక్షల నజరానా కూడా ఉన్నది. పంజాబ్‌లో ఇటీవల జరిగిన హింసకు ఇతనే ప్రధాన కారకుడు. గడిచిన ఆరు నెలల్లో 14 ఉగ్రదాడులు జరడానికి కారణంగా హరిప్రీత్ అని పోలీసులు పేర్కొన్నారు. 2024 నవంబర్ నుంచి అమృత్‌సర్‌లో వరుసగా పేలుళ్లు జరిగాయి. ఆ పేలుళ్ల వెనుక ఇతన హస్తం ఉన్నట్లు- తేలింది. పేలుళ్లకు తానే కారణమని అతను సోషల్ మీడియాలో ప్రచాచం చేశాడు. పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ, బబ్బార్ కల్సా ఇంటర్నేషనల్‌తో జత కలిసి హరిప్రీత్ సింగ్ పంజాబ్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడినట్లు- భద్రతా దళాలు ఆరోపించాయి. తాజాగా ఓ యూట్యూబర్ ఇంటితో పాటు- బీజేపీ నేత మనోరంజన్ కాలియా ఇంటిపై కూడా అతను దాడి చేయించాడు. ఈ రెండు ఘటనలు జలంధర్‌లోనే జరిగాయి.

## బంగ్లా మైనార్టీ హిందువులనురక్షించండి

**యూనస్ వ్యాఖ్యలకు భారత్ ధీటుగా జవాబు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టంతో నెలకొన్న హింసపై బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ స్పందించిన తీరుపై భారత్ ఘాటుగా సమాధానం చెప్పింది. గత వారం బెంగాల్ రాష్ట్రంలోని ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన హింసలో ముగ్గురు మరణించగా, వందలాది మంది గాయపడిన మైనారిటీ ముస్లిం వర్గాలను రక్షించాలని భారత ప్రభుత్వాన్ని యూనస్ కోరారు. ఇక, బంగ్లాదేశ్ వ్యాఖ్యలను విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తోసిపుచ్చారు. ఇలాంటి అనవసరమైన వ్యాఖ్యలు చేయడం కంటే, తమ దేశంలోని మైనారిటీల హక్కులను కాపాడు కోవడంపై దృష్టి పెట్టాలని చురకలు అంటించాడు. బంగ్లాదేశ్ మైనార్టీలపై కపట ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు. బంగ్లాలో మైనారిటీలపై జరుగుతున్న హింస నుంచి దృష్టిని మళ్లించే ప్రయత్నంగా అభివర్ణించారు. ఇక, గత సంవత్సరం మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా పదవీచ్యుతులైనప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో పరిస్థితి గందరగోళంగా ఉంది. బంగ్లాలో మైనార్టులుగా ఉన్న హిందువులపై తీవ్రవాద ఇస్లామిస్టులు అనేకసార్లు దాడులకు పాల్పడ్డారు. దాదాపు 200 దేవాలయాలను ధ్వంసం చేయగా.. పూజారులను అరెస్టు చేశారు.. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని హింసించారనే ఆరోపణలను బంగ్లాదేశ్ తరచుగా ఖండించింది.

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయడంలేదు?

**కిషన్ రెడ్డి ప్రశ్న**

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రజలను దోపిడీ చేసి.. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడి.. ప్రజల రక్తం తాగిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జీ హుజూరంటున్నాయని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై కిషన్ రెడ్డి విర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి తెలంగాణను ముంచే ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. పార్టీ నాయకులు, శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పోటీ- చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కేసీఆర్‌లకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రజాకార్ల వారసత్వాన్ని పొందిన మజ్లిస్ పార్టీకి వ్యతిరేకంగా జాతీయ వాద భావనతో బీజేపీ పోటీ- చేస్తోందని వివరించారు. మజ్లిస్ పార్టీ,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్య్ర సమరయోధులు, ఉద్యమకారుల వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తు చేశారు. మజ్లిస్ పాత బస్తీకే మాత్రమే పరిమితం కాలేదని.. ఆ పార్టీ ప్రస్తుతం తెలంగాణలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాప కింద నీరులా విస్తరిస్తోందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒకే తానుముక్కలుగా కలిసి పని చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ప్రజలు చైతన్యంగా ఆలోచించక పోతే,మళ్లీ రజాకార్ల పాలన లాంటి పరిస్థితులు దాపురించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మజ్లిస్ పార్టీ నాయకులు.. పాత బస్తీలోని హిందువుల ఇళ్లను స్వాధీనం చేసుకుని ప్రజలను ఖాళీ చేయించిన ఘటనలు చాలానే ఉన్నాయన్నారు. తెలంగాణను, హైదరాబాద్‌ను బలి చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వెనుకాడడం లేదన్నారు.

# తెలంగాణకు మరో భారీ పెట్టుబడి



మరోవైపు రుద్రారంలో రూ.562 కోట్లతో మరో పరిశ్రమ ఏర్పాటుకు తోషిబా ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే తోషిబా అనుబంధ సంస్థ టీటీడీఐ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలకు ఈ ఒప్పందం జరిగింది. రుద్రారంలో ఇప్పటికే ఈ సంస్థ రెండు ఫ్యాక్టరీలను నిర్వహిస్తోంది. ఈ భారీ పెట్టుబడులపై సీఎం రేవంత్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పెట్టు-బడులు వస్తున్నాయి. తెలంగాణలో సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం ఇస్తోంది. నిపుణులు ఉన్నందున ఏఐ డిజిటల్ సేవల్లో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోంది. ఎన్‌టీటి భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం సుస్థిరంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టీటీ- డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్‌వర్క్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం హైదరాబాద్‌లో నిర్మించబోయే ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్. 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది. దేశంలో తెలంగాణను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వమిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఈ ప్రాజెక్లును అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది. ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిలో విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ-, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్‌ఎల్‌ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్ గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని అన్నారు. టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ- డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో పేరొందిన కంపెనీ. 50 కంటే ఎక్కువ దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తుంది.

# తెలంగాణ స్వాగతం పలుకుతోంది..

చెందిన దాదాపు 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రోడ్ షోలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టు-బడులు పెట్టేందుకు రావాలని సాదరంగా ఆహ్వానించారు. దేశంలోనే కొత్త రాష్ట్రం.. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణ మీకు హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతోంది.. జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశం అని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ఈ రోజు తెలంగాణ జపాన్‌లో ఉదయిస్తోంది,' అన్నారు.టోక్యో చాలా గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణ కలిగినవారు. మీ నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నాను,..' అని అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం గల ప్రతిభ, స్థిరమైన విధానాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు మాటిచ్చారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబులిటీ- సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టె-క్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టు-బడులు పెట్టాలని.. భారత్, జపాన్ కలిసికట్టుగా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భారత రాయబారి సిబి జార్జ్ భారత్-జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాల గురించి మాట్లాడారు. జెట్రో (జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ మాట్లాడుతూ.. తెలంగాణతో సహకారాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రియల్ సిటీ-గా హైదరాబాద్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, దేశంలోనే అద్భుతంగా నిర్మించ తలపెట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. ఎలక్ట్రానిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో జపాన్ కంపెనీలకు తెలంగాణలో పెట్టు-బడులకు ఉన్న అనుకూలతలు, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు.

## కంచ గచ్చిబౌలి భూములపై విచారణ చేపట్టాలి

చేసిన రూ.10వేల కోట్ల ఆర్థిక మోసం. దీనిపై ఇప్పటికే దర్యాప్తు సంస్థలకు ఆధారాలతో సహా తెలిపాం. ఆర్థిక అవకతవకల అంశాన్ని కేంద్ర సాధికార కమిటీ నిర్ధరించింది. స్వతంత్ర విచారణ చేయాలని సూచించింది. దీనిపై వెంటనే కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి" అని కేటీఆర్ కోరారు.

## బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మహిళలకు పెద్దపీట

జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్ పర్సన్ రజినీ సాయిచంద్, నవీన్ ఆచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి గులాములం కాబోము

రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ స్పందించారు. ఢిల్లీ పరిపాలనకు లొంగని ప్రత్యేకత తమిళనాడుకు ఉందని.. భాషా వివాదం నేపథ్యంలో ఇప్పటికే ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ఇక్కడ కుదరదని వ్యాఖ్యానించారు. 2026 ఎన్నికల్లో కూడా తమ పార్టీనే అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు.తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు ఇస్తామని.. త్రిభాషా సూత్రాన్ని అమలు చేయబోమని అమిత్ షా హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. డీలిమిటేషన్ (పార్లమెంటరీ ఎన్నికల్లో)తో సీట్లను తగ్గించమని చెప్పగలరా అని నిలదీశారు. ఇటీవల కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళనాడు ప్రజలను కించపరిచేలా మాట్లాడారని.. అమిత్‌షా సైతం అదే విధమైన వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. రాజ్యాంగం ప్రకారమే కేంద్రం, రాష్ట్రాలు ఏర్పాటయ్యాయని.. ఎవరూ ఎవరికి సబార్డినేట్ కాదని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేర్కొన్నారని పునరుద్ఘాటించారు.వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అన్నాడీఎంకేతో కలిసి పోటీ చేయనుంది. 2026లో తమిళనాట అధికారంలోకి వస్తామని భాజపా అగ్రనేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా.. జాతీయ విద్యలో త్రిభాషా సూత్రం, డీలిమిటేషన్ మొదలైన విషయాలపై తమిళనాడు ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో తీవ్రంగా తలపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం.. కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై విస్తృతంగా పోరాటం చేస్తోంది.దీని కోసం ఇటీవల ఆయన ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రాల స్వయం సాధికారత కోసం అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## జేఈఈ (మెయిన్) సెషన్-2 ఫైనల్ కీ మళ్లీ విడుదల..

కారణమేంటో తెలపకపోవడంతో విద్యార్థులు, తల్లి దండ్రులు తీవ్ర గందరగోళానికి గురైన విషయం తెలిసిందే. దీంతో ఎన్‌టీఏ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం మరోసారి తుది కీని విడుదల చేసిన ఎన్‌టీఏ.. ఫిజిక్స్‌లో రెండు ప్రశ్నలను (ఐడీలు: 347577562, 347577939) విరమించుకున్నట్లు పేర్కొంది. మరోవైపు, జేఈఈ మెయిన్ పరీక్షల షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం ఏప్రిల్ 17 నాటికి ఫలితాలు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ.. నిర్ణీత గడువులోగా రిజల్ట్స్ ఇవ్వడంలోనూ %మీూ% విఫలమైందంటూ విమర్శలు వస్తున్నాయి. దీంతో శుక్రవారం ఉదయం స్పందించిన ఎన్‌టీఏ.. శనివారం లోగా ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అలాగే, ఈ మధ్యాహ్నం 2గంటల కల్లా తుది కీ విడుదల చేస్తామని ప్రకటించడంతో విద్యార్థులు ఎదురుచూశారు. అయితే, తుది కీని సైతం చెప్పిన సమయం కన్నా గంటకు పైగా ఆలస్యంగా విడుదల చేయడంతో ఎన్టీఏ అధికారుల తీరుపై పలువురు నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు.'మధ్యాహ్నం 2గంటల వరకు ఎదురుచూశాం. ఆ సమయం అయి పోయింది. ఏదైనా అప్‌డేట్ ఉందా? అని ఒకరు పోస్టు పెట్టారు మీరు ఇచ్చిన కమిట్‌మెంట్ ప్రకారం ఈ మధ్యాహ్నం 2గంటలకు తుది కీ విడుదల చేయాలి. కానీ, ఇప్పటివరకు ఎలాంటి అప్‌డేట్ లేదు. ఏం జరుగు తుందో దయచేసి నిర్ధారిస్తారా?' అని మరొకరు పోస్టు చేశారు.

## ఛత్తీస్‌గఢ్‌లో 22 మంది మావోయిస్టుల లొంగుబాటు

విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నారని పోలీసులు చెప్పారు.లొంగిపోయిన వారిలో మావోయిస్టు మిలిటరీ డిప్యూటీ కమాండర్ ముచాకి జోగా, స్క్వాడ్ సభ్యురాలు.. అతని భార్య ముచాకి జోగి ఉన్నారని, వీరిపై రూ.8 లక్షల రివార్డు ఉండగా.. మావోయిస్టుల ఏరియా కమిటీ సభ్యులు దేవే, దుధి బుద్రాలపై ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉందన్నారు. మరో ఏడుగురు కార్యకర్తలపై రూ.2 లక్షల రివార్డు, ఒకరిపై రూ.50వేలు రివార్డు ఉన్నట్లు తెలిపారు. వీరందరికీ ఒక్కొక్కరికి రూ.50,000 సాయం అందించామని.. ప్రభుత్వ పునరావాస పథకాన్ని వర్తింపజేస్తామని చెప్పారు. గతేడాది సుక్మాతో సహ బస్తర్ ప్రాంతంలో దాదాపు 792 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు.వచ్చే ఏడాది మార్చి 31 నాటికి పూర్తిగా తుడిచిపెడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం పునరుద్ఘాటించిన నేపథ్యంలో మావోయిస్టుల లొంగుబాటు ప్రాధాన్యం సంతరించుకుంది. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన సీఆర్పీఎఫ్ 86వ వ్యవస్థాపక దినోత్సవాల పరేడ్‌లో షా మాట్లాడుతూ.. మావోయిస్టులు లేని భారత్ దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మావోయిస్టుల ఏరివేత మిషన్‌కు సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) వెన్నెముకగా నిలిచిందని ప్రశంసించారు. ఫలితంగా ఆ ప్రాంతాల్లో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు 70శాతానికి పైగా తగ్గి ఇప్పుడు ముగింపు దశకు చేరాయన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలను అరికట్టడం కోసం ప్రత్యేక కోబ్రా దళాన్ని ఏర్పాటుచేశామన్నారు.

# అకాల వర్షంతో నగరం అతలాకుతలం



కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చాలా చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ట్రాఫిక్ స్తంభించింది అధికారులతో సమీక్షించిన మంత్రి పొన్నం అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరం అతలాకుతలమైంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సహాయకచర్యల్లో తీవ్ర జాప్యం నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో సహాయక చర్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ అధికారులను అప్రమత్తం చేశారు. కూలిన చెట్లను వెంటనే తొలగించాలని డీఆర్ఎఫ్ సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరోసారి భారీ వర్షం పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రోడ్లపై నీరు నిలిస్తే వెంటనే తొలగించాలని పొన్నం సూచించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. బండ్లగూడలో 8 సెం.మీ వర్షపాతం నమోదైంది. బహదూర్‌పురలో 7.8 సెం.మీ , చార్మినార్‌లో 7.6 సెం.మీ, నాంపల్లిలో 6.9 సెం.మీ, అంబర్‌పేటలో 5 సెం.మీ, ఖైరతాబాద్‌లో 4.4 సెం.మీ, కుత్బుల్లాపూర్‌లో 4.3 సెం.మీ ల వర్షపాతం నమోదైనట్లు- అధికారులు తెలిపారు.

## కర్నాటకలో రోహిత్ వేముల చట్టాన్ని రూపొందించండి

అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తావించారు. విద్యావ్యవస్థలో నేటికి బలహీన వర్గాలు కుల వివక్షను ఎదుర్కొంటున్నాయని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దళిత విద్యార్థులెవరూ అటువంటి వివక్షను ఎదుర్కోకుండా ఉండాలంటే 'రోహిత్ వేముల' చట్టాన్ని రూపొందించాలని.. రాష్ట్రంలో ఈ చట్టాన్ని అమలు చేయాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు సూచించారు. ఈ మేరకు కర్ణాటక సీఎంకు రాహుల్ గాంధీ లేఖ రాశారు. నేటికి కూడా మన విద్యావ్యవస్థలో దళిత, ఆదివాసీ, ఓబీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం సిగ్గుచేటు. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలి. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఇకనైనా ఈ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రాహుల్ గాంధీ లేఖలో పేర్కొన్నారు. వేముల రోహిత్ 2016లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఆత్మహత్యకు యూనివర్సిటీ అధికారులు, ఇతర విద్యార్థి సంఘాలే కారణమనే ఆందోళనలు సాగాయి. దేశవ్యాప్తంగా అనేక రాజకీయపార్టీలు స్పందించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రెండుసార్లు హైదరాబాద్‌కు వచ్చి వెళ్లారు. పోలీసులు దర్యాప్తు చేసి 2023 నవంబరులో తుది నివేదిక రూపొందించారు.గతేడాది మార్చి 21న దర్యాప్తు అధికారి ఆ నివేదికను న్యాయస్థానానికి సమర్పించారు. అతని ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. అలాగే అతను ఎస్సీ అనేందుకు ఎటువంటి ఆధారాలు కూడా లేవని, బీసీ వడ్డెర కులానికి చెందినవాడని పేర్కొన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పలు పిటిషన్లలో విచారణను ముగించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ఈ కేసుపై పునఃదర్యాప్తు కొనసాగించాలని ఆదేశించింది. పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో రాహుల్ కర్నాటక సిఎం సిద్ధరామయ్యకు లేఖ రాయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వెనుకబడిన వర్గాల బిడ్డగా అంబేద్కర్ ఎదుర్కొన్న కష్టాన్ని మరే బిడ్డా ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవడానికి సిద్ధరామయ్య కృషి చేస్తారని తాను నమ్ముతున్నట్లు రాహుల్ పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు చూపిన వివక్షతో రోహిత్ వేముల, పాయల్ తడ్వి, దర్శన్ సోలంకి వంటి మంచి భవిష్యత్తు ఉన్న ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారని.. ఇకనైనా ఇటువంటి హత్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైందని రాహుల్ అన్నారు.

## విదేశీ విద్యార్థులపై ట్రంప్ కఠినవైఖరి

పొంచి ఉంది. హార్వర్డ్, స్టాన్ఫర్డ్, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్, ఒహాయో స్టేట్ యూనివర్సిటీ సహా కొన్ని చిన్న కాలేజీల విద్యార్థులు ఈ ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. మొత్తంగా మార్చి చివరి వారం నుంచి ఇప్పటివరకు 160 కాలేజీల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. కనీసం 1024 మంది విద్యార్థుల వీసాలు రద్దు అయినట్లు అసోసియేటెడ్ ప్రెస్ అంచనా వేసింది. ఇదే సమయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ చర్యలకు వ్యతిరేకంగా కోర్టుల్లో దావాలు వేస్తున్న విద్యార్థులు.. తమ వీసా రద్దు చేయడానికి ప్రభుత్వం వద్ద ఎటువంటి సమర్థనీయ అంశాలు లేవని వాదిస్తున్నారు. వీసా రద్దుకు అనేక కారణాలు చూపెడుతున్నప్పటికీ.. చిన్న ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన ఘటనలే ఎక్కువగా ఉన్నాయని గుర్తించినట్లు కాలేజీలు పేర్కొంటున్నాయి. మరికొన్ని కేసుల్లో మాత్రం విద్యార్థులను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే విషయంపై స్పష్టత లేదు. "ఈ వీసాలను రద్దు చేస్తున్న సందర్భం, విధానం చూస్తుంటే.. దేశవ్యాప్తంగా భారీ సంఖ్యలో విద్యార్థి వీసాలను రద్దు చేసే విధానాన్ని డీహెచ్‌ఎస్ అవలంబిస్తుందనే ప్రశ్న తలెత్తుతోంది" అని మిషిగాన్ యూనివర్సిటీ తరఫున వాదిస్తున్న లాయర్లు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యూ హ్యాంప్‌షైర్‌లోని కాలేజీ విద్యార్థులు వేసిన దావాలోనూ ఇటువంటి అంశాలనే ప్రస్తావించారు. వీటిపై మాత్రం హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేదని తెలుస్తోంది. విద్యార్థి వీసా రద్దైతే.. ఇమిగ్రేషన్ అధికారులు నిర్బంధించే ప్రమాదం ఉంది. అందుకే అరెస్టుకు భయపడిన కొందరు విద్యార్థులు చదువులు పూర్తి చేయకుండానే దేశం విడిచి వెళ్తున్నట్లు సమాచారం. ఇలా వీసా రద్దు, అరెస్టు చేయడం వంటి చర్యలు.. విదేశీ విద్యార్థులను అమెరికా చదువుల పట్ల నిరుత్సాహానికి గురిచేస్తాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇలా వీసా రద్దు, అరెస్టు చేయడం వంటి చర్యలు.. విదేశీ విద్యార్థులను అమెరికా చదువుల పట్ల నిరుత్సాహానికి గురిచేస్తాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏయే అంశాల ఆధారంగా వీటిని రద్దు చేస్తున్నారనే దానిపై క్లారిటీ లేకపోవడం విద్యార్థుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని చెబుతున్నారు. మరోవైపు, విద్యార్థుల్లో భరోసా కల్పించేందుకు ప్రయత్నిస్తున్న కొన్ని కాలేజీలు.. వీసాల రద్దుకు సంబంధించి ఫెడరల్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని పేర్కొంటున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు మాత్రం విద్యార్థులకు ప్రయాణాల్లో జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నాయి. పాస్‌పోర్టులు, ఇమిగ్రేషన్ దస్త్రాలను తమవెంట ఉంచుకోవాలని చెబుతున్నాయి.

## యుద్ధం ముగించలేకపోతే.. మా దారి మేం చూసుకుంటాం

**ఉక్రెయిన్‌కు అమెరికా హెచ్చరికలు**

**వాషింగ్టన్(జనంసాక్షి):**ఉక్రెయిన్ యుద్ధం ముగించడం సాధ్యంకాని పక్షంలో.. చర్చల ప్రయత్నాలు ఆపేసి అమెరికా తన దారి తాను చూసుకుంటుందని ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో తేల్చి చెప్పారు. తాజాగా పశ్చిమాసియాకు ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌తో కలిసి ఆయన ఐరోపా, ఉక్రెయిన్ నాయకులతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు."ఇది మా యుద్ధం కాదు. మేము మొదలుపెట్టలేదు. గత మూడేళ్ల నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా సాయం చేస్తోంది. ఇక దానిని కూడా ముగించాలని మేము భావిస్తున్నాం. ఎందుకంటే.. ఇది మా యుద్ధం కాదు.అధ్యక్షుడు ట్రంప్ దాదాపు 87 రోజులపాటు అత్యున్నత స్థాయిలో ఈ యుద్ధానికి ఓ ముగింపు తెచ్చేందుకు యత్నించారు. ఇక ఈ యుద్ధానికి ముగింపు సాధ్యమా.. కాదా అన్న విషయం మేము తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకే ఇరుపక్షాలతో చర్చలు జరుపుతున్నాం" అని రూబియో చెప్పారు.

# ఎడారుల్లా చెరువులు, వాగులు


- తాగునీటికీ ప్రజల ఇబ్బందులు
- అడవులను వీడుతున్న వన్య ప్రాణులు
- మైదానాలను తలపిస్తున్న చెరువులు



**ఆదిలాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనంసాక్షి):** ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు దంచి కొడుతున్నాయి. గతంలో లేని విధంగా ఈసారి ఎండలు తమ ప్రతాపం చూపిస్తున్నాయి. ఎండ దాటికి ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈసారి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైనే నమోదు అవుతుండడం విశేషం.. జిల్లాలో అక్కడక్కడ చెట్ల నరికివేత కారణంగా ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఎండ వేడికి జిల్లాలో మంచి నీటికి తీవ్ర ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. వాగులు, వంకలు పూర్తిగా అడుగంటి పోతున్నాయి. అడవుల్లో చుక్కా నీరు



లభించక పోవడంతో అడవుల్లో తల దాచు కుంటున్న జింకలు, దుప్పులు, నెమళ్ళు, నీలు గాయిలు అడవులను వీడి పక్కనే ఉన్న మహారాష్ట్రా అడవుల్లోకి వలస వెళ్తున్న పరిస్థితి దాపురించింది. ఇదిలా ఉంటే మంచి నీరు దొరక్క అటవీ ప్రాంతాల సమీపంలో నివాసం ఉంటున్న ఆదివాసీ గిరిజనులు దూర ప్రాంతాలనుంచి అష్ట కష్టాలు పడుతూ నీటిని తెచ్చుకుంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగుల్లో చుక్కా నీరు లేక రాళ్ళు రప్పలతో దర్శనం ఇస్తున్నాయి. మరోవైపు చెరువుల్లో ఎప్పుడు పుష్కలంగా ఉండాల్సిన నీరు ఈసారి పూర్తిగా అడుగంటి పోతున్నాయి. జిల్లాలో మొత్తం 240 చెరువులు ఉండగా వాటిలో సగం వరకు నీరు లేక ఎండిపోయి కన్పిస్తున్నాయి. మిగిలిన కొద్దిపాటి చెరువుల్లో నీరు అంతంత మాత్రమే నిలువ ఉన్నాయి. నీరు లేక జిల్లా లోని చెరువులన్నీ మైదానాలను తలపిస్తున్నాయి. ఇటు తాగేందుకు మంచి నీరు దొరక్క, అటూ పండించే పంటలకు నీరు లభించక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షపాతం అతి తక్కువగా నమోదు కావడం కారణంగానే ఈ పరిస్థితికి కారణం ఏర్పడింది అని భూ గర్భశాఖా అదికారులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసే వరకు పరిస్థితి ఇదే విధంగా ఉండే అవకాశం ఉంటుందని జిల్లా సంబంధిత అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు. ముఖ్యంగా పల్లెల్లో బోరు బావులు, నూతులు ఎండిపోవడం కారణంగా నీటికి ప్రజలు అల్లాడి పోతున్నారు. బిందెడు నీళ్ళ కోసం అడవిలో కిలో మీటర్ల మేర దూరం ఖాళీ నడకన ప్రయాణం చెయ్యాల్సిన పరిస్థితి నెలకొంది.



# ఉపయోగంలోకి పేస్ట్ ఫిల్ టెక్నాలజీ

- సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్ కంపెనీ ఘనత



(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)

బొగ్గు తవ్వకాలలో పేస్ట్ ఫిల్ టెక్నాలజీని ఉపయోగించిన మొదటి బొగ్గు కంపెనీగా సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ అవతరించింది. ఈ పర్యావరణ అనుకూల భూగర్భ మైనింగ్ సాంకేతికతను ప్రోత్సహించడానికి, ఎస్ఇసిఎల్, టి ఎం సి మినరల్స్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య రూపాయలు 7040 కోట్ల విలువైన ప్రాజెక్టు కోసం ఒక ఒప్పందం కుదిరింది. పేస్ట్ ఫిల్లింగ్ అనేది ఒక కొత్త భూగర్భ మైనింగ్ టెక్నిక్, దీనిలో గని నుండి బొగ్గును తీసిన తర్వాత ఏర్పడే ఖాళీలను ప్రత్యేక పేస్ట్‌తో నింపుతారు. ఈ పేస్ట్‌ను ఫ్లై యాష్, ఓపెన్‌కాస్ట్ గనుల నుండి పొందిన చూర్ణం చేసిన ఓవర్‌బర్డెన్, సిమెంట్, నీరు మరియు అంటుకునే రసాయనాల నుండి తయారు చేస్తారు. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం వల్ల తవ్వకాల తర్వాత భూమి మునిగిపోయే ప్రమాదం తొలగిపోతుంది మరియు ఉపరితల భూమిని స్వాధీనం చేసుకోవలసిన అవసరం కూడా ఉండదు. దీనితో పాటు, ఈ సాంకేతికతలో పారిశ్రామిక వ్యర్థాలను తిరిగి ఉపయోగిస్తారు, ఇది పర్యావరణ దృక్కోణం నుండి కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ ఒప్పందం ప్రకారం, ఎస్ఇసిఎల్ కోర్బా ప్రాంతంలోని సింఘలి భూగర్భ బొగ్గు గనిలో పేస్ట్ ఫిల్లింగ్ టెక్నాలజీ ద్వారా పెద్ద ఎత్తున బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 25 సంవత్సరాల కాలంలో 84.5 లక్షల టన్నుల (8.4 మిలియన్ టన్నులు) బొగ్గు ఉత్పత్తి అవుతుందని అంచనా. సింఘాలి భూగర్భ గనిని సంవత్సరానికి 0.24 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కోసం 1989లో ఆమోదించారు మరియు 1993లో కార్యకలాపాలు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ గనిలో దాదాపు 8.45 మిలియన్ టన్నుల జీ-7 గ్రేడ్ నాన్-కోకింగ్ బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయి. భూగర్భ కార్యకలాపాల కోసం లోడ్ హాల్ డంపర్లు మరియు యూనివర్సల్ డ్రిల్లింగ్ మెషీన్లు ఉపయోగించి బోర్డ్, పిల్లర్ పద్ధతిని ఉపయోగించి ఈ గనిని అభివృద్ధి చేశారు. అయితే, గని ఉపరితలం జనసాంద్రత కలిగిన ప్రాంతాలతో చుట్టుముట్టబడి ఉంది - గ్రామాలు, హై టెన్షన్ లైన్లు, రోడ్లు మొదలైనవి - దీని వలన భద్రత మరియు పర్యావరణ దృక్కోణం నుండి సాంప్రదాయ గుహ పద్ధతుల ఉపయోగం సాధ్యం కాదు. సింఘలి భూగర్భ గనిలో ఉపరితల భూమిని సేకరించకపోవడం వల్ల డీపిల్లరింగ్ పనులు ప్రారంభించలేకపోయారు. ఇప్పుడు, పేస్ట్ ఫిల్లింగ్ టెక్నిక్ ద్వారా ఈ గనిలో మైనింగ్ పనిని తిరిగి ప్రారంభించవచ్చు. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూపాయలు 7040 కోట్లు, మరియు దీని ప్రాథమిక లక్ష్యం గ్రీన్ మైనింగ్ పద్ధతులను ప్రోత్సహించడం. ఇది ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించడంలో కూడా సహాయపడుతుంది.

# కాంగ్రెస్ స్పాన్సర్డ్ ఎంఐఎం సభ

- తెలంగాణలో బెంగాల్ తరహా పరిస్థితులు!
- జరగబోయే పరిణామాలకు రేవంత్ రెడ్డి సర్కార్ దే బాధ్యత
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ హైదరాబాద్ లో నిర్వహించబోతున్న బహిరంగ సభకు రేవంత్ రెడ్డి సర్కార్ ఆర్థిక సహకారం అందిస్తోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. సభలు, సమావేశాలు, ఆందోళనల పేరుతో అల్లర్లకు కుట్ర చేస్తున్నాయని చెప్పారు. ఇదే జరిగితే హైదరాబాద్ లో బెంగాల్ తరహా పరిస్థితులు ఉత్పన్నమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కట్టడి చేయాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో జరగబోయే పరిణామాలకు రేవంత్ రెడ్డి సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో బీజేపీకి ఏం సంబంధమని బండి సంజయ్ ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రెడ్డి, కార్యదర్శులు ఎస్.ప్రకాశ్ రెడ్డి, ఉమారాణి, అధికార ప్రతినిధులు విఠల్, రాణి రుద్రమాదేవి, ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్ రావు, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ తదితరులతో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ హెరాల్డ్ కేసు విచారణను పూర్తి చేసిన ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ 2025 ఏప్రిల్ లో ఛార్జ్ షీట్ దాఖలు చేసి కోర్టుకు సమర్పించిందని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రధాన నిందితులుగా పేర్కొందని ప్రైవేట్ వ్యక్తులైన సోనియాగాంధీ కుటుంబం కాంగ్రెస్ పార్టీ నిధులను వాణిజ్య అవసరాల కోసం వాడుకుని మనీ లాండరింగ్ కు పాల్పడిందని అందులో పేర్కొందని తెలిపారు. ఇందులో బీజేపీ కక్షసాధింపు ఏముందని ప్రశ్నించారు.

# సింగరేణి బొగ్గు ధర పైపైకి..



**(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి) :** పెన్షన్ నిధి ని పెంచడం కోసం అన్ని గ్రేడ్ ల బొగ్గు మీద 20 రూపాయలు పెంచడం జరుగుతుందని సింగరేణి యాజమాన్యం పేర్కొంది. ప్రతీ టన్ను బొగ్గు మీద 20 రూపాయలు పెంచడం జరుగుతుందని, సింగరేణి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ జారీ చేసిన లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి ఈ బొగ్గు ధర పెంపును అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు.

# పేద రైతుల కన్నీళ్లు తుడిచేందుకే 'భూభారతి'

- పార్ట్- బీలో ఏడు లక్షలు ఎకరాలకు పరిష్కారం చూపిస్తాం
- అబాదీ ఇళ్లకూ డాక్యుమెంట్లు
- త్వరలో భూభారతి టోల్‌ఫ్రీ నెంబర్
- గిరిజన ప్రాంత సమస్యలపై కమిటీ ఏర్పాటు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 18(జనంసాక్షి) :** పేద రైతుల కన్నీళ్లు తుడిచేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం కుట్ర పూరితంగా పార్ట్ -బి లో పెట్టిన 18 లక్షల ఎకరాలలో ఆరు నుంచి ఏడు లక్షల వరకు వ్యవసాయ భూములు ఉన్నాయని ఈ భూములకు ఈ భూభారతి చట్టంతో పరిష్కారం చూపిస్తామని తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, ప్రిన్సిపాల్ సెక్రటరీ ఫైనాన్స్ రామకృష్ణ రావు, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట శాసన సభ్యులు నాగరాజు, ప్రిన్సిపాల్ సెక్రటరీ సి సిఎల్ ఏ రెవిన్యూ బుద్ధ ప్రకాష్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌లతో భూభారతి పైలెట్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పేదల కన్నీటిని తీర్చేందుకే భూభారతి చట్టాన్ని తీసుకొచ్చాం అన్నారు. ఎన్నికలకు ముందు ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేము ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించి ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యంగా పనిచేస్తాం అన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తాం అన్నారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగారని ఇప్పుడు ఇంకా ఆ అవసరం రైతులకు లేదని అధికారులే రైతుల వద్దకు వచ్చి వారి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ధరణిపై గత పాలకులు ఏనాడు కూడా రెవెన్యూ సదస్సు పెట్టలేదని ఒకవేళ రెవెన్యూ సదస్సులు పెట్టి ఉంటే ఆనాడే ఆ ప్రభుత్వం పై ప్రజలు తిరగబడేవారని, గత పాలకులు చేసిన తప్పులను ఇప్పటికీ గ్రహించడం లేదని వారికి జ్ఞానోదయం కావడం లేదన్నారు. గతంలో 2020- ధరణి చట్టాన్ని తీసుకువస్తే మేం దానిని బంగాళాఖాతంలోకి విసిరేసి సామాన్య ప్రజల కోసం 2025- భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చాం పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు డాక్యుమెంట్లు లేని అబాదీ ఇల్లు అని పిలుచుకునే నివాస గృహాలకు డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా చర్యలు చేపడుతున్నాం అన్నారు. భూ భారతి సమస్యల పరిష్కారానికి గాను తమ కార్యాలయం, సిసిఎల్ఎ కార్యాలయంను అనుసంధానించే టోల్ ఫ్రీ నెంబరును త్వరలో ప్రజలకు తెలియజేస్తాం అని తెలిపారు. గిరిజన, గిరిజనేతరులు ఉండే ప్రాంతంలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఒక కమిటీని నియమిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. 2020 ధరణి చట్టంలో సాదా బైనమ అనే అంశాన్ని గత ప్రభుత్వం తొలగించిందనీ అన్నారు. గతంలో రైతులు సాదా బైనామ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న 9 లక్షల 24 వేల దరఖాస్తులలో సక్రమంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ చట్టం ద్వారా భూమిపై ఎవరైతే కాస్తు లో ఉంటారో వారికే పాస్ బుక్ ఇవ్వడం జరుగుతుందనీ తెలిపారు. గ్రామాలకే రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తారని భరోసా కల్పించారు. ధరణి పార్ట్ బి లో ఉన్న ఆరు నుంచి ఆరున్నర లక్షల ఎకరాల పేదవారి భూములకు భూభారతి 2025 చట్టం ద్వారా పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. నాయకుల స్వార్థం కోసం గాని, వారి ప్రయోజనాల కోసం చేసే చట్టం కాదు కేవలం పేద ప్రజల ప్రయోజనాల కోసం చేసిన చట్టమే భూభారతి చట్టం అని అన్నారు. ప్రజా ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుంది అన్నారు. మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ భూభారతి చట్టంతో రైతులందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ పేదల సంక్షేమ ధ్యేయంగా రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, తల్లి బిడ్డకు ఎలాంటి సంబంధం ఉంటుందో అదే తరహాలో భూమికి రైతుకు సంబంధం ఉంటుందని అన్నారు. కాస్తూలో ఉన్న నిజమైన రైతులకు భూమి హక్కు పత్రాలు కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు పోతున్నదని, భూమి రైతుకు ఆదాయం బలమని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం రైతులు పండించిన సన్నబడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వడమే కాకుండా పండించిన సన్న వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసి బియ్యం రూపంలో తిరిగి ప్రజలకే ఉచితంగా అందిస్తున్నదని అన్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ రామకృష్ణారావు మాట్లాడుతూ భూభారతి చట్టంతో రాష్ట్రమంతటా పండగ వాతావరణం మొదలైందని అన్నారు. ఈ చట్టంపై అవగాహన కోసం రాష్ట్వ్యాప్తంగా ప్రతి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు, జిల్లా కలెక్టర్ లు స్వయంగా ప్రతి రైతుతో మాట్లాడుతూ చట్టంపై అవగాహన పెంచుతూ రైతుల భూ సమస్యలను తెలుసుకుంటున్నారని వివరించారు. మహబూబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఎన్ ఆర్ నాగరాజు, ఏఎస్పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, డిఎఫ్ఓ రాహూల్ కిషన్ జాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, రెవిన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి కిరణ్ ప్రకాష్, ఆర్డిఓ వెంకటేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సాంస్కృతిక కళాకారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ -1 నోటిఫికేషన్ రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించండి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** గ్రూప్ -1 నోటిఫికేషన్ రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు. తెలంగాణ యువతకు, మరీ ముఖ్యంగా నిరుద్యోగులకు అనేక ఆశలు చూపి అధికారంలోకి వచ్చి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆక్షేపించారు. గ్రూప్ -1 పరీక్ష నిర్వహించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది నిరుద్యోగుల జీవితాలు అగాధంలోకి నెట్టివేయబడ్డాయని, నిర్వహణ తీరు, ఫలితాల వెల్లడిలో అనేక లోపాలు, అవకతవకలు ఉన్నాయని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదంటే పారదర్శకంగా ఉద్యోగ నియామకాల పట్ల మీకు ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో తేటతెల్లమవుతుంది. ఉద్యోగాల నియామకాల్లో పారదర్శకత, జవాబుదారి లోపించిందన్న విమర్శలు వస్తున్నాయని పేర్కొన్నారు. 'గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు ఒక హాల్ టికెట్ ఇష్యూ చేసిన టీజీపీఎస్సీ అధికారులు, మెయిన్స్ పరీక్షకు వేరే హాల్ టికెట్ జారీ చేశారు. సాధారణంగా ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు అదే హాల్ టికెట్ నంబర్ తో మెయిన్స్ పరీక్షలకు అప్పియర్ అయ్యే అవకాశం ఉంటుంది. కానీ ప్రిలిమినరీ పరీక్షల హాల్ టికెట్లు కాకుండా కొత్తగా జారీ చేసిన హాల్ టికెట్లతో మెయిన్స్ నిర్వహించడంపై మొదటి నుంచే అనేక సందహాలు నెలకొన్నాయి. వాటిని నివృత్తి చేయకుండానే మెయిన్స్ పరీక్షల తంతు ముగించారు. గ్రూప్ -1 పరీక్షలపై అభ్యర్థులు దాఖలు చేసిన కేసులు న్యాయస్థానాల పరిధిలో ఉండగానే గౌరవ ముఖ్యమంత్రి గారైన మీరు, మీ కేబినెట్ లోని పలువురు మంత్రివర్యులు గ్రూప్ -1 నియమకాల గురించి పలు సందర్భాల్లో మాట్లాడారు. త్వరలోనే ఈ నియామకాల ప్రక్రియ ముగించబోతున్నట్టు ప్రకటించారు. ఇలాంటి ప్రకటనలు కూడా అభ్యర్థుల్లో అనుమానాలు పెరగడానికి కారణమయ్యాయి. గ్రూప్ -1 పరీక్షలపై పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన గౌరవ తెలంగాణ హైకోర్టు తాము తుది ఆదేశాలు ఇచ్చే వరకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు ఇవ్వొద్దని కీలక ఆదేశాలు జారీ చేసింది. 563 గ్రూప్ -1 పోస్టుల భర్తీకి ప్రిలిమ్స్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులను 1 : 50 నిష్పత్తిలో ఎంపిక చేశామని టీజీపీఎస్సీ ప్రకటించింది. వారిలో 21,075 మంది మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారని పరీక్షల అనంతరం ప్రకటన చేసింది. ఫలితాలు ప్రకటించే సరికి ఆ అభ్యర్థుల సంఖ్య 21,085 మందికి చేరింది. అంటే మెయిన్స్ పరీక్షకు హాజరయ్యారని చెప్తున్న వారి సంఖ్య పదికి పెరిగింది. ఈ పెరిగిన పది మంది ఎక్కడి నుంచి వచ్చారనే సందేహాలు అభ్యర్థుల్లో నెలకొన్నాయి. ఉర్దూ మీడియంలో 9 మంది పరీక్షకు హాజరయ్యారని మొదట చెప్పిన టీజీపీఎస్సీ ఆ తర్వాత ఆ సంఖ్యను 10కి పెరిగింది. బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేసినా కూడా అభ్యర్థుల హాజరు విషయంలో ఎందుకు వ్యత్యాసాలు ఏర్పడ్డాయి ? సదరు అభ్యర్థులు నిజంగానే మెయిన్స్ పరీక్షలకు అప్పియర్ అయ్యారా లేదంటే తర్వాత వారిని తెచ్చి చేర్చారా అనే సందేహం మిగతా అభ్యర్థుల్లో నెలకొన్నది. అభ్యర్థులు రాసిన జవాబు పత్రాల మూల్యాంకనంపైనా అనేక సందేహాలు లేవనెత్తుతున్నారు. దేశంలోని ప్రముఖ యూనివర్సిటీల్లో పని చేస్తున్న నిపుణులైన ప్రొఫెసర్లతో వ్యాల్యుయేషన్ చేయిస్తామని మొదట ప్రకటించిన టీజీపీఎస్సీ రిటైర్డ్ ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించడంపైనా అభ్యర్థుల్లో అనుమనాలున్నాయి. అభ్యర్థుల్లో నెలకొన్న అనేక సందేహాల నేపథ్యంలో గ్రూప్ -1 నోటిఫికేషన్ ను పూర్తిగా రద్దు చేసి తిరిగి నోటిఫికేషన్ ఇచ్చి ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలి' అని విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ సర్కార్ ఉంటుందో.. ఊడుతుందో!

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వ్యాఖ్యలు

**వరంగల్, ఏప్రిల్18 (జనంసాక్షి) :** అబద్ధాల పునాదులపై నిర్మితమైన రేవంత్‌రెడ్డి సర్కార్ ఏ క్షణాన ఏం జరుగుతుందోనన్న భయాందోళన నడుమ ఊగిసలాడుతున్నదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అసత్యపు హామీలు, ఆరు గ్యారెంటీ-లంటూ ప్రజలను నమ్మించి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ సర్కార్ 16 నెలలుగా రాష్ట్రంలోని అన్ని వర్గాలతో ఛీత్కరింపులకు గురవుతున్నదని ఆరోపించారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత రాష్ట్రంలో ముఖ్యమంత్రి మారుడో... ప్రభుత్వం కూలుడో తప్పక జరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని నాలుగున్నర కోట్ల సబ్బండ వర్గాల ప్రజల ఆకాంక్షకు మేరకు పురుడుపోసుకున్న గులాబీ జెండా, కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని తెలిపారు. పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 27న హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి గులాబీ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు, తెలంగాణవాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి సర్కార్ అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని, రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు పెడితే అబాసుపాలవుతామన్న భావనతోనే ప్రభుత్వం సాహసం చేయడంలేదని మండిపడ్డారు. ఉద్యమ రథసారధి కేసీఆర్ తలపెట్టిన రజతోత్సవ సభలో ఏం అద్భుతాలు జరుగుతాయో.., గులాబీ బాస్ ఏం ప్రసంగిస్తాడోనని ప్రపంచమంతా ఎల్కతుర్తి సభ వైపే ఉరకలేత్తే ఉత్సాహంతో ఎదురు చూస్తున్నదని వివరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
19 ఏప్రిల్ 2025
తెలంగాణ

# ఇంద్రవెల్లి కాల్పులకు 44 ఏండ్లు



*ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆదివాసీలకు రక్షణ కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ (షెడ్యూల్ ప్రాంతం) భూమి బదలాయింపు చట్టం -1959 వచ్చింది. దీనికి 1970లో మార్పులు చేశారు. దీనినే 1/70 చట్టంగా పిలుస్తారు. దీని ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులకు భూ బదలాయింపులు (అమ్మకం, కౌలు, గిఫ్ట్) చెల్లకుండా చర్యలు చేపట్టారు. అడవిపై ఆదివాసీలకే హక్కు ఉండాలని ఈ చట్టం చెబుతోంది. ఆదివాసీ గిరిజనుల సంస్కృతిని, సాంప్రదాయాలను పరిరక్షించడం అంతరించిపోతున్న ఆదివాసీ తెగలను కాపాడడం కోసం 1/70 చట్టాన్ని తీసుకొచ్చింది. ఇన్ని చట్టాలు వచ్చినప్పటికీ పెద్ద ఎత్తున ఆదివాసీల భూములు అన్యాక్రాంతం అయ్యాయి. ఈ పరిణామాల తర్వాతే ఇంద్రవెల్లి సంఘటనకు దారి తీసింది.*

అది ఏప్రిల్ 20,1981 వలసదారుల దోపిడీ నిరాటంకంగా కొనసాగడం, భూముల అన్యాక్రాంతం, ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ శాఖల ప్రాబల్యం పెరగడం వలన, జీవనాధారమైన భూములు, పుట్టిన ప్రాంతంలోనే తమ అస్తిత్వం అన్యాక్రాంతం అయ్యాయి. వ్యాపారుల దోపిడీ, కూలీ రేట్లు, అటవీ భూములు లాంటి అంశాలపై గిరిజన రైతుకూలీ సంఘం ఇంద్రవెల్లిలో ఏప్రిల్ 20, 1981 నాడు ఒక సమావేశానికి పిలుపు నిచ్చింది. మొదలు సభను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. ఆదివాసుల నుంచి వస్తున్న స్పందనను చూసి సభపై నిషేధం విధించారు. ఈ విషయం తెలియని ఆదివాసులు జన సంద్రమై అడవిని దాటుకొని ప్రవాహంలా ఇంద్రవెల్లికి వచ్చారు. అడ్డుకునేందుకు పోలీస్ బలగాలు అడవుల్లో దిగాయి. వేలాదిగా వస్తున్న నిరాయుధులైన ఆదివాసులపై పోలీసులు తూటాల వర్షం కురిపించారు.ఆదివాసీలు బాటపట్టి అడవిలో పరుగులు తిస్తుంటే, పోలీస్ బలగాలు వెంటాడి కాల్చి చంపారు.

**60 మందికి పైగా కాల్పుల్లో ఊపిరి కోల్పోయారు!**

ఈ కాల్పుల్లో 60 మందికి పైగా ఆదివాసీలు మరణించగా 30 మందికి పైగా గాయపడ్డారు. దేశంలోనే అప్పట్లో ఆదివాసుల పైన జరిగిన ప్రభుత్వం దాష్టికంగా పేర్కొనవచ్చు. జలియన్ వాలా బాగ్‌లో జరిగిన సంఘటనను తలపించేదిగా పేర్కొనవచ్చు. అంతకు ముందు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మందమర్రి లో సిపిఐ నాయకులు విటి అబ్రహం, ఎండి. మునీర్ తదితరుల మీద భూస్వామి గూండాల దాడి, హత్యాప్రయత్నం కు నిరసనగా జనవరి 6, 1979లో బొగ్గు గని కార్మికులు విధులు బహిష్కరించి భారీ ర్యాలీ నిర్వహించారు. ఎలాంటి హెచ్చరిక లేకుండా పోలీసులు కాల్పులు జరుపగా అక్కడికక్కడే నలుగురు, ఆ తర్వాత ఇద్దరు, ఇలాంటి ఆరుగురు కార్మికులు తూటాలకు బలియ్యారు.18 మందికి పైగా గాయపడ్డారు. సిపిఐ మాజీ ఎమ్మెల్యే, దివంగత గుండా మల్లేష్ ఈ కాల్పుల సంఘటనలో తృటిలో తప్పించుకున్నారు. ఈ సంఘటన అనంతరం 1981 లో ఇంద్రవెల్లి సంఘటన జిల్లా లో జరిగింది. దేవాపూర్ లోని మద్దిమాడ వద్ద కూడ ఆదివాసీల మీద జరిగిన కాల్పుల్లో ఒకరు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఆదివాసీలు తమ హక్కుల కోసం, జల్, జమిన్ కోసం పోరాడుతూనే ఉన్నారు. ఇంకా వారి జీవితాల్లో మార్పు రాలేదు. ఖనిజాల కోసం అడవుల నరికి వేత, వారి గ్రామాల నుంచి సోకాల్డ్ అభివృద్ధి పేరిట తరిమి వేస్తున్నారు. అటవి శాఖ తో ఇంకా వివాదాలు, పోడు వ్యవసాయం మీద ఉక్కు పాదం కొనసాగుతూనే ఉన్నది. కనీస సౌకర్యాలకు నోచని జీవితాలు, ఎక్కడ వేసిన గొంగళి, అక్కడే చందం లాంటి గ్రామాలు ఉన్నాయి. తమ హక్కుల మీద అణిచివేతలు, సంపద లో భాగస్వామ్యం కూడ లేదు. ప్రభుత్వం ఆదివాసీల కోసం తెస్తున్న పథకాలు కూడ అమలు సరిగా కాకపోవడం, వైద్యం, విద్య, ఉపాధి లాంటివి వారికి అందక పోవడం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలి!

**తొలి నివాళి ఆతనిదే!**

1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పుల్లో వందలాది మంది గిరిజనులు చనిపోవడంతో వారి జ్ఞాపకార్థం ఇంద్రవెల్లిలో నిర్మించిన అమర వీరుల స్తూపానికి యేటా ఏప్రిల్ 20న మొదట నివాళులు సిడాం శంభుతో పాటు కుమ్ర ఈశ్వరి బాయిలు నిర్వహించే వారు. మావోయిస్టులపై ప్రభుత్వం నిషేధం విధించిన సమయంలో పోలీసులు అడ్డుకొనే ప్రయత్నాలు చేసినప్పటికి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని నివాళులు అర్పించే వారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్పించడానికి అవకాశం కల్పించడంతో గిరిజనులు ఇంద్రవెల్లి మృతుల వీరుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తున్నారు. జల్, జంగల్, జమీన్ కోసం పోరాటాలు చేసి అమరుడైన కుమ్రం భీం ఆశయ సాధన కోసం కెరమెరి మండలం జోడేఘాట్ లో జరిగే కార్యక్రమాన్ని శంభు నిర్వ హిస్తూ ఆదివాసీ గిరిజనుల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడంలో ముందుండే వారు. సీడాం శంభు 2018 జూలై 19 నాడు అనారోగ్యంతో రాత్రి చివరి శ్వాస వదిలినాడు.

**స్మారక స్థూపం ఏర్పాటు**


రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో అమరుల స్మారక స్థూపాన్ని నిర్మించారు. 1986 మార్చి 19న గుర్తు తెలియని వ్యక్తులు ఈ స్థూపాన్ని పేల్చేశారు. ప్రజా సంఘాల ఒత్తిళ్లు, ఆదివాసుల పోరాట ఫలితంగా 1987లో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ నిధులతో తిరిగి స్థూపాన్ని కట్టారు. ఇంద్రవెల్లి కాల్పుల్లో అసువులు బాసిన ఆదివాసీ బిడ్డలకు నివాళులు.



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# "సూపర్ పార్లమెంట్"లా సుప్రీంకోర్టు ?

**భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవల సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారం మరియు ఆర్టికల్ 142 ఉపయోగంపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. సుప్రీంకోర్టు రాష్ట్రపతి మరియు గవర్నర్లు శాసనసభలు ఆమోదించిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఇచ్చిన తీర్పును ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు. సుప్రీంకోర్టు "సూపర్ పార్లమెంట్" లాగా వ్యవహరిస్తోందని, ఆర్టికల్ 142ని "ప్రజాస్వామ్య శక్తులపై క్షిపణిగా" ఉపయోగిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు భారత రాజ్యాంగంలోని శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య సమతుల్యతపై ముఖ్యమైన ప్రశ్నలను లేవనెత్తాయి.**



**సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారాన్ని ప్రశ్నించిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్**

రాజ్యసభ ఛైర్మన్‌గా ఉన్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఏం మాట్లాడతారో ఊహించటం కష్టం. హైకోర్ట్, సుప్రీం కోర్టు లాయర్‌గా, గవర్నర్‌గా పనిచేసిన విశేష అనుభవం ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆయన వ్యవహార శైలి ఓ బాధ్యత గల రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి విజ్ఞతతో మాట్లాడినట్లు లేదు. ఆయన మాటలు, ప్రవర్తన కేంద్ర న్యాయ వ్యవస్థ సుప్రీంకోర్టు న్యాయ సమీక్షాధికారం పై ఎదురుదాడిగా కనిపిస్తున్నాయి.

కేరళ మాజీ గవర్నర్ అరిఫ్ మహ్మద్ ఖాన్,తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవిలా ధన్ ఖడ్ కూడా కేంద్రం నియమించిన గవర్నర్లు ఎలా ప్రవర్తించాలో అదే విధంగా వ్యవహరిస్తున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ రవి ఏళ్ల తరబడి ఆమోదించకుండా నిలిపివేశారు. కొన్ని బిల్లులను రాష్ట్రపతికి పంపారు. అక్కడ కూడా ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది.

ఈ విషయంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర శాసనసభ ఆమోదించిన తర్వాత ఆ బిల్లులు రాష్ట్రపతి లేదా గవర్నర్లు ఆ బిల్లులను ఎంత కాలం అయినా... ఏలాంటి నిర్ణయం తీసుకోకుండా పెండింగ్‌లో ఉంచకూడదని, గరిష్టంగా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. దీనికి ప్రాతినిధ్యం వహిస్తూ తమిళనాడు ప్రభుత్వం అటకెక్కిన బిల్లులను చట్టాలుగా ప్రకటించింది. ఇది రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి చట్టసభ హక్కులను తిరిగి కలిగించిన సుప్రీంకోర్టు నిర్ణయంగా పరిగణించాలి.

కానీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ దీనిని న్యాయవ్యవస్థ "సూపర్ పార్లమెంటు అన్నట్లు" వ్యవహరిస్తున్నది అని వ్యాఖ్యానించారు.ఆయన ప్రకారం, సుప్రీంకోర్టు ఆర్టికల్ 142 ఆధారంగా రాష్ట్రపతికి బిల్లులు ఎంత కాలంలో ఆమోదించాలో గడువులు విధించటం రాజ్యాంగ పరంగా సరికాదని అన్నారు. కానీ ఇదే రాజ్యాంగం రాష్ట్రపతి లేదా గవర్నర్ సకాలంలో నిర్ణయం తీసుకోకపోతే, ఆ చర్య లపై న్యాయ విచారణకు అవకాశం ఇస్తున్న (ఆర్టికల్ 201)ని పేర్కొన్నారు అనే అంశాన్ని విస్మరించారు. రాష్ట్రపతి కానీ, గవర్నర్ కానీ బిల్లులు ఆమోదించే తమ అధికారాన్ని వాడకుండా, అలా ఎంత కాలం అయినా నిలిపివేయడం ద్వారా ప్రజలుగా ఎన్నుకున్న ప్రభుత్వాల నిర్ణయాలను అడ్డుకోవడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? ఇది న్యాయమా? ధర్మమా? . న్యాయస్థానం ఇది తప్పు అని చెబితే, దాన్ని సూపర్ పార్లమెంట్ అంటూ విమర్శించటం ఎంతవరకు సమంజసం? ఇది కేంద్ర న్యాయవ్యవస్థ తనకు గల న్యాయ సమీక్షాధికారాన్ని బాధ్యతగా తీసుకున్న నిర్ణయంగా భావించాలి, గవర్నర్ లు కేంద్ర ప్రభుత్వానికి తొత్తులుగా మారి, నిష్పాక్షికంగా వ్యవహరించ వలసిన గవర్నర్ పదవీ దుర్వినియోగాన్ని ఎదుర్కొనడానికి తప్పనిసరి పరిస్థితుల్లో సుప్రీంకోర్టు తీసుకున్న చర్యగా భావించాలి. ధన్‌ఖర్ న్యాయవాదిగా ఎంతో అనుభవం ఉన్నవారు. అయినప్పటికీ, ఆయన రాజ్యసభ ఛైర్మన్‌గా నిష్పాక్షికంగా సభను నడిపకుండా బీజేపీ ఎంపీగా లేదా బీజేపీ మద్దతుదారుగా పక్షపాత వైఖరితో సభను నడపటంపై ఇప్పటికే అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. ఆయన రాజ్యసభలో బీజేపీ రాజకీయ మేళవింపుతో పనిచేస్తున్నట్టు విమర్శలు అనేకం వచ్చాయి. రాజ్యాంగ పద్ధతుల రక్షణ కోసం తీసుకున్న న్యాయ నిర్ణయాన్ని విమర్శించడం, ప్రజాస్వామ్య విలువలను తక్కువ చేయడమే కాదు. అది రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి మర్యాదకూ కూడా భంగం కలిగించడమే.. సుప్రీంకోర్టు నిష్పాక్షిక న్యాయ సమీక్షాధికారాన్ని ధిక్కారించేలా మాట్లాడటం ఉపరాష్ట్రపతిగా / రాజ్యసభ ఛైర్మన్‌గా తగదు.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# అర్నబ్ గోస్వామి"డీప్ స్టేట్" ప్రచారం - విచారణ అవసరం



అర్నబ్ గోస్వామి, "రిపబ్లిక్ టీవీ" ఎడిటర్-ఇన్-చీఫ్‌గా, భారతీయ మీడియాలో ఆక్రమణాత్మక, సంచలనాత్మక శైలితో ప్రసిద్ధి చెందారు. ఆయన ఇటీవల "డీప్ స్టేట్" అనే భావనను తీవ్రంగా ప్రచారం చేస్తూ, బ్యూరోక్రాట్‌లు, న్యాయ మూర్తులు, విపక్ష నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులతో కూడిన రహస్య సమూహం అమెరికా సంస్థల (సీఐఏ, ఎఫ్‌బీఐ)తో కలిసి మోదీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రలు పన్నుతోందని ఆరోపిస్తున్నా రు. ఈ వాదన రాజకీయ ధ్రువీకరణను రెచ్చగొడుతూ, ప్రజాస్వామ్య చర్చను దెబ్బతీస్తోంది. ఈ ఆరోపణల సత్యాసత్యాలను నిర్ధారించేం దుకు భారత ప్రభుత్వం క్షుణ్ణమైన విచారణ జరపాలి. అర్నబ్ యొక్క "డీప్ స్టేట్" వాదన అమెరికన్ రాజకీయాల నుండి స్వీకరించబడినది, ఇక్కడ ఎన్నిక కాని వ్యక్తులు రాజ్యాధికారాన్ని అనధికారికంగా నియంత్రిస్తారని ఊహిస్తారు. భారతదేశంలో, ఆయన ఈ భావనను వ్యవసాయ చట్టాలు, పౌరసత్వ సవరణ చట్టం వంటి మోదీ సంస్కరణలను అడ్డుకునే కుట్రగా చిత్రీకరిస్తారు. రాహుల్ గాంధీ, ఒవైసీ సోదరులు, ఫారూఖ్ అబ్దుల్లా, చంద్రబాబు నాయుడు వంటి నాయకులు అమెరికా రాయబారులతో కలవడాన్ని ఆయన కుట్ర సూచనగా చూపిస్తారు. అయితే, ఈ కలయికలు దౌత్యపరమైన, వాణిజ్య సంబంధాలలో సహజమైనవి. వీటిని అతిశయోక్తిగా చిత్రీకరించడం ఆధారరహితం. అర్నబ్ వాదనలకు నమ్మదగిన ఆధారాలు లేవు. 2020 రైతు ఆందోళనలు, పెగాసస్ స్పైవేర్ వివాదం, అదానీ ప్రాజెక్టులపై వ్యతిరేకతలను డీప్ స్టేట్ కుట్రలుగా ముద్రవేయడం సమర్థనీయం కాదు. "ది వైర్" వంటి సంస్థలు పెగాసస్ వాడకాన్ని నిర్ధారించినప్పటికీ, అర్నబ్ దానిని తిరస్కరించారు. ఆయన చర్చలు ఆధారాలపై కాక, అరుపులు, బెదిరింపులతో ఇతరులను మాట్లాడనీయకుండా చేసే శైలిపై ఆధారపడతాయి. ఇది జర్నలిజం యొక్క నైతికతను ప్రశ్నిస్తుంది. ఈ ప్రచారం బీజేపీకి రాజకీయ లబ్ధి చేకూరుస్తుంది. విపక్షాలు, మైనారిటీలను శత్రువులుగా చిత్రీకరించడం ద్వారా బీజేపీ మద్దతుదారులను ఉత్తేజపరుస్తుంది. 2021 ఆక్సిజన్ కొరత వంటి పాలనా వైఫల్యాల నుండి దృష్టిని మరల్చడానికి ఈ వాదన సహాయపడుతుంది. రిపబ్లిక్ టీవీ, బీజేపీ-సంబంధిత రాజీవ్ చంద్రశేఖర్ ఆర్థిక సహాయంతో నడుస్తూ, బీజేపీ ఎజెండాకు అనుగుణంగా విమర్శకులను "దేశద్రోహులు"గా ముద్ర వేస్తుంది. 2024 ఎన్నికల్లో "విదేశీ ఎజెండా" వ్యతిరేక ప్రచారంలో ఈ వాదన కీలకంగా మారింది. అర్నబ్ యొక్క శైలి సమాజంలో విభజనను రెచ్చగొడుతుంది. కోవిడ్-19 సమయంలో తబ్లీఘి జమాత్‌పై అసత్య ఆరోపణలు, సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసులో రియా చక్రవర్తిని లక్ష్యంగా చేసుకోవడం ఆయన సంచలనాత్మక జర్నలిజాన్ని బహిర్గతం చేస్తాయి. ఈ ఆధారరహిత ఆరోపణలు ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయి. అర్నబ్ వాదనలు దేశ ఇంటెలిజెన్స్ సంస్థల సామర్థ్యాన్ని పరోక్షంగా ప్రశ్నిస్తూ, జాతీయ భద్రతపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. భారత ప్రభుత్వం ఈ "డీప్ స్టేట్" ఆరోపణలపై తక్షణ విచారణ జరపాలి. అర్నబ్ చేస్తున్న వాదనలకు ఆధారాలు ఉన్నాయా, లేక ఇవి రాజకీయ లబ్ధి కోసం సృష్టించిన కల్పిత కథనాలా అనేది స్పష్టం చేయాలి. నిజమైతే, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలిబీ అసత్యమైతే, విద్వేషాన్ని రెచ్చగొట్టే ఈ ప్రచారాన్ని అరికట్టాలి. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజం, కానీ ఆధారరహిత ఆరోపణలతో సమాజాన్ని విభజించడం అనైతికం. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో సీరియస్‌గా స్పందించి, సత్యాసత్యాలను వెలికితీయాలి.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

# 'ఆర్ఎస్ఎస్ లోతుపాతులు'

**(పుస్తక సారాంశం)**

పద్మశ్రీ అవార్డు గ్రహీత, కన్నడ రచయిత దేవనూర్ మహాదేవ రాసిన చిన్న పుస్తకం, నికరంగా 35 పేజీలు మాత్రమే, కర్ణాటక లో సంచలనం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కుదుపు కుదిపింది, వారం రోజుల్లో లక్ష కాపీలు అమ్ముడయ్యాయి, ఇంగ్లీష, హిందీ, వివిధ ప్రాంతీయ భాషల్లోకి అనువాదం అవుతుంది. తెలుగులోనూ అనువాదం అయ్యి లక్ష కాపీలు ప్రజల చెంతకు చేరుతున్నాయి. పుస్తకం పేరు "ఆర్.ఎస్.ఎస్ లోతుపాతులు". దేశ వ్యాప్తంగా ఇంత ఆదరణ పొందడానికి ఇందులో ఏముందో తెలుసుకుని తీరాలి. రచయిత తన రచన అంకితం ఇస్తూ ఇలా అంటాడు "విశ్వ మానవులైన పిల్లలకు... పెరిగే క్రమంలో కూడా విశ్వమానవులుగానే మిగలాలన్న ఆశతో ఈ పుస్త కం అంకితం." నవ భారత పిల్లలు ఆర్.ఎస్.ఎస్ బారిన పడకుండా ఉండటం కో సం రచయిత ఆవేదన, భాధ్యత తెలియజేస్తుంది. ఆర్.ఎస్.ఎస్ ప్రాణం ఎక్కడుందో తెలియ జేస్తూ గోల్వాల్కర్, వి.డి. సావర్కర్ రచనలు నుండి ముఖ్యమైన కొన్ని ఉటంకింపులు ఇచ్చారు.

**గోల్వాల్కర్ దృష్టిలో దేవుడు :** సూర్యచంద్రులే దేవుని కళ్ళు, అతని నాభి నుండి ఆకాశమూ, నక్షత్రాలు అవతరించాయి. అతని శిరస్సు బ్రాహ్మణులు, బాహువులు రాజులు, తొడలు వైశ్యులు, పాదాలు శూద్రులు. ఈ చాతుర్విధ (చాతుర్వర్ణ) వ్యవస్థను కలిగిన వారే హిందువులు, అటువంటి విరాట పురుషుడే మన దేవుడు...

గోల్వాల్కర్ దృష్టిలో రాజ్యాంగం: "పాశ్చాత్య దేశాల నుండి కొన్ని అధికరణాలను తీసుకుని ఏ సమన్వయమూ లేకుండా ఎలా పడితే అలా కుట్టిన అతుకుల బొంత లాంటిది మన రాజ్యాంగం. ఐక్యరాజ్యసమితి చార్టర్ నుండి, నానాజాతి సమితి నుండి కొన్ని సొట్ట (బలహీన) విధానాలను, అమెరికా, బ్రిటన్ రాజ్యాంగాల నుండి కొన్ని పీలికలనూ తీసుకుని అతుకులు వేశారు."

**గోల్వాల్కర్ నుండి మరికొన్ని....**

"రాష్ట్రాల యూనియన్ కి సంబంధించిన ఆలోచనలన్నింటినీ లోతుగా పాతి పెట్టాలి. .. స్వయం ప్రతిపత్తి లేదా అర్ధ స్వయం ప్రతిపత్తి గల రాష్ట్రాల అస్తిత్వాన్ని లేకుండా చేయాలి. కేంద్రీకృత రాజ్య వ్యవస్థను స్థాపించేలా రాజ్యాంగాన్ని మనం పునర్ లిఖిద్దాం." "జర్మనీ తన సంస్కృతిని పరిశుద్ధతను కాపాడుకునేందుకు తన .దేశంలో ఉన్న సెమిటిక్ జాతికి చెందిన యూదులను సంపూర్ణంగా అంతమొందించి ప్రపంచాన్ని ఒక దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇందులో వారు అత్యున్నత స్థాయి జాతీయతాభావమే కనపడుతుంది. హిందుస్థాన్ వాసులకు ఇది ఒక మంచి పాఠం. దీని నుండి మనం ఎంతో నేర్చుకుని లబ్ధి పొందాలి."

"అల్పసంఖ్యాకులు ప్రజాబాహుళ్యపు కృపాకటాక్షాలు లభించినంత కాలం ఇక్కడ ఉండి, అభ్యంతరం వ్యక్తం కాగానే తిరిగి వెళ్ళిపోవడం. ఇదొక్కటే సరైన పరిష్కారం."

"ఒక జెండా, ఒక నాయకుడు, ఒక సిద్ధాంతం నుండి స్ఫూర్తి పొందే ఆర్ఎస్ఎస్ సంస్థే ఈ బృహత్ దేశంలోని ప్రతి మూలలోను హిందుత్వపు జ్యోతిని వెలిగిస్తుంది."

"... ఇక్కడ జాతీయ విలువలంటే మన ధర్మము, మన సంస్కృతి." వి.డి. సావర్కర్ ఇలా అంటాడు... "వేదాల తర్వాత మనస్మృతియే అత్యంత పూజనీయమైన మత గ్రంథం, నేడు మనస్మృతియే హిందూ చట్టం." "నాజీ లేదా ఫాసిస్ట్ మంత్రదండాన్ని చేత పట్టిన కారణంగానే జర్మనీ ఇటలీలు ఎంతో అద్భుతమైన విజయాలు సాధించి మునుపెన్నడూ లేనంత బలమైన దేశాలుగా ఎదిగాయి."

పై అంశాలు చూసినా, గత కొన్నేళ్లుగా దాని నేతృత్వంలోని మోడీ ప్రభుత్వం తీరు చూస్తున్నా ఆర్.ఎస్.ఎస్ ఎంత ప్రమాదకరమో అవగతం కాగలదు. రచయిత దేవనూర్ మహాదేవ ఆర్ఎస్ఎస్ ఉద్దేశాలు గురించి మాట్లాడుతూ ఇలా అంటాడు, "...వారి (ఆర్.ఎస్.ఎస్) గత కాలపు పైశాచిక దృష్టిని మిగతా వారి సంగతెలా ఉన్నా ఏమాత్రం వివేకం గల బ్రాహ్మణులు సైతం ఒప్పుకోరు". "..అవన్నీ గత కాలానికి చెందిన ప్రమాదకర విశ్వాసాలే, వాటితో ఇవాల్టి స్థితిని నిర్మించడానికి ఆర్.ఎస్.ఎస్, దాని అనుబంధ సంస్థలు గత వందేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి." "...శిరస్సైన బ్రాహ్మణుడి ఆజ్ఞకు తగ్గట్టుగా రాజుల పరిపాలన చేయాలి, వైశ్యులు వ్యాపారం చేయాలి, శూద్రులు వీరందరికీ సేవ చేయాలి. ఇదే ఆర్.ఎస్.ఎస్ దృష్టిలో సామాజిక న్యాయం, సామాజిక సామరస్యం, ఇదే వారి దేవుడు, సజీవ పరమాత్మ. " ఆర్.ఎస్.ఎస్ చెప్పే శూద్రులు అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు మినహా మిగిలిన కులాలన్నీ. అంటే కమ్మ, కాపు, రెడ్డి, వెలమతో పాటు సమస్త బిసి, ఎస్సీ, ఎస్టీ కులాలన్నీ. 97 శాతం ప్రజానీకం కాలం చెల్లిన అనాగరిక భావజాలానికి దాసోహం చేయాలని ఆర్.ఎస్.ఎస్ బోధిస్తుంది. రచయిత దేమ అన్నట్టు విజ్ఞులైన బ్రాహ్మణులు సైతం అంగీకరించని,సమాజంలో అశాంతిని సృష్టించే సిద్ధాంతం ఆర్.ఎస్.ఎస్‌ది.

"... పిల్లల మనసుల్లో ముద్ర వేయడానికి, 'చాతుర్వర్ణం నా సృష్టే' అని దేవుని అవతారమైన కృష్ణుడే గీతలో చెప్పాడని చెబుతూ భగవద్గీతను పాఠ్యాంశం చేయడానికి ఆర్ఎస్ఎస్ పరివారం బిజెపి ప్రభుత్వాలు పరిపాలించే చోట్లకల్లా బయల్దేరింది." ఒక సారి స్వామి వివేకానంద భగవద్గీత విశ్వాసనీయత గురించి మాట్లాడుతూ ఇలా అన్నాడు, "...శంకరాచార్యులు ఒక విపులమైన భాష్యం రాసి భగవద్గీతను ప్రసిద్ధం చేయడానికి కంటే ముందు ప్రజలకు భగవద్గీత గురించి పెద్దగా తెలియదు. కొందరు శంకరాచార్యులే భగవద్గీతకర్త అని దానిని ఆయనే మహాభారతంలో చేర్చారని చెబుతారు." (స్వామి వివేకానంద కృతి శ్రేణి (కన్నడ) సంపుటి 7, పుట 80, 81, శ్రీ రామకృష్ణ ఆశ్రమం ప్రచురణ). చాతుర్వర్ణ వ్యవస్థలోని అసమానత, బానిసత్వలను 'ధర్మ'బద్ధం చేయడానికి స్వయంగా భగవంతుడే చెప్పాడని ప్రజలను నమ్మించడానికి తర్వాతి రోజుల్లో చేర్చారనేందుకు స్వయంగా వివేకానందుడు చెప్పిన ఈ మాటలు చాలు. ఇదంతా ఆర్ఎస్ఎస్ కు పట్టదు. ఎందుకంటే ఒక జెండా, ఒక జాతి, ఒక సిద్ధాంతం, ఒక నాయకుడు అన్న హిట్లర్ నియంతృత్వ సిద్ధాంతమే వీళ్ళకు ఆదర్శం. అమిత్ షా నాయకత్వంలోని పార్లమెంటరీ కమిటీ హిందీకి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతికి నివేదిక ఇవ్వడం ఆర్ఎస్ఎస్ అరాచకానికి పరాకాష్ట. మధర్మశాస్త్రం ఆధారంగా రాజ్యాంగాన్ని లిఖించడం కోసం కావచ్చు, సంస్కృతాన్ని భారతదేశ అనుసంధాన భాషగా మార్చడం కోసం కావచ్చు. "ఈ దేశంలో సంస్కృత భాష ఆ స్థానం పొందేదాకా హిందీ భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో ఎప్పుడో చెప్పాడు. సంస్కృతాన్ని వాడుక భాషగా చేసే లక్ష్యాన్ని సాధించుకోవడానికి మొదటి మెట్టుగా హిందీని ఉమ్మడి భాషగా తీసుకొచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి.

నేడు సంఘ పరివార్ సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నదాని గురించి రచయిత దేమ ఇలా అంటాడు,"నిజ నిర్ధారణ జరిగేంతవరకు ఎంతకాలం సజీవంగా ఉంటే అంతకాలం ఉంటుందిలే అన్నట్టుగా ఇప్పుడు వాట్సాప్, ఫేస్బుక్ మొదలైన సామాజిక మాధ్యమాలలో, చర్చల్లో ఇలాంటి అబద్ధాల కలుపే పుట్టి దేశం నలుమూలలా పెరుగుతుంది. ఇటువంటి కథల్లి అబద్ధాల కలుపును వ్యాపింప చేయడం గోల్వాల్కర్ కానుకే! ఇప్పుడు ఆర్ఎస్ఎస్, దాని పరివారం నుండి ఇటువంటి అబద్ధాలు ప్రచారం నిరాటంకంగా, నిరంతరం జరుగుతుంది." ఆర్ఎస్ఎస్ పుట్టినప్పుడే, వేషాలు వేసి వంచించే ఆట కూడా పుట్టిందనుకోవాలి! దీనికొక ఉదాహరణ: 1948 మార్చి 14 న డా. రాజేంద్రప్రసాద్ ప్రధాని నెహ్రూ, హోం మంత్రి పటేల్ లకు రాసిన ఉత్తరం. అందులో "ఆర్ఎస్ఎస్ వాళ్లు ఏదో గందరగోళం సృష్టించబోతున్నారని నాకు వార్త అందింది. వాళ్లు అనేక మంది హిందువులకు ముస్లిం వేషం వేసి ఇతర హిందువులపై దాడి చేయించి గొడవలు రేపి, మిగతా హిందువులను రెచ్చగొట్టే పన్నాగం పన్నుతున్నారని తెలిసింది. హిందూ, ముస్లింల మధ్యన ఈ రకమైన ఘర్షణ ఒక మహాకాష్టానికి అగ్గి రాజేసేలా వుంది" అని హెచ్చరించారు. ఆ కాలంలోనే అన్ని అయితే ఈ కాలంలో ఇంకెన్నో!. ఇలాంటివన్నీ చూసినప్పుడు వీళ్ళలో ఏ దేవుడు లేడు, అబద్ధమే వీరి ఇంటి దైవం, అబద్ధాల ఉత్పాదకతలో నిండా మునిగిపోయి వీరు తమ మనస్సాక్షినే ఉరి వేసుకున్నారేమో అనిపిస్తుంది.




మతమార్పిడి గురించి న్యాయమూర్తి హెచ్. ఎస్. నాగమోహన్ దాస్ ఇలా అంటారు, "...దేశంలో ఉన్న ముస్లింలు, క్రైస్తవులు అందరూ విదేశాల నుండి వచ్చిన వారేనా? చాతుర్వర్ణంలో, కుల వ్యవస్థలో అనేక విధాలుగా నలిగి హిందూ సముదాయాల నుండి మతమార్పిడి చెందిన వారే ఈ రెండు మతాలలోనూ అధిక సంఖ్యలో ఉన్నారు కదా? అదీ కాక, భారతదేశంలోకి ఇస్లాం ప్రవేశించిన ఆరంభ దశలో అధికారం కోసమో, పదవుల కోసమో, ఇతర ప్రలోభాల కోసమో మత మార్పిడి చెందినవారు అధికంగా ఉత్తర భారతదేశపు ఆర్య బ్రాహ్మణులే కదా?". గోల్వాల్కర్ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు వివేచనాశక్తి అస్సలు అవసరం లేదం టూ ఇలా అంటాడు, "... మన జీవితంలో ఇక ఎంపిక ప్రశ్నే ఉండదు. చెప్పినట్లు చేసుకుంటూ పోవడమే. కబాడ్డీ ఆడమంటే కబడ్డీ ఆడండి, సభ పెట్టమంటే సభ పెట్టండి... ఉదాహరణకు మన మిత్రుల్లో కొందరికి రాజకీయాల్లో పని చేయమని చెప్పడం జరిగింది. అంటే వారందరికీ రాజకీయాల్లో భారీ ఆసక్తి ఉందనో లేదా సామర్థ్యం ఉందనో కాదు. రేపు రాజకీయాలు మానుకోమంటే నీళ్లు లేకపోతే చేపలు చచ్చిపోయినట్టు వాళ్ళు ఏమి చచ్చిపోరు. బయటకు రమ్మని చెబితే వాళ్లకు ఏ ఆక్షేపనా ఉండదు. వాళ్లకసలు వివేచనా శక్తి అక్కర్లేదు". దేవనూర్ మహాదేవ ఆవేదన చెందినట్టు దిగులు పడాల్సిన సంగతి ఏమిటంటే లేత వయసు పిల్లలను పట్టుకొచ్చి తమ సంఘటనలో భాగం చేస్తున్నారు. వాళ్ళు మనుషులను తయారు చేయడం లేదు. స్వయం సేవకులనే పేరుమీద అమానవీయ రోబోలను తయారు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ నోటికి చిక్కే ఈ పిల్లలను కాపాడుకోవడం ఎలా?.

ఆయనింకా ఇలా అంటాడు, "ఏ మతోన్మాదమైన మొదట తన వాళ్ళ కళ్ళను పీకి అంధులను చేస్తుంది, తర్వాత మెదడను పీకి అవివేకులను చేస్తుంది, తర్వాత హృదయాలను పీకి క్రూరులుగా మారుస్తుంది. తర్వాత నరబలిని కోరుకుంటుంది. ఇప్పుడు ఇది మితిమీరిపోతుంది. అతి త్వరగా మన పిల్లల కళ్ళు, గుండె, మెదడులను ఈ మతోన్మాదపు నోటికి చిక్కకుండా కాపాడాల్సి ఉంది."

హిందువులకు విజ్ఞప్తి చేస్తూ, "... అమానుష కృత్యాలను చూసి ఊరికినే ఉండిపోకుండా విశాలమైన హిందూ సమాజం ఈ సంక్షోభ సమయంలో గొంతెత్తి మాట్లాడాల్సి ఉంది. బ్రాహ్మణుల నుండి ఆదివాసులు దాకా అనేక కులాల గల బహుసంఖ్యాక మానవీయ హిందూ సమాజం ఈ విషయంలో కార్యోన్ముఖులం కావాల్సుది."

జయప్రకాష్ నారాయణ్ తన జీవిత చరమ దశలో ఆర్ఎస్ఎస్ నాయకుల గురించి "వారు నమ్మకద్రోహం చేశారు" అని ఒక సన్నిహితుని వద్ద పరితపించారు. ఇప్పుడు, ఒకే గొడుగు కింద ఎంతో వైవిధ్యంతో కూడిన వందలాది ధర్మాలతో విలసిల్లుతున్న సమృద్ధ హిందూమతం కూడా జయప్రకాష్ నారాయణ్ గారిలా 'నేనూ మోసపోయాను' అని పరితపించేటట్లుంది

**పెద్దింశెట్టి రామకృష్ణ**
9492383977

మిగితా రేపటి సంచికలో

## ఇప్పటికీ...

అక్కడ రాళ్ళు ఇప్పటికీ,
ఎర్రటి సింధూరంలా నెత్తుటితో మెరుస్తూ,
నిశ్శబ్దంగా త్యాగాల స్మృతులను గుండెల్లో
భద్రపరుస్తున్నాయి.

కొన్ని చెట్లు,
తూటాల గాయాలతో నిండి,
దుఃఖ గాథలను హృదయంలో దాచుకుని,
పోరాటాల సాక్ష్యంగా నిలిచి,
గతాన్ని గుర్తుచేస్తున్నాయి.

ఆ నేల...
రెండు వర్గాల భీకర సంగ్రామానికి సాక్షి,
కొండబిడ్డలను ప్రేమతో పెంచిన తల్లి ఒడి.
తిరుగుబాటు జ్వాలలతో కొందరు
అధికార ఆజ్ఞలకు బానిసలై కొందరు
విధ్వంసక హోమం జరుగుతూనే ఉంది,
రక్తపు పాటలతో ఆ నేల
ఇప్పటికీ మండుతూనే ఉంది.

**రాము కోలా**
దెందుకూరు, ఖమ్మం, 9849001201.

## కదలిక లేని శిలలు

కలవు మనకు నీటి వనరులు
పారుతున్న కాలువలకా సంకెలలు
కసి కక్షలతో తులతూగుతున్న పాలకులు
నిర నీలుగుచుండెగా జలసిరులు
నీళ్లు ఇవ్వలేక ఎండిన పొలాలు
నెర్రెలిచ్చి నోళ్లు తెరచిన మడులు
రోదించెనుగా జనతప్త హృదయాలు
నిదురమత్తున జోగుతున్న నేతలు
గ్యారంటీలు చేరె స్మశానాలు
నమ్మకాలపై చిమ్మె విష ద్రావకాలు
ఓటర్లు వారల దృష్టిలో పోరంబోకులు
సింహాసనాలు అధిష్టించిరి
ఏలికలు
దరిద్రానికి అకాల వర్షాలు
దిగులు వదనాలతో కర్షకులు
ధరలు లేక దినుసులు మొలకలు
రైతుల వెతలే మెడకు ఉరులు
మోసపోయిరి అమాయక ప్రజలు
నాయకులాడుతున్నారు పచ్చీసులు
ఆశలు వదులుకోని దీన పాలిథులు
మొక్కుతున్నారు కదలిక లేని శిలలు

**నమిలకొండ నాగేశ్వర్ రావు**
మేడ్చెల్, 8688553470

# 2028లో అధికారం బీసీలదే..

- రాజ్యాధికారం కోసం భహుజనులందరం ఏకమవ్వాలి
- బీసీలు అంటే బలహీనులు కాదు బలవంతులు
- నాగర్ కర్నూల్ బిసి చైతన్య సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- బీసీ డిక్లరేషన్ విడుదల చేసిన బీసీ సంఘాల నాయకులు



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** 2028లో తెలంగాణలో అధికారం చేపట్టబోయేది బిసిలేనని, అగ్రకులాల చివరి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డే నని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు.మనకోసం-మన పిల్లల భవిష్యత్తు కోసం మనం ఎంతో -మన వాటా అంతా అనే నినాదంతో శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో బిసి సంఘం నాయకులు పచ్చిపాల సుబ్బయ్య అద్యక్షతన నిర్వహించిన బిసి చైతన్య సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బిసిలు అంటే బలహీనులు కాదని బలమైన వారమని నిరూపించే సమయం ఆసన్నమైందని అన్నారు. రాబందుల నుండి రాజ్యాధికారం దక్కించుకోవాలంటే బహుజన కులాలు అన్ని ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.మన జనాభా ఎంతో మన వాటా కూడా అంతే ఉండాలని కులాల వారిగా విడిపోకుండా కలిసికట్టుగా పోరాటం చేద్దామని అన్నారు. బీసీ కుల బంధువులందరూ ఒకే వేదికపై ఉండే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు నిర్వాహకులను ప్రశంసించారు. గతంలో బిజినపల్లి మండల కేంద్రంలో బిసి సభకు బీజం పోశారని, నేడు రెండో సభను విజయవంతంగా నాగర్ కర్నూల్ లో నిర్వహించినందుకు ఆనందం వ్యక్తం చేశారు.బీసీ, ఎస్టీ, ఎస్సీ మైనారిటీ కులాలు ఒక తాటిపై కొచ్చి రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా తమ నాయకులను గెలిపించుకొని తమ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. బానిస బతుకులు మారాలంటే బిసి లకు రాజ్యాధికారం రావాలని అది వచ్చినప్పుడు బిసిలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కులాల వారీగా విడిపోకుండా కలిసికట్టుగా పోరాటం చేద్దామని ఈరోజు జరిగిన సమావేశాన్ని తమ తమ గ్రామాల్లోకి వెళ్లి రచ్చబండలు, బస్టాండ్ కూడలి, చాయ్ హోటల్ దగ్గర బీసీల అందరం ఏకేమయ్యాము ఇక మాదే రాజాధికారం అని చర్చ జరపాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో బిసి నాయకులను పెద్ద సంఖ్యలో గెలిపించుకుని సత్తాను చాటాలని విజ్ఞప్తి చేశారు.సభ ప్రారంభం లో సభాధ్యక్షులు పచ్చిపాల సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి లో చేసిన డిక్లరేషన్ ప్రకారం బిసి రిజర్వేషన్ లు 42 శాతం చట్టసభలలో ఆమోదించాలని అన్నారు. లేని పక్షంలో మరో తెలంగాణ ఉద్యమతరహాలో బిసిలందరం ఉద్యమిస్తామని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 52 శాతం ఉన్న బీసీలకు అన్నింటిలో జనాభా ప్రకారం రిజర్వేషన్ల ఫలాలు అందించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఎస్సీ ఎస్టీలకు బీసీలు తోడైతే దేశం ముఖచిత్రం మారుతుందన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాటలను గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల గురించి తీన్మార్ మల్లన్న ఒక్కరే ప్రశ్నించాలా మనందరం ప్రశ్నించకూడదా అని సభకు హాజరైన వారందరినీ ఉత్తేజపరిచారు.

**బీసీ డిక్లరేషన్ విడుదల చేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్**

బీసీ చైతన్య సభ నిర్వాహక సభ్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్ సభలో బీసీ డిక్లరేషన్ ను విడుదల చేశారు. ఆ డిక్లరేషన్ ను సభకు హాజరైన తీన్మార్ మల్లన్న తో సహా బీసీ నాయకులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పెబ్బేటి మల్లికార్జున్ మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా వెనుకబడిన కులాలకు ఆర్థిక, అధికారం, విద్య, హోదా లలో దోపిడి జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీలలో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పొందే వరకు విశ్రమించేది లేదని ఉద్ఘాటించారు. బీసీలందరూ అన్ని సిద్ధాంతాలు వదిలేసి మహాత్మా జ్యోతిరావు పూలే సిద్ధాంతంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. బీసీల జనాభా ప్రకారం చట్టసభలలో అవకాశం కల్పించాలని అన్నారు. ఏ డబ్ల్యు ఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమూర్తుల నియామకంలో బీసీలకు రిజర్వేషన్ ప్రకారం స్థానం కల్పించాలని అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లాకు పండుగ సాయన్న పేరు పెట్టాలని గుర్తు చేశారు.అంతకుముందు అన్ని కుల సంఘాల నాయకులు తీన్మార్ మల్లన్నకు మద్దతు తెలిపారు. అనంతరం డిగ్రీ కళాశాలల విద్యార్థులకు రాజ్యాంగం పుస్తకాలను అందజేశారు. కార్యక్రమానికి ముందు అంబేద్కర్ చౌరస్తా నుండి సభ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పచ్చిపాలసుబ్బయ్య, డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, వెంకటయ్య, శివ యాదవ్, భాస్కర్,ప్రొఫెసర్ మురళి మనోహర్, సింహాద్రి, అంజయ్య కుమార్ యాదవ్, విజయ్ కుమార్, రమాదేవి, హరి శంకర్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, మంగి విజయ్, ఇంజమూరి దశరథం యాదవ్,కుంభం మల్లేష్ గౌడ్, శంకర్ గౌడ్, కాళ్ల నిరంజన్, కొత్తపల్లి కుమార్, అడ్వకేట్ రామచందర్, క్యూ న్యూస్ టీం, పరశురాం శివ, మణి కిషోర్, బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** హైదరాబాద్ లో ఒక్కసారిగా ఈదురు గాలులు భారీ వర్షం కురవడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. వర్షపాతం ప్రభావం జీహెచ్ ఎంసీ ప్రాంతాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఒక్కసారిగా ఈదురుగాలులతో నగరంలో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగినట్టు అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకురావడంతో ఎమర్జెన్సీ టీమ్స్ డిఆర్ఎఫ్ బృందాలు విరిగిన చెట్లను తొలగించాలని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో చార్మినార్ బహుదూర్ పుర ,నాంపల్లి , అంబర్పేట్ , ఖైరతాబాద్, ఎల్బీనగర్ ,కూకట్పల్లి ,సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో వర్షపాత ప్రభావం ఉందని వెల్లడించారు. వర్షానికి నగరంలో ఉన్న వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు వెంట వెంటనే నీటిని తొలగించాలని ఆదేశించారు. వచ్చే మూడు గంటల్లో నగరంలో మరోసారి భారీ వర్షం పడనుందని వాతావరణ శాఖ అధికారులు సూచించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. డ్రైనేజీ పొంగిపొర్లకుండా వాటర్ బోర్డ్ జెట్టింగ్ మిషన్స్ ద్వారా అరికడుతున్నాయి. పోలీస్ , జీహెచ్ఎంసీ , వాటర్ బోర్డు ,విద్యుత్ అధికారులు సమన్వయం చేసుకొని వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు.

## ఉపాధిహామీ కూలీల రేట్లు వెంటనే పెంచాలి



**వీపనగండ్ల, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని సంపత్ రావు పల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీల సమస్యలు తెలుసుకుని వారితో మాట్లాడుతూ, పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బిజెపి ప్రభుత్వ యొక్క ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన తెలియజేస్తూ, నినాదాలు చేస్తూ గత ఎనిమిది వారాల నుంచి పనులు చేస్తున్న కూలీలకు నేటికీ డబ్బును ఇవ్వని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఉపాధి కూలీలకు పెండింగ్ డబ్బులు వెంటనే ఇవ్వాలని, పెంచిన నిత్యవసర వస్తువులు ధరలను తగ్గించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు రోజు కూలీ 600 రూపాయలు ప్రతి మనిషికి వందరోజుల పని కల్పించాలని అన్నారు. దేశంలో నిరంతరం పెంచుతున్న బంగారు ధరలను తగ్గించాలని, పెట్రోల్ డీజిల్ గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## కురుమ సంఘం నూతన భవనం ప్రారంభం

**చేవెళ్ల, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దేవుని ఎర్రవల్లి వార్డులో నూతనంగా నిర్వహించిన కురుమ సంఘం భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కొరుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేష్, చింపుల సత్యనారాయణ రెడ్డితో కలిసి కురుమ సంఘం భవనంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు, తెలంగాణ హక్కుల సాధనకు విశేష కృషి చేసిన దొడ్డి కొమురయ్య మనందరికీ ఆదర్శం అన్నారు. రజాకార్లను గ్రామాల్లోకి రాకుండా, దొరల పెత్తనాన్ని అడ్డుకోవడానికి దుడ్డుకర్రల సంఘం పెట్టి పోరాడిన గొప్ప యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ చేవెళ్ల సీనియర్ నాయకులు దేశముల ఆంజనేయులు, దేవుని ఎర్రవల్లి కురుమ సంఘం అధ్యక్షుడు కరికే సత్యనారాయణ, సంఘం ఉపాధ్యక్షులు అంగరెల్లి రాజు, మాజీ సర్పంచ్ కంకంటి శ్యామలయ్య, సామ మాణిక్య రెడ్డి, చంద్రయ్య, మల్లేష్, పత్తి సత్యనారాయణ, ఎదురే రాములు, దండు సత్యనారాయణ, గుత్తి మల్లేష్, కరికే శ్రీనివాస్, వెంకటరెడ్డి, నరసింహ, నవీన్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.



## వ్యాయామం పోలీసులకు ఆత్మ రక్షణ కవచం

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** వ్యాయామం పోలీసులకు ఆత్మ రక్షణ కవచంగా ఉంటుందని ప్రతి ఒక్కరు ప్రతిరోజు వీలున్న సమయంలో వ్యాయామం చేయడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు సాయుధ దళ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతనంగా వ్యాయామ శాలను రావుల గిరిధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పోలీసుశాఖలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు వ్యాయామం చేశారు, వ్యాయామంలో ముఖ్యమైన పరికరాలు ప్రస్తుతం అందుబాటులో లేకపోయినప్పటికీ త్వరలోనే జిల్లా సాయుధ దళం కార్యాలయంలో అధునాతన వ్యాయామ పరికరాలు పరికరాలతో జిల్లాలోని పోలీసులు ఉదయం సాయంత్రం వేళల్లో వ్యాయామం చేసి ఆరోగ్యంగా ఆరోగ్యవంతమైన పోలీసుగా ప్రజలకు భరోసా కల్పిస్తూ బాధ్యతగా నిలువాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు. వ్యాయామం లేని మానవుడు ఈ సమాజంలో అనేక రోగాల బారిన పడుతూ చిన్నతనంలోనే షుగర్ బీపీ, థైరాయిడ్, రకరకాల వ్యాధులతో మానవుని జీవితం ప్రశ్నార్థకంగా మారుతున్న ఈ తరుణంలో ప్రతి ఒక్కరు వ్యాయామం పైన శ్రద్ధ పెట్టాలని ఎస్పి సూచించారు, పోలీసులతో పాటు సామాన్య ప్రజలు కూడా తమకు అందుబాటులో ఉన్న పరికరాలతో పాటు మార్నింగ్ వాకింగ్ ఈవెనింగ్ వాకింగ్ ముఖ్యమని అన్నారు, అంతేకాక మహిళలకు ప్రధానంగా ఆత్మ రక్షణ విద్య ఎంతో దోహదపడుతుందని మహిళలు చిన్ననాటి నుంచే కరాటే శిక్షణలో శిక్షణ పొందుతూ ఆత్మరక్షణ విద్యలు నిష్ణాతులై ఉండాలని శత్రువులను ఎదుర్కోవడానికి ఆత్మరక్షణ విద్య మహిళలకు ఎంతో దోహదపడుతుందని ఎస్పీ గారు అన్నారు, తొందర్లోనే వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉంటాయని ఏఆర్ పోలీసులతోపాటు సివిల్ పోలీసులు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ అన్నారు, ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్, అప్పలనాయుడు,రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్, మగ్దూం భారీ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జ్ఞానశిఖరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్

- కాంగ్రెస్ కుట్రలతో అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించింది
- మేధావుల సదస్సులో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి



**వికారాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోనీ మా శారదా హాస్పిటల్ లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా పార్టీ అధ్యక్షులు కొప్పుల రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మేధావుల సదస్సుకు మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు పోవాలంటే ప్రతీ భారత పౌరుడు విద్యాకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని, ప్రభుత్వాలు అందుకు కృషి చేస్తూ ఆచరణలో పెట్టాలన్నారు, వారు అనుభవించిన వివక్ష అవమానాలను బావి తరాలు అనుభవిచరదని అంబేద్కర్ ఆరాటపడ్డారన్నారు, అంబేద్కర్ అనుభవించిన వివక్షత భారత చరిత్రపై మాయని మచ్చగా మిగిలిపోయిందన్నారు, అంబేద్కర్ కు అడుగడుగునా అవమానపరిచిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు, గాంధీ కుటుంబం అంబేద్కర్ ను వారు రచించిన రాజ్యాంగాన్ని పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసం మాత్రమే ఆ మహనీయున్ని అడ్డుపెట్టుకుంటున్నారు, మర్రి చెన్నారెడ్డి అంబేద్కర్ అందించిన స్పూర్తితోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఉద్యమం చేశారన్నారు, నరేంద్ర మోడీ అంబేద్కర్ బాటలో నడుస్తున్నారని అందుకు నిదర్శనమే కేంద్ర పార్టీ నిర్ణయాలన్నారు, వారికిని ప్రతీ భారతీయుడు గౌరవస్తూ వారి చరిత్రను తెలుసుకొని వారి ఆశయాలకు కృషి చేయడమే అంబేద్కర్ కు నిజమైన నివాళులు అన్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఇచ్చిన పిలుపును జిల్లాలో విజయవంతంగా అమలు చేయడం జరిగిందని ప్రతీ గ్రామాన అంబేద్కర్ విగ్రహాలను కడగడం, పరిసరాలను శుభ్రపరచడం, బైక్ ర్యాలీలు, రాజ్యాంగ పీఠికను అభ్యశించడం, జయంతి నాడు ప్రతీ గ్రామంలో బిజెపి పార్టీ కార్యకర్తలు జయంతి వేడుకల్లో పాల్గొన్నారన్నారు, అందుకు సహకరించిన బిజెపి పార్టీ మండల అధ్యక్షులకు, శక్తి కేంద్రం ఇంచార్జిలకు, బూత్ అధ్యక్షులకు, మేధావుల సదస్సుకు హాజరై విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పెంటయ్య, జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్, ధార్మిక సెల్ కన్వీనర్ మోహన్ రెడ్డి, శివరాజ్, విజయలక్ష్మి, యాలాల్ బిజెపి మండల అధ్యక్షులు ఆకుల శివ, అడ్వకేట్ యాదగిరి, జై భీమ్ ఎడ్యుకేషన్ సొసైటీ జిల్లా అధ్యక్షులు శివకుమార్, అంజిలయ్య, పిడీఎస్యు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, కోట్ మర్పల్లి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అంజయ్య, బోపునారం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదాల సత్వర పరిష్కారానికి భూభారతి

- ఎమ్మెల్యే మైనాంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** భూ వివాదాలు సత్వర పరిష్కారానికి భూ భారతి చట్టం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. రామాయంపేట రైతువేదికలో శుక్రవారం భూ భారతి చట్టం రెవెన్యూ అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసిల్దార్ రజని, ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. భూ భారతి నూతన చట్టంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కష్టాలను తీర్చే ప్రభుత్వంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ధరణి విషయమై మాటను ఇచ్చారని, ధరణి స్థానంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు, ప్రజలకు ఉపయోగపడే నూతన భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చారని అన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు, ప్రజల అభిప్రాయాలను తీసుకున్న తదపరి భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందన్నారు. రైతులు వారి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే విధంగా పగడ్బందీగా ఈ చట్టాన్ని అమలు చేసేందుకు జిల్లాలో రెవెన్యూ యంత్రాంగం పనిచేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఈ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి పేదవాని ఆకలి తీర్చేందుకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించి వారు ఉన్నత స్థానంలో స్థిరపడాలనే ఉద్దేశంతో రామాయంపేట పట్టణంలో 200 ఎకరాలలో పాఠశాలల నిర్మించి విద్యాభివృద్ధికి కృషి చేయనున్నట్లు చెప్పారు. భూ భారతి చట్టంపై జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టం మార్గదర్శకాలను రైతులు, ప్రజలకు తెలియజేసేందుకు జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భూ భారతి చట్టంలో భూ సమస్యల పరిష్కారం కోసం కొత్త రూల్స్ వచ్చాయన్నారు. నూతన చట్టం రూల్స్ గురించి తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లకు, ఆర్ఐలకు కలెక్టరేట్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూ భారతి, దానిలోని అంశాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. ఇంతకు ముందు ఉన్న ధరణిలో కోల్పోయిన భూ హక్కులు ఏవైతే ఉన్నాయో ఇప్పుడు వచ్చిన కొత్త చట్టంలో ఎలాంటి హక్కులు ఉన్నాయనేది తెలియజేసేందుకే ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సదస్సులో పాల్గొన్న రైతులు, ప్రజలు ఇంతకు



ముందు ధరణిలో ఎలాంటి హక్కులు ఉన్నాయి, ఇప్పుడు భూ భారతి చట్టంలో ఎలాంటి హక్కులు ఉన్నాయనే అంశాల గురించి అడిగిన సందేహాలపై అవగాహన కల్పించారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా వచ్చిన భూ భారతి చట్టం గురించి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. నూతన చట్టం ద్వారా తప్పులు సవరించుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లయితే తహసీల్దార్ రిపోర్ట్ మొదలుకొని ఆర్డిఓ, కలెక్టర్, ఆపైన సిసిఎల్ఏ వరకు అప్లై చేసుకునే అవకాశం ఉందన్నారు. త్వరలోనే గ్రామ పాలన అధికారులను ప్రభుత్వం నియమించనుందన్నారు.

## అపర భగీరధుడు మర్రి రాజశేఖర్ రెడ్డి

- 14 కోట్ల 95 ల రిజర్వాయర్ మంజూరు



**మల్కాజిగిరి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** అపర భగీరధుడు మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా మహేంద్ర హిల్స్ రిజర్వాయర్ నిర్మాణం గురించి చేపట్టిన కల ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తోనే సాధ్యమైందని ఆమె వెల్లడించారు. మహేంద్ర హిల్స్ లో 14 కోట్ల 95 లక్షల తో రిజర్వాయర్ నిర్మాణానికి జీవో కాపీ మంజూర అయిందని అందుకోసం శుక్రవారం గౌతమ్ నగర్లో మర్రి పి రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశామని తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్లో ఉన్న 33 కాలనీలకు 5 ఎంఎల్ నీరు అందించడానికి రిజర్వాయర్ నిర్మాణం జరుగుతుందన్నారు. రిజర్వాయర్ మంజూరుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని వెల్లడించారు. త్వరలో మహేంద్ర హిల్స్ లో రిజర్వాయర్ నిర్మాణం జరగబోతుందని ఆమె అన్నారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి రిజర్వాయర్ నుండి గౌతమ్ నగర్ డివిజన్ లో ఉన్న 33 కాలనీలకు 5 ఎంఎల్ నీటిని అందించడానికి సహాయ శక్తుల కృషి చేస్తామని తెలిపారు. రిజర్వాయర్ మంజూరు వల్ల తమ చిరకాల కోరిక నెరవేరిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రిజర్వాయర్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

- మెసేజ్ ద్వారా సమాచారమిచ్చిన స్పందిస్తాం
- కుల సంఘాల నాయకులకు ఎస్పీ పీస్ సమావేశం




**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ కుల సంఘాలతో పీస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డా. బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యంగ నిర్మాత, ఆయన ఏ ఒక్క కులానికి, మతానికి, ప్రాంతానికి పరిమితమైన వారు కాదన్నారు. భారత దేశానికే కాకుండా ప్రపంచ దేశాలకు సైతం మార్గదర్శకంగా నిలిచారని ఎస్పీ గుర్తు చేశారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఎవరైన చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. వివిధ సంఘాలకు చెందిన పెద్దలు గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి, కమ్యూనిటీ ప్రశాంతత గురించి, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, శాంతి భద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసు శాఖ తరపున ఎల్లవేళలా సహాయ సహకారాలు అంధించడం జరుగుతుందని అన్నారు. కొందరు యువత చెడు మార్గాలలో వినియోగిస్తూ లేనిది ఉన్నట్టుగా వికృత ఫోటోలు తయారు చేసి సోషల్ మీడియా ద్వారా పోస్టు చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించేది లేదని, జిల్లా ఐటి సెల్ నుండి సోషల్ మీడియా పై నిరంతరం మానీటరింగ్ చేయడం జరుగుతుందని అన్నారు. పై చర్యలకు పాల్పడిన అల్లరిమూకలపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే హిస్టరీ షీట్లను ఓపెన్ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.సమాజం శాంతి కోసం కృషి చేసే వారికి సహాయం చేయడానికి జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళల ముందుంటుందని, ఆదేవిధంగా చట్టానికి వ్యతిరేకంగా నడుస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో 24 గంటలు అందుబాటులో ఉంటానని ఏ సమయంలోనైనా ఈ నెంబర్ 8712656777 కు కాల్ లేదా మెసేజ్ చేసి సమాచారం అందించాలని సూచించారు. జిల్లా పోలీసు శాఖ తరపున వివిధ గ్రామాలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావం చాలా ఎక్కువగా ఉందని సోషల్ మీడియాలో వచ్చేవన్ని నిజాలు కావని గుర్తించాలన్నారు. ఫార్వర్డ్ మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆ మెసేజ్ లో నిజం ఎంత అని గుర్తించిన తరువాతనే ఫార్వర్డ్ చేయాని అన్నారు. వాట్స్ ఆప్ గ్రూప్‌లలో ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా పోస్ట్ లు చేసిన సంబంధిత గ్రూప్ అడ్మిన్ ల పై చట్టరిత్య చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. ఈ పీస్ మీటింగ్ నందు అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, ఎస్బీ, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్స్ విజయ్ కృష్ణ, రమేష్, వివిధ సంఘాల నాయకులు అతిమెల మాణిక్యం, కూన వేణు, కొండాపురం జగన్, పి. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# తాళ్ల రాంపూర్ గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి

- కేజీకేఎస్ ఆధ్వర్యంలో తాళ్ళ రాంపూర్ వీడీసీ దిష్టి బొమ్మ దగ్ధం



**చేర్యాల, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గత ఆరు నెలలుగా కల్లుగీత కార్మికులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వీడీసీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, గౌడ మహిళలను శ్రీరామనవమి సందర్భంగా గుడి నుండి గెంటివేసి, గీత కార్మికులకు ఉపాధి కల్పించే ఈత చెట్లను కాల్చివేసిన దుర్మార్గులను తక్షణమే అరెస్టు చేయాలని, వీడీసీ లను నిషేధించాలని డిమాండు చేస్తు తెలంగాణా కల్లు గీత కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ ప్రజా సంఘాల ఆద్వర్యంలో శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద తాళ్ళ రాంపూర్ వీడీసీ దిష్టి బొమ్మ ను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట్ మావో లు మాట్లాడుతూ.. నిజామాబాదు జిల్లాలో వీడీసీల ముసుగులో రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరించడమే కాకుండా బడుగు బలహీన వర్గాలను సాంఘిక బహిష్కరణలకు గురి చేస్తున్నారని అన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచులు ఎంపీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లాంటి ఉన్నత అధికారులు వీడీసీల అరాచకాల పట్ల ఉదాసీనంగా ఉంటున్నారని అన్నారు. కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారిపై వీడీసీలు తమ ఆధిపత్యాన్ని అంగీకరించి అణిగిమనిగి ఉండాలని హుకుం జారీ చేస్తూ తాము చెప్పినట్టు వినని వారిపై సాంఘిక బహిష్కరణకు గురి చేస్తున్నారని ఆరు నెలల క్రితం ఈ సాంఘిక బహిష్కరణ జరిగి గీత కార్మికులు నానా ఇబ్బందులు పడుతుంటే జిల్లా ఎస్పీ కలెక్టర్ ఆ జిల్లాలోని ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఏప్రిల్ 6 న శ్రీరామనవమి సందర్భంగా పూజ కోసం గౌడ మహిళలు గుడికి వెళితే అవమానించి గుడి నుంచి గెంటి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తమ గోడు వినిపించుకుందామని వారు వెళితే సుమారు 150 ఈత చెట్లను తగలబెట్టి వాటి ద్వారా ఉపాధి పొందుతున్న వారి పొట్టలు కొట్టారని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో విలేజ్ డెవలప్మెంట్ కమిటీల అరాచకాల్ని ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు చెక్ పెట్టాలని వీడీసీలను నిషేధించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఉన్నత అధికారులు తక్షణమే ఆ గ్రామాన్ని సందర్శించి సాంఘిక బహిష్కరణ ఎత్తివేసి వీడీసీలను సమూలంగా నిషేధించాలని గ్రామాలలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని సంఘాలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేజీకేఎస్ చేర్యాల మండల అధ్యక్షులు అణగోని నర్సింలు, అకుల కనకయ్య, పొతూగంటి లింగం, గుడాల గణేష్, పచ్చిమడ్ల రాములు, బోయిని మల్లేశం, అముదాల రంజిత్ రెడ్డి, ఆకుల ప్రదీప్, పచ్చిమడ్ల వెంకటయ్య, అంబాల రాములు, పచ్చిమడ్ల ఐలయ్య, పోతుగంటి ప్రసాద్, పోతుగంటి రమేశ్, బూడిద చందు, పచ్చిమడ్ల క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కడమంచి చెన్నయ్యకు గౌరవ డాక్టరేట్



**జడ్చర్ల, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** జడ్చర్ల పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు కడమంచి చెన్నయ్య గౌరవ డాక్టరేట్ పొందారు. హైదరాబాద్ నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఏసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ కడమంచి చెన్నయ్యకు గౌరవ డాక్టరేట్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ సేవారంగం, కళారంగాలతో పాటు మానవ హక్కులు, సామాజిక సేవ, జర్నలిజం వంటి సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించినందుకు ఆనందంగా ఉందని, ఈ అవార్డుతో సమాజంలో మరింత బాధ్యతగా వ్యవహరించి సమాజ శ్రేయస్సుకు మరింత కృషి చేస్తానని అన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభ కోసం ఇంటింటికీ వాల్ పోస్టర్లు



**చేర్యాల, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ జనగామ శాసనసభ్యులు రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం చేర్యాల పట్టణంలోని మొదటి వార్డులో చలో వరంగల్ వాల్ పోస్టర్లను ఇంటింటా అతికించుకుంటూ కలియతిరిగారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ అంకుగారి స్వరూప రాణి శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు పట్టణ కార్యదర్శి, వార్డ్ అధ్యక్షుడు బురగోని తిరుపతి గౌడ్ లు మాట్లాడుతూ.. ప్రతి ఇంటి గడప నుంచి మహిళలు, యువత ముందుకు వచ్చి విజయవంతం చేయుటకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి మంచాల కొండయ్య, బురగోని వాణి గౌడ్, ఆకుల బాలరాజు, బండి నరసింహులు గౌడ్, భూమిగారి రాజేందర్, గుడాల నరసయ్య గౌడ్, కూరెళ్ళ యాదగిరి గౌడ్, బండి కళావతి, కురెళ్ళ సరస్వతి, బండయ్య నరసవ్వ, బురగోని జయలక్ష్మి, ఆకుల సత్యలక్ష్మి, బురగోని సురేష్ గౌడ్, నరిగే బాలయ్య, నరిగే వజ్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# వర్గాల మధ్య విద్వేషాలు సృష్టిస్తే కఠిన చర్యలు

- రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన చట్టారీత్యా చర్యలు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ఇరువర్గాల మధ్య, కుల మతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రెండు వర్గాలు గాని, గ్రూప్‌ల మధ్య గాని, కుల, మతాల మధ్య గాని ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా విద్వేషాలు సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెచ్చగొట్టే వాఖ్యలు చేసినా, సోషల్ మీడియా వేధికగా పోస్టులు పెట్టిన, ఫార్వర్డ్ మెసేజ్‌లు చేసిన ఉపేక్షించేది లేదని, అట్టి వ్యక్తులపై చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు హిస్టరీ షీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. ఒకరి మత సాంప్రదాయాలను మరొకరు గౌరవించినప్పుడే మత సామరస్యం నెలకొంటుందని, కులమతాలకు అతీతంగా పండగలు జరుపుకోవాలని ఎస్పీ సూచించారు.

# వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలి



**సిద్దిపేట బ్యూరో, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ముస్లింలకు నష్టం కలిగించేలా కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం బిల్లును ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నామని సిద్దిపేట పట్టణంలోని నసీర్ నగర్ వాసులు సొసైటీ సభ్యులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ముస్లింల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉన్న ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం రద్దయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా ఈ చట్టాలను తీసుకొచ్చి దేశంలో 25 శాతం ఉన్న మైనార్టీలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. సిద్ధిపేటలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరు కలిసి మెలిసి ఉంటారని గంగా- జమున- తహజీబ్ సిద్ధిపేటలో కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్నారు. దీనికి భంగం కలిగించే విధంగా పరిస్థితులను ఉసిగొల్పడం మనుషుల మధ్యదూరం పెంచడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అర్షద్, సొసైటి అధ్యక్షులు మొహమ్మద్ నసీరోద్దీన్ మసీద్ ఇమామ్ ఫజ్లుర్ రెహమాన్, మగ్దుం, తస్లీం, సాజిద్, అజార్, షాబుద్దీన్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**నర్సాపూర్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ఈ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా గల దుర్గాప్ప నాగరాజు గౌడ్ తన తల్లిదండ్రులు దుర్గాప్ప కమలమ్మ వెంకటయ్య గౌడుల జ్ఞాపకార్థం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ అంబలి కేంద్రాన్ని ఎమ్మెల్యే సునీత రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నర్సాపూర్ పట్టణానికి మండల లోని పలు గ్రామాల ప్రజలు వస్తూ పోతుంటారు వేసవికాలంలో పట్టణంలో నీరు దొరక దాహంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి ప్రజలకు ఈ అంబలి కేంద్రాలు చలివేంద్రాలు కూడా ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రజల దాహార్తిని ఈ అంబలి కేంద్రాల ద్వారా తీర్చగలుగుతాయి ఈ మేరకు నర్సాపూర్ పట్టణంలో అంబలి కేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులు నాగరాజ్ గౌడ్‌ను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సత్యం గౌడ్ జ్ఞానేశ్వర్ శ్రావణ్ కుమార్ కిషోర్ గౌడ్ భోగ చంద్రశేఖర్ ఆనంద్ కుమార్ తదితరులు ఉన్నారు

# అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



**జోగిపేట, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** అందోల్ జోగిపేట అగ్నిమాపక కేంద్రం అద్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గత నాలుగు రోజులుగా ప్రమాదాల నివారణకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగానే జోగిపేట మున్సిపల్ పట్టణంలోని శుక్రవారం ఫైర్ సిబ్బంది ప్రైవేట్ ఆసుపత్రిలో జరిగే అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనుకోని సంఘటనలో ప్రమాదాలు జరుగుతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచన సలహాలు చేశారు ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రామకృష్ణ, సుభాష్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ధరూర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించే భూభారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విచ్చేయుచున్న రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన సందర్భంగా స్థానిక శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు లతో కలిసి జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఏర్పాట్లను పరిశీలించారు. ధరూర్ తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభ ఏర్పాట్లను పరిశీలించి కలెక్టర్ మాట్లాడుతూ సభకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను సజావుగా చేపట్టాలని,త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని అన్నారు. టెంటు,మైక్ ఏర్పాట్లతో పాటు మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా గ్యాలరి ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జనరేటర్ ఏర్పాటు చేయాలన్నారు. సభ వద్ద అంతరాయం కలగకుండా ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలన్నరు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లను విజయవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర



**రాయికొడ్, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన రాయికోడ్ లో మార్క్ఫెడ్, పిఎసిఎస్ నల్లంబల్లి ఆధ్వర్యంలో శుక్రవారం మార్కెట్ యార్డులో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం రైతులకు మంచి వరం లాంటిదన్నారు. క్వింటాలుకు రూ, 3371 చెల్లించనున్నట్లు చెప్పారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య, రాష్ట్ర మార్క్ ఫేడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ వినయ్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నరసింహులు, మాజీ అధ్యక్షులు బస్వరాజు పాటిల్, తాజా మాజీ సర్పంచ్ కేదార్నాథ్ పాటిల్, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, వైస్ చైర్మన్ భీమన్న, మార్కెట్ కమిటీ సెక్రటరీ రవికుమార్, ఏడి సత్యనారాయణ, ఏవో సరికా, పిఏ పిఎస్ చైర్మన్ నాగిషెట్టి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ప్రభాకర్, సీనియర్ నాయకులు ఎండి రఫీక్, జి. విటల్, ఎం. శివకుమార్, పలువురు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**శివ్వంపేట, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** వడగండ్ల వర్షంతో రైతులు సాగుచేసిన వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని పిల్లుట్ల, రత్నాపూర్, కొత్తపేట, లింగోజిగూడ గ్రామాలలో ఆకస్మికంగా కురిసిన వడగండ్ల వర్షానికి రైతులు సాగు చేసిన వరి పంట పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. పార్టీ శ్రేణుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించి, వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న వరి పొలాల వద్దకు వెళ్లి రైతులను పరామర్శించి, స్వయంగా వరి పంటలను వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట ఎంపీవో లావణ్య, వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, ఆర్ఐ కిషన్, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, మాజీ సర్పంచ్ పెద్దపల్లి రవి, నాయకులు అంసానిపల్లి నరసింహారెడ్డి, చింత స్వామి, దామోదర్ రెడ్డి, జనుముల గణేష్, రైతులు, తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులు చేపట్టాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనంసాక్షి)



**24 మంది ఇళ్ల లబ్ధిదారులకు లక్ష రూపాయల నిధులు విడుదల**

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న 24 మందికి లక్ష రూపాయల నిధులు విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రభుత్వం ప్రతి మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసిందన్నారు. మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద మొత్తం 1023 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ లలో 300 ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, వీటిలో బేస్మెంట్ వరకు పనులు పూర్తి చేసుకున్న 24 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మొదటి విడత ఆర్థిక సహాయం లక్ష రూపాయలు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేసిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించుకోవాలని, ప్రభుత్వం నాలుగు దశలలో ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తుందని, హౌసింగ్ శాఖ అధికారులు నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వేగంగా నిర్మించుకునేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే దేశానికి ఆదర్శం

**రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):





భారతదేశంలో ప్రతి ఒక్కరు సమానంగా స్వచ్ఛత వాతావరణంలో ఉండేలా భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం రచనయే నేటి భావితరాలకు అన్ని వర్గాలకు సమకూలంగా ఫలాలు అందేలా కృషి చేశారని రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం చివ్వెంల మండల పరిధిలోని మున్యా నాయక్ తండా గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన పీక్లా తండాలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మేధావులలో ఒకరైన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎన్నో డిగ్రీలు చదివి భారత దేశంలోని అన్ని కులాలు, అన్ని మతాల ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి, ప్రతి ఒక్క వర్గానికి సమన్యాయం చేకూర్చేలా భారత రాజ్యాంగాన్ని లిఖించారని అన్నారు. ప్రపంచ దేశాలలో ముఖ్యమైన దేశాలను పర్యటించి ఆయా దేశాలలో ఉన్న రాజ్యాంగాలను చదివి వాటి నుండి గ్రహించి భారత దేశ రాజ్యాంగాన్ని దృఢమైన లిఖిత రాజ్యాంగంగా సంవత్సరాల పాటు కష్టపడి భారత రాజ్యాంగాన్ని లిఖించాలని అన్నారు. నేటి సమాజంలో యువత కష్టపడి భావి భవిష్యత్తులో అత్యున్నత పదవులు ఉద్యోగాలు పొందాలని అన్నారు. సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, మంచి పనులు వైపు సాగాలని, కష్టపడి చదివి మంచి ఉన్నత స్థాయిలో ఎదగాలని అన్నారు. సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే అన్ని సంక్షేమ పథకాలు అర్హత ఉన్న అన్ని కులాల వరకు అందించేలా ఆనాడే భారత రాజ్యాంగంలో రాసిపెట్టిన ప్రపంచ మేధావి అని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కీర్తి గొప్ప మహోన్నతునిగా ఎదిగేలా చేసిందని అన్నారు. భారతదేశంలో ఉన్న 130 కోట్ల ప్రజలు అందరూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి దేశం, రాష్ట్రంలో ఉండే వాటిని అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు. ఆనాడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన కుటుంబాన్ని సైతం త్యాగం చేసి దేశ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి దేశం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. భారతదేశంలో ప్రతి ఒక్కరు కూడా భారత రాజ్యాంగాన్ని, అంబేద్కర్ జీవిత కథనాన్ని చదువుకోవాలని కోరారు. భారత దేశంలోనే జనాభా ప్రతి ఒక్కరు కూడా ఎన్ని తరాలకు అయినా మరువలేని మహోన్న తమైన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, జిల్లా షెడ్యూల్ కులాల అధికారులు శంకర్, లత, తహశీల్దార్ కృష్ణయ్య, సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్, సామాజిక కార్యకర్త నరసింహారావు, మాజీ సర్పంచ్ బికారి, మాజీ ఎంపిటిసి సుశీల సాగర్, విగ్రహ దాత సురేష్, విద్యార్థి సేన నాయకులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి)



: సుడా నిధులతో పలు అభివృద్ధి పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ముందుగా చింతకుంటలోని వినాయక నగర్ ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డుకు 15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 23వ డివిజన్ లో మహిళా కమ్యూనిటీ భవనం, మురికి కాలువ నిర్మాణం జిమ్ అన్నీ కలిపి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు. 9వ డివిజన్ లో 10 లక్షలతో పద్మశాలి సామాజిక భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక నాయకులు ప్రజల కోరిక మేరకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధికి సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమాలలో మడుపు మోహన్, శ్రవణ్ నాయక్, పిట్టల రవీందర్, మాజీ కార్పొరేటర్ ఆర్ష మల్లేశం, గంగుల దిలీప్, లింగ మూర్తి, కంకణాల అనిల్ కుమార్, గంగుల దిలీప్, పోరండ్ల రమేష్, వంగల శ్రీనివాస్, మాసం రమేష్, రంగా నాయక్, స్వప్న, నిర్మల, సుజాత, ఆర్పిలు విజయ, లక్ష్మి, సిగిరి లక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

# మల్లేశ్వరిది అగ్రకులదురహంకార హత్యే..

**జాన్ రెడ్డి కుటుంబ ఆస్తులు జప్తు చేసి మల్లీశ్వరి కుటుంబానికి ఇవ్వాలి**

**కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు**



జనంసాక్షి/నిడమనూరు

7సంవత్సరాలు దళిత యువతీతో శారీరక సంబంధం ఏర్పాటు చేసుకొని కామకాంక్ష తీర్చుకొని వివాహం చేసుకుందాం అనగానే ఎస్సి అని వేధించి మరో పెళ్లి చేసుకున్న జాన్ రెడ్డి ,పంచాయతీ పేరుతోమల్లేశ్వరి కి అన్యాయం మల్లేశ్వరి ఆత్మహత్యకు కారకులైన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బొక్క మంతలపాడు గ్రామంలో అగ్రకుల దూరహంకారానికి బలైన దళిత యువతి మల్లేశ్వరి కుటుంబ సభ్యులను కేవీపీఎస్ నేతలు పరామర్శించారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు జిల్లా అధ్యక్షకార్యదర్శులు కొండేటి శ్రీను పాలడుగు నాగార్జునతో కలిసి మల్లేశ్వరి కుటుంబాన్ని పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం వారు మాట్లాడుతూ మల్లేశ్వరి మరణానికి కారణమైన జాన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయలన్నారు. ఎస్సి ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం నిందితుడి ఆస్తిని జప్తుచేసి బాధిత కుటుంబానికి అందజేయాలన్నారు. జాన్ రెడ్డి కుటుంబ ఆస్తిలో సగం మల్లేశ్వరి కి కుటుంబానికి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు మల్లేశ్వరి అన్ని రకాలుగా వాడుకున్న కుక్కల జాన్ రెడ్డి వివాహ బంధం అనగానే తక్కువ కులం అని వేధించడమే కాకుండా మరో పెళ్లి చేసుకోవడం కులదురహంకారానికి నిదర్శనం అన్నారు మల్లేశ్వరి మరణ వాంగ్మూలం ఆధారంగా పోలీసులు ఫోటోగా తీసుకొని సూసైడ్ నోట్లో పేర్కొన్న అందరి పైన కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు మొత్తం వ్యవహారం పైన సిట్టింగ్ జడ్జి తోటి సమగ్రమైన విచారణ జరిపించాలని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి మీ కుల దృహంకార కేసులు విచారించాలని డిమాండ్ చేశారు. బొక్కమంతలపాడు గ్రామ అగ్రకుల పెత్తందారులు పంచాయతీ ద్వారా పరిష్కరిస్తాము కేసులు పెట్టవద్దు అని పిలిపించి నువ్వు తక్కువ కులం కాబట్టి పెళ్లి కుదరదు ఆల్రెడీ పెళ్లి చేసుకున్నాడు. మీకు ఎంతో కొంత కట్టించి దూరం కావాల్సిందేహుకుమ్ జారీ చేశారని దీంతో మనస్తాపం చెందిన మల్లీశ్వరి ఆత్మహత్య చేసుకుందన్నారు .ఇది పక్కా అగ్రకుల దూరహంకార హత్యేనన్నారు రాష్ట్రంలో 129 కుల దురహంకారహత్యలు జరిగాయని మిర్యాలగూడలో పెరుమాండ్ల ప్రణయ్ కుల దురహంకార హత్యలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పు రాష్ట్రంలో కుల దురహంకారులకు అదే గతి పట్టాలని చెప్పారు. రాష్ట్ర పోలీసుఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలన్నారు జిల్లాలోని మంత్రులు ఎమ్మెల్యేలు దళితుల ఓట్ల కోసం వస్తారని దళిత మహిళ హత్యకు గురైతే ఎందుకు స్పందించట్లేదని విమర్శించారు. జిల్లాలోని ప్రజాసంఘాలు రాజకీయ పార్టీలు ఒకదానిపై ఈ హత్యను తీవ్రంగా ఖండించాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తరపున స్పందించాలని డిమాండ్ చేశారు. మల్లీశ్వరి కుటుంబ సభ్యులను ఓదార్చిన అనంతరం మల్లేశ్వరికి ప్రగాఢ సంతాపం కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, పాలడుగు నాగార్జున ,జిల్లా ఉపాధ్యక్షులు బొట్టు శివకుమార్ ,కోడి రెక్క మల్లయ్య ,దైద శ్రీను ,జిల్లా కమిటీ సభ్యులు దొంతాల నాగార్జున, ధోరేపల్లి మల్లయ్య, బొంగరాల వెంకటయ్య, ఇంజమూరి శివ, దైద జనార్ధన్, కందుకూరి కోటేష్ ,మల్లికంటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్‌లో ఉత్తమ స్థానంలో పెంబి బ్లాక్

నిర్మల్ రూరల్, ఏప్రిల్18 (జనంసాక్షి)



ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా ఎంపికైన నిర్మల్ జిల్లా పెంబి బ్లాక్ జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్,3వ జోన్ లో 2 వ స్థానంలో నిలిచినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్(ఎబిపి) కింద పెంబి బ్లాక్ అక్టోబర్ నెల నుండి డిసెంబర్-2024 త్రైమాసికానికి మొత్తం 500 బ్లాక్ లలో ర్యాంకింగ్స్‌లో జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్, 3వ జోన్ లో 2వ ర్యాంక్‌ను సాధించిందన్నారు. దీంతో పెంబి బ్లాక్ అభివృద్ధి కోసం 1 కోటి రూపాయల అవార్డును సాధించిందన్నారు. ఇది ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పోషకాహారం, వ్యవసాయం, సామాజిక అభివృద్ధి, ప్రాథమిక మౌలిక సదుపాయాలు వంటి కీలక రంగాలతో సహా,40 రంగాల పనితీరు సూచికల ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లు సాధ్యమైనట్లు తెలిపారు. జూలై 2024లో నిర్వహించిన సంపూర్ణనాత్ అభియాన్, పనితీరును మెరుగుపరచడంలో కూడా ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమం కీలక పాత్ర పోషించిందన్నారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జిల్లా అధికారులు ,పెంబి మండలం అధికారులు, ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమ ప్రతినిధి నవీన్ ల కృషి, ప్రజల సహకారంతో ఈ అద్భుతమైన విజయం దక్కిందని కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# గీత కార్మికులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 18(జనంసాక్షి) :



**రాజ్యాంగ విరుద్ధమైన విడిసిలను నిషేధించాలి**

**జిల్లా కల్లు గీత కార్మిక సంఘం కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్**

కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, నిజామాబాద్ జిల్లా ఎరగట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో గీత కార్మికులను సాంఘిక బహిష్కరణ చేసి, శ్రీరామనవమి నాడు గుడిలోకి వచ్చిన మహిళలను గెంటివేసి అవమానపరిచి, ఉపాధి కల్పించే ఈత చెట్లను తగులబెట్టిన విడిసి కమిటీ సభ్యులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కల్లు గీత కార్మిక సంఘం ములుగు జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండలం, మండల కమిటీ ఆధ్వర్యంలో పసర రాంపూర్ సొసైటీ కల్లు గీత కార్మిక సంఘం సొసైటీ అధ్యక్షులు జక్కు రాజుగౌడ్ ఆధ్వర్యంలో తాళ్ల రాంపూర్ లో జరిగిన విడిసి కమిటీ పెద్దలను తక్షణమే అరెస్ట్ చేయాలని, కల్లు గీత కార్మికులతో నిరసన చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా, ఎర్రగట్ల మండలం, తాళ్ల రాంపూర్ లో రాజ్యాంగ విరుద్ధంగా ఏర్పాటు చేసిన విడిసి కమిటీ ల అరాచకాలు రోజు రోజుకు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. తాళ్ల రాంపూర్ లో తాళ్లు ఎక్కుతు న్నందుకు విడిసి కమిటీ కి డబ్బులు ఇవ్వలేదనే కక్ష తో కల్లు గీత వృత్తి నే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న గీత కార్మికులను తాళ్లు ఎక్కద్దని కల్లు ఎవరు తాగద్దని చాటింపు వేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పైగా ఈనెల 6 న శ్రీరామ నవమి పండుగ సందర్భంగా గౌడ మహిళలు గుడికి వస్తే మీరు గుడికి రావద్దు అని, బయటకు పంపిబహిష్కరణ చేసిన విడిసి కమిటీపై చట్ట రిత్య చర్యలు తీసుకోవాలని బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. నిజామాబాద్ జిల్లాలో వివిధ వృత్తులు చేస్తున్న కుర్మ, యాదవులు, ముదిరాజ్, బెస్త, వడ్డెర, నాయి బ్రాహ్మణ, నేత, మరియు దళితులు తదితర చేతి వృత్తి దారులను సాంఘిక బహిష్కరణ చేస్తున్న విడిసి కమిటీలను శాశ్వతంగా లేకుండా నిషేధించాలని బుర్ర శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం కల్లు జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, రాంపూర్ సొసైటీ అధ్యక్షుడు జక్కురాజు గౌడ్, జక్కు వేణు గౌడ్, జక్కు మొగిలి గౌడ్, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, మెరుగు సుధాకర్ గౌడ్, గిరిజన సంఘం జిల్లా నాయకులు పెండగట్ల బాలరాజ్, జక్కు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో విజయవంతంగా రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర




కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 18 (జనంసాక్షి)

: కరీంనగర్ లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర విజయవంతం అయ్యిందని ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. భగతనగర్ భగత్ సింగ్ కూడలి నుండి ప్రారంభమైన పాదయాత్ర డివిజన్ల మీదుగా వరకు కొనసాగింది. అందరితో ప్రతిజ్ఞ చేపించిన అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... మహాత్మా గాంధీ, అంబేద్కర్, రాజ్యాంగం మూడు చేతిలో పట్టుకొని ప్రతి రోజు అన్ని ప్రాంతాలలో పాదయాత్ర చేశామని సూర్య చంద్రులున్నంత వరకు ప్రజలు వారి గొప్పతనం, ప్రాధాన్యత గురించి తెలుసుకుంటూనే ఉండాలని భావితరాలకు వీరిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ వారి ప్రాధాన్యత తగ్గించాలని రాజ్యాంగం మార్చాలని కుట్రలు పన్నుతున్న వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గత పదిహేను రోజులుగా కరీంనగర్ లోని అన్ని ప్రాంతాల నాయకుల, కార్యకర్తల, ప్రజల సహకారంతో ఈ పాదయాత్ర విజయవంతంగా సాగిందని ఈ పాదయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి నరేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే నియోజక వర్గ స్థాయి పాదయాత్ర ముగింపు విజయవంత సభ జరుగుతుందని ఆతర్వాత అన్ని నియోజకవర్గాల వారితో కరీంనగర్ జిల్లాసభ చివరగా హైదరాబాదులో అన్ని జిల్లాల వారితో విజయవంత రాష్ట్ర సభ జరుగుతుందని తెలిపారు. ఈ పాదయాత్రలో నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, దన్న సింగ్, గడ్డం విలాస్ రెడ్డి, ఆకుల నర్సయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్, ఎస్సి సెల్ అధ్యక్షులు కరివి అరుణ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, వాడే వెంకట్ రెడ్డి, నెల్లి నర్సయ్య, రమణారెడ్డి, ములుగు ప్రకాష్, నయీమ్, అబ్దుల్ రహమాన్, లయాక్, పోరండ్ల రమేష్ వర ప్రసాద్, నాగుల సతీష్, వంగల విద్యాసాగర్, రాజా గౌడ్, రవి కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.



# రైతులను ఆగం చేసిన అకాల వర్షం

**అమ్మకానికి సిద్ధంగా వున్న ధాన్యం నీటి పాలు**

నంగునూరు, ఏప్రిల్ 18 (జనం సాక్షి )

అన్నదాతలపై ప్రకృతి పగబట్టింది. సగం పంటలు సాగునీరు అందక ఎండిపోగా, మరికొంత వడగండ్ల వానతో పొలంలోనే ధాన్యం రాలిపోయింది. ఆరబోసి అమ్మకానికి సిద్ధం చేసిన ధాన్యం వాన నీటి పాలైంది. శుక్రవారం సాయంత్రం నంగునూరు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలో కొనుగోలు కేంద్రాల వద్ద నిలువచేసిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. రైతులు ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునే అవస్థలు పడినా లాభం లేకపోయింది. దీం తో చాలా గ్రామాలలో కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. కొన్నిచోట్ల ధాన్యం కొట్టుకు పోయింది. కొండమరాజు పల్లి, ఖాతా, ఘనపురం, అక్కనపల్లి, సిద్ధన్నపేట, నంగునూరు, మగ్దుంపూర్ గ్రామాల్లో ఇంకా కోయని వరి చేన్లలో ధాన్యం రాలి అన్నదాతకు కన్నీళ్లను మిగిల్చింది. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగులకు ఉపాధి

వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 18(జనం సాక్షి) :



నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా అర్హులైన వారందరికీ ఉపాధి అవకాశాలు కల్పించి లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో రాజీవ్ యువ వికాసం పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజు యువ వికాస్ పథకం పై మండల్ లేవల్ కమిటీ ద్వారా పారదర్శకంగా యూనిట్స్ ఎంపిక జరగాలని ప్రభుత్వ నిబంధనల మేరకు రాజీవ్ యువ వికాసం పథకం అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి నియుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, బిసి వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఇ డి ఎస్ సి కార్పొరేషన్ అధికారి సురేష్, మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్యలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
19 ఏప్రిల్ 2025

# ప్రమోషన్ కోసం ఎన్నో చిత్ర విచిత్రాలు

- కోటి ఆసుపత్రిలో ఫేక్ వికలాంగుడి సర్టిఫికెట్ సృష్టించిన వైనం
- ప్రధానోపాధ్యాయుడిపై క్రిమినల్ చర్యలకు పోలీసులకు ఫిర్యాదు
- తీగ లాగితే డొంక కదులుతున్న వైనం
- రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన "జనంసాక్షి" కథనాలు




**షాద్‌నగర్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదర్ గూడా మండలంలోని పెద్ద ఎల్కిచేర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎం.వెంకట్ రెడ్డి వ్యవహరించిన తీరులో తీగ లాగితే డొంక కదులుతుంది ఏకంగా ప్రమోషన్ కోసం "పుట్టిన తేదీని మార్చి విద్యాశాఖ అధికారులను ఏ మార్చి అనే " కథనాలు జనంసాక్షి ప్రచురించిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ కార్యాలయాల్లో సంచలనగా మారాయి రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌లో 2024 ఏప్రిల్ మాసంలో ఉద్యోగ విరమణ చేసుకోవాల్సిన ఆయన ప్రమోషన్ కోసం పుట్టిన తేదీని మార్చుకొని రంగారెడ్డి జిల్లా పెద్దఎల్కిచేర్ల పాఠశాలలో ప్రస్తుతం ప్రమోషన్‌లో కొనసాగుతున్నారు. జనంసాక్షి కథనాలు ప్రచురించడంతో రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది ఇది ఇలా ఉంటే ప్రమోషన్ రిత్య తన అవసరం కోసం హైదరాబాదులోని కోటి ఆసుపత్రిలో వికలాంగుడి కోట కింద జిహెచ్ఎం కావాలన్న ఉద్దేశంతో ఫేక్ వికలాంగుడి సర్టిఫికెట్ తీసుకోవడంతో 2013వ సంవత్సరంలోనే అప్పటి (ఆర్జెడి) రీజనల్ జాయింట్ డైరెక్టర్ మస్తానయ్య మహబూబ్ నగర్ జిల్లా డీఈఓకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు కానీ ఇప్పటివరకు అతనిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం అవినీతికి పరాకాష్టగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ఇప్పటికే అతడిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ జిల్లేడు చౌదర్ గూడ మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు ప్రభుత్వన్ని విద్యాశాఖ అధికారులను తప్పుదోవ పట్టించి సుమారు 15 లక్షల రూపాయల వరకు జీతం తీసుకున్న అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని పేద విద్యార్థులకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే...

**విచారణ జరుపుతున్నాం చర్యలు తీసుకుంటాం : ఆర్జెడి విజయలక్ష్మి**

ప్రమోషన్ కోసం పుట్టిన తేదీని మార్చుకొని ప్రభుత్వాన్ని విద్యాశాఖ అధికారులను తప్పుదోవ పట్టించిన ఘటనపై ఆర్జెడి విజయలక్ష్మినీ వివరణ కోరగా ఇప్పటికే అతడిపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతుందని మూడు జిల్లాల డీఈఓ లతో వివరాలు సేకరిస్తున్నామని విచారణలో వాస్తవాలు తేలితే కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు గతంలో వికలాంగుడి కోటలో ప్రమోషన్ కు సైతం ఫేక్ వికలాంగుడి సర్టిఫికెట్ సృష్టించిన వైనంపై కూడా పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు అయితే అతని ఒరిజినల్ డేట్ అఫ్ బర్త్ మాత్రం 1963 గా తేలిందన్నారు.



ORDER

The District Educational Officer, Mahaboobnagar in his letter 10th cited has reported that the certificate of PH-Hearing Impaired in respect of Sri. M. Venkat Reddy, SA (Maths) ZPHS Talkapally V& M. has been referred to the Medical Board at Govt. ENT Hospital, Koti for its genuineness and the Superintendent of Govt. ENT Hospital, Koti, Hyderabad has stated that the Certificate of PH-HI in respect of the said person has not issued by the Board.

In view of the above, the District Educational Officer, Mahaboobnagar is requested to initiate suitable disciplinary action against the said teacher for cheating by producing fake certificate to the Govt/Deptt., as per rules in force and report compliance immediately.

Receipt of the proceedings should be acknowledged.

V.N. MASTHANAIAH
REGIONAL JOINT DIRECTOR OF
SCHOOL EDUCATION::HYDERABAD.

To
The District Educational Officer, Mahaboobnagar.

## వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దేవరకొండలో నిరసనలు




- ప్లకార్డులతో ముస్లింల నిరసన వక్ఫ్ బిల్లు
- ఉపసంహరించుకోవాలని డిమాండ్

**దేవరకొండ, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** వక్ఫ్ చట్టం సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేవరకొండలో శుక్రవారం ప్రార్థన అనంతరం ముస్లింలు సోదరులంతా నిరసన ప్రదర్శన చేశారు. జమియత్ ఉలేమా ఏ హింద్ మరియు ఈద్గా కమిటీ దేవరకొండల ఆధ్వర్యంలో జూమా నమాజ్ అనంతరం పట్టణంలోని ప్రతి మస్జీద్ వద్ద వక్ఫ్ సవరణ బిల్లు 2025కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరు తమ తమ మస్జీద్ ల వద్ద ప్లే కార్డ్ చేతబట్టి, బ్యానర్ లతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లు కు వ్యతిరేకంగా శాంతియుత నిరసన భావాన్ని తెలియజేశారు. వక్ఫ్ బిల్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం మతాలవారీగా చిచ్చు పెట్టాలని చూస్తుందని విమర్శించారు. వక్ఫ్ భూములను కాజేయడానికి కుట్ర పన్నుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమియత్ ఉలేమా ఏ హింద్ అధ్యక్షులు ముఫ్తి మహ్మద్ జావీద్ హుస్సేన్ ఖాస్మి, అధ్యక్షులు ఈద్గా కమిటీ సయ్యద్ అజీమోద్దీన్, ముఫ్తి రిజ్వాన్, మౌలానా ఫారూక్,మౌలానా అలీమోద్దీన్,మౌలానా మాజీద్, మౌలానా తయ్యాబ్, మౌలానా ఉమర్ ఖాన్, మౌలానా అబ్దుల్ రహీం, మౌలానా కామాల్, మౌలానా ఆసిఫ్, మౌలానా థౌఫీక్, మౌలానా ఫారూక్, మౌలానా ఉమేర్, పట్టణ ఉలేమాలు, మౌలానాలు,ఇమాములు, మౌజన్లు, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా ఉండాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** నకిలీ విత్తనాలు సరఫరా జరిగి రైతులు నష్టపోక ముందే అధికారులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలను గుర్తించి సీజ్ చేయాలని, నకిలీ విత్తనాల వల్ల జిల్లాలో ఒక్క రైతు కూడా నష్టపోవద్దని జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు.సంబంధిత అధికారులు అందరూ సమన్వయంగా పని చేసి రైతులకు నకిలీ వితనాలు సరఫరా జరగకుండా చూడాలని అన్నారు.రాష్ట్రానికి, దేశానికి వ్యవసాయం ముఖ్యమైన ఆధారమని, అలాంటి వ్యవసాయం చేసే రైతులు ఆరుగాలం కష్టపడి నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై ఉందన్నారు.విత్తన వ్యాపార డీలర్స్ బాధ్యతగా మంచి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని అన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్



**టేకులపల్లి, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండల పరిధిలోని ముర్రేడు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను శుక్రవారం సులానగర్ గ్రామంలో టేకులపల్లి ఎస్సై ఏ రాజేందర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రధాన రహదారిపై వరుసగా వస్తుండడంతో ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్కు తరలించారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి, ట్రాక్టర్ డ్రైవర్ల ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ముర్రేడు వాగు నుండి విచ్చలవిడిగా అక్రమంగా ఇసుకను నిత్యం తరలిస్తున్న విషయం విధితమే. వివిధ పత్రికల్లో అక్రమ ఇసుక రవాణాపై వార్త కథనాలు గత కొంతకాలం నుండి ప్రచురితం అవుతున్న సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతుంది. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజేందర్ అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించి, తన సిబ్బందితో 7 ట్రాక్టర్లను సీజ్ చేయడం విశేషం. ఇసుక అక్రమ రవాణాపై ఎస్సై ఉక్కు పాదం మోపడం పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

# దోమలవాగును మినీ రిజర్వాయర్‌గా తీర్చిదిద్దాలి

- 1405 ఎకరాలకు నీటి లభ్యత
- ఎమ్మెల్యే పాయం కు కాంగ్రెస్ నేతలు రైతుల వినతి



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని టేకులచెరువు సమీపంలో దోమల వాగును మినీ రిజర్వాయర్గా తీర్చిదిద్దాలని... అలా చేస్తే మండలంలోని టేకులచెరువు, లక్ష్మీపురం, సంజీవరెడ్డిపాలెం, బూర్గంపహాడ్, మోరంపల్లిబంజర్, అంజనాపురం, నకిరిపేట, గోపాలపురం, పోలవరం, కొమ్ము నకిరిపేట, వేపలగడ్డ పరిధిలోని 1405 ఎకరాల్లో 11 గ్రామాల రైతులకు లబ్ది చేకూరుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ను స్థానిక కాంగ్రెస్ నేతలు, రైతులు మణుగూరులోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దోమలవాగు చెరువుకు పై భాగాన సీతారామ ప్రాజెక్టు కాలువ పోతుండటంతో దోమలవాగు చెరువును అనుసంధానం చేస్తే 1405 ఎకరాల ఆయకట్టు బాగుపడుతుందని, సీతారామ కాలువ లింక్ ను ఈ చెరువుకు అనుసంధానం చేయాలని తద్వారా రైతులకు అన్నివిధాలుగా లబ్ది చేకూరుతుందని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందని, అలాంటి రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని, రైతులకు మేలు చేసేందుకు త్వరలోనే దోమలవాగు వద్ద మినీ రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రైతుల కోరికను నెరవేర్చేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంపై సంబంధిత ఇరిగేషన్ అధికారులతో మాట్లాడతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, నాయకులు బాదం రమేష్ రెడ్డి, బాదం నాగిరెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, ఎం బంజర గ్రామ కమిటీ అధ్యక్షుడు వీరారెడ్డి, భజన సతీష్, మందా నాగరాజు, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, ఇంగువ రమేష్, కైపు లక్ష్మినారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సర్పా వెంకటేశ్వర్లు, సపావత్ సీతారాం, తేజావత్ పున్న, ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్ లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు కొండంత అండని అని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు.రాష్ట్రంలో వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట పేర్కొన్నారు. సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు ఆరు లక్షల 88వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధుల విడుదలకు సహకరించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం భూ సమస్యలకు పరిష్కారం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే పాయం




**పినపాక, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ప్రజల కోసం, ప్రత్యేకంగా రైతుల భూములపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పినపాక మండల కేంద్రంలోని జివిఆర్ కల్యాణ మండపంలో భూ భారతి చట్టం అవగాహన సదస్సును పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తో కలిసి శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు మీసేవలో దరఖాస్తు చేసుకుంటే నిర్దేశించిన సమయంలో స్థానిక తాసిల్దారులు పరిష్కరిస్తారన్నారు.ఈ చట్టం ద్వారా భూములకు సంబంధించి అవినీతిని అరికట్టి రెవెన్యూ శాఖను బలోపేతం చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లడానికి పైలట్ స్టడీ కోసం ప్రత్యేకించి కొన్ని మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టం భూ వివాదాలకు పరిష్కారం చూపుతుందని పేర్కొన్నారు. వివాదాలకు తావు లేకుండా రైతుల భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ కొత్త చట్టాన్ని తెచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తిస్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేయనున్నట్లు చెప్పారు. వారసత్వంగా వచ్చిన భూములకు ముందు సమగ్ర విచారణ చేస్తామన్నారు. గ్రామస్థాయిలోని సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. భూ సమస్యల పరిష్కారంలో అప్పీల్ వ్యవస్థ ఉందని తహసీల్దార్ జారీ చేసిన ఆర్డర్ పై ఆర్డీవోకు, ఆర్డీవో జారీ చేసిన ఆర్డర్ పై కలెక్టర్ కు అప్పీలు చేసుకునే వెసులు బాటు తీసుకువచ్చిందని వివరించారు. కొనుగోలు, దానం, తనఖా, పాలు పంపకాల ద్వారా భూమిపై హక్కుల సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డుల్లో మార్పు చేసి హక్కుల రికార్డుల్లో మార్పు చేసి పట్టాదారు పాసు పుస్తకాన్ని జారీ చేస్తారని ఈ ప్రక్రియ ఒకేరోజులో పూర్తయ్యే విధంగా చట్టంలో పొందుపరిచారని తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్ అనంతరం లబ్ధిదారుడి పట్టా పాస్‌బుక్‌లో భూ మ్యాపింగ్ నమోదవుతుందని, భూకమతాలకు భూధార్ కార్డులు జారీ చేయనున్నట్టు చెప్పారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టంలోని ముఖ్యాంశాలను కలెక్టర్ వివరించారు. మండలానికి చెందిన రైతుల నుంచి భూసంబంధిత ఫిర్యాదులు స్వీకరించి వాటిపై సమీక్షించి పరిష్కార విధానాలను తెలిపారు. రైతులు అడిగిన ప్రతి సమస్యకు కలెక్టర్ సవివరంగా వివరణ ఇచ్చారు. అనంతరం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానంగా జీవించటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిష్పక్షపాతంగా చట్టాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. భూముల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దని ఉద్దేశంతో ప్రభుత్వం మరో 14అంశాలను పొందుపరిచిందని తెలిపారు. భూముల విషయంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఏడాదిలో పరిష్కరించుకోవడానికి అవకాశం కల్పించిందన్నారు. భూమి విలువ రూ.5లక్షల లోపు ఉంటే ఆర్డీఓ స్థాయి, రూ.5లక్షలకు పైగా ఉన్న పక్షంలో కలెక్టర్ స్థాయి అధికారులు సమస్యను పరిష్కరించడానికి అవకాశం ఉందని తెలిపారు. ఇక నుంచి పరిశీలించిన తర్వాతనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగిస్తారని తెలిపారు. మే 1 నుంచి 31 వరకు పరిశీలన చేసిన అనంతరం జూన్ 2నుంచి పట్టాలు ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని తెలిపారు.భూ సమస్యల పరిష్కారానికే కాంగ్రెస్ ప్రభుత్వం'భూ భారతి' చట్టాన్ని తెచ్చిందని దీని ద్వారా రైతులకు సరైన న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణిలో చాలా పొరపాట్లు జరిగాయని, అర్హులైన రైతులు నష్టపోగా పాలకులు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని అన్నారు. అధికారులు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు ఈ చట్టంతో కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్ రావు, ఏడిఏ తాతారావు, తాసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో సునీల్ కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ సమ్మయ్య, అగ్రికల్చర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఏపీఓ వీరభద్రస్వామి, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నాడు వరి వేస్తే ఉరి..నేడు పండగ వాతావరణం



- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 (జనం సాక్షి) :** ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు భూదాన్ పోచంపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోచంపల్లిలో ఇప్పటి వరకు వడ్ల కొనుగోలు కేంద్రానికి స్థలం లేదని ప్రైవేటు స్థలం లీజుకు తీసుకోని నడిపేవారని, రెవెన్యూ అధికారులతో మాట్లాడి జలాల్ పూర్ లో వడ్ల కొనుగోలు కేంద్రానికి మొదటి సారి ఐదున్నర ఎకరాలలో ల్యాండ్ అలాట్ చేసుకోవడం జరిగిందని అన్నారు. సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యంత్రాంగం అంతా పనిచేస్తుందని అన్నారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నారని ఈరోజు వరి వేస్తే పండుగలా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తుందని అన్నారు. అదే విదంగా సన్న బియ్యాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లకు తెల్ల రేషన్ కార్డు లబ్దిదారులకు పంపిణీ చేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు పక్షపాతిగా రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాక మల్లేష్, సామ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కొట్టం కరుణాకర్ రెడ్డి, మరి నరసింహారెడ్డి, భారత లవ కుమార్ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పసిడి నాణ్యతను

# గుర్తించండిలా..

- హాల్‌మార్క్‌తోనే మోసాలకు చెక్
- యూనిక్ ఐడీ నంబర్‌ను బట్టి స్వచ్ఛత
- నాణ్యత శాతం సర్టిఫికెట్‌తోనే అసలు గుర్తింపు



బంగారం ఆభరణాలంటే ఇష్టపడని వారుండరు. ముఖ్యంగా మహిళలు మక్కువ చూపుతారు. హుందాకు చిహ్నంగా భావిస్తారు. అందుకే పెళ్లిళ్లు, శుభకార్యాలయాల్లో బంగార ఆభరణాలదే అగ్రస్థానం. ధర ఎంత పెరిగినా.. పసిడిని కొనుగోలు చేయడం మానరు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం సంప్రదాయ అవసరాలు తీర్చడమే కాకుండా పెట్టుబడులకు కూడా ఉపయోగపడుతోంది. అందుకే చాలా మంది భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బంగారం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే అసలు బంగారం, దాని నాణ్యతను సులువుగా గుర్తించి మోసాలకు చెక్ పెట్టొచ్చు. ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర రూ.95 వేలకుపైగా చేరింది. ఈ క్రమంలో కొనుగోలు సమయంలో వినియోగదారులు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.బంగారు ఆభరణం తయారీలో నికిల్, మాంగనీస్ లేదా పల్లాడియం వంటి లోహాలు కలుపుతారు. అప్పుడు అది బంగారం వర్ణంలోనే కొంచెం తెల్లని ఛాయలో ఉంటుంది. రాగి ఎక్కువ కలిపితే ఎరుపు, గులాబీ ఛాయలో కనిపిస్తుంది. రోజ్‌గోల్డ్ అయితే అందులో 25 శాతం రాగి కలిపినట్లు అర్థం చేసుకోవచ్చు. అప్పుడు ఆ బంగారంతో 18 క్యారెట్లు మాత్రమే ఉంటుంది. వెండి, మాంగనీస్, రాగిని ఉపయోగిస్తే బూడిద రంగు ఛాయలో ఉంటుంది. కేవలం వెండిని మాత్రమే కలిపితే గ్రీనిస్ షేడ్‌లో కనిపిస్తుంది.

**స్వచ్ఛత గుర్తింపు ఇలా..**

ఆభరణం అంచులు రంగు పోయి బంగారపు వర్ణం కాకుండా ఇతర వర్ణం కనిపిస్తుంటే అది కచ్చితంగా పూత పోసిన ఆభరణమని గ్రహించాలి. నోటి పళ్ల మధ్య పెట్టి బలంతో ఆభరణాన్ని నొక్కి చూడండి. స్వచ్ఛ బంగారమా.. పూత పోసిందా అని తెలుసుకోవచ్చు. పంటి గాట్లను గమనించి బంగారం నాణ్యతను సులభంగా తెలుసుకోవచ్చు. బంగారంలో ఇనుము కలిసి ఉంటే ఆయస్కాంతంతో గుర్తించొచ్చు. షైనింగ్ లేని సిరామిక్ ప్లేట్ మీద బంగారు ఆభరణాన్ని రుద్దితే నల్లని చారలు పడితే అది స్వచ్ఛమైనది కాదు. బంగారు గీతలు పడితే స్వచ్ఛమైనది అని అర్థం.ఆభరణం కొనుగోలుకు ముందే షాపు వద్ద నైట్రిక్ యాసిడ్‌తో టెస్ట్ చేయమని కోరవచ్చు. ఆభరణంపై చుక్క నైట్రిక్ యాసిడ్ వేసిన వెంటనే రసాయనిక చర్య ప్రారంభమై ఆకుపచ్చ రంగులో కనిపిస్తే బేస్ మెటల్ లేదా బంగారు పూత వేసిందిగా గ్రహించాలి. బంగారం వర్ణంలోనే రియాక్షన్ కనిపిస్తే బంగారం పూత వేసి ఇత్తడిగా గమనించాలి. పాల రంగులో కనిపిస్తే వెండి ఆభరణంగా ఎలాంటి రియాక్షన్ లేకపోతే దానిని స్వచ్ఛమైన ఆభరణంగా గుర్తించాలి.

**కేడీఎం అంటే..**

జ్యూవెల్లరీ దుకాణంలో బంగారం కొనే సమయంలో ఆ ఆభరణం కేడీఎం అని షాపు యజమానులు చెబుతారు. అసలు కేడీఎం (%ఖణవీ +శీశ్రీఎ%) అంటే బంగారు ఆభరణాలు తయారీలో కాడ్మియంతో సోల్డరింగ్ చేస్తారు. ఇవి 91.6 స్వచ్ఛతతో ఉంటాయి.

**ఇవి గమనించాలి..**

24 క్యారెట్ల బంగారంలో 99.9, 22 క్యారెట్ బంగారంలో 91.6 శాతం స్వచ్ఛత ఉంటుంది. స్వచ్ఛ బంగారం మొత్తగా ఉంటుంది. బంగారంలో కలిపిన ఇతర లోహాల శాతాన్ని బట్టి ఆభరణాల రంగు, గట్టిదనం, మన్నిక ఆధారపడి ఉంటాయి. నాణ్యత తెలిపే కొలమానం వేయించుకుని రశీదులు తీసుకోవాలి. భవిష్యత్‌లో తేడా వస్తే కేసు వేయడానికి అవకాశం ఉంటుంది.

**క్యారెట్ల బట్టి స్వచ్ఛత..**

24 క్యారెట్లు: 99.9 శాతం స్వచ్ఛత ఇది. బిస్కెట్ రూపంలో ఉంటుంది.

22 క్యారెట్లు: 91.6 శాతం బంగారం, మిగతా 8.4 శాతం ఇతర లోహాలు కలుస్తాయి.

18 క్యారెట్లు: 75 శాతం బంగారం, మిగతా 25శాతం ఇతర లోహాలు

14 క్యారెట్లు: 58.5 శాతం బంగారం, మిగతా భాగం ఇతర లోహాలు

# భారత జాబ్‌మార్కెట్ భేష్



న్యూఢిల్లీ: అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ భారత ఉద్యోగ మార్కెట్ బలంగా నిలబడిందని.. పలు రంగాల్లో నియామకాలు మెరుగ్గా సాగాయని మైఖేల్ పేజ్ ఇండియా (అంతర్జాతీయ నియామకాల సంస్థ) ఎండీ నిలయ్ ఖండేల్‌వాల్ తెలిపారు.సాంకేతిక నైపుణ్యాల్లో లోతైన అనుభవం, వ్యయ నియంత్రణలు, సిబ్బంది కొత్త నైపుణ్యాలను వేగంగా అలవరుచుకోవడాన్ని భారత్ బలాలుగా పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధి మందగమనంతో అంతర్జాతీయంగా కొన్ని ప్రాంతాల్లో నియామకాల పట్ల అప్రమత్త ధోరణి నెలకొనగా.. భారత్‌లో మాత్రం నిపుణులకు డిమాండ్ ఉన్నట్టు చెప్పారు. ముఖ్యంగా టెక్నాలజీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో ఈ పరిస్థితి ఉన్నట్టు తెలిపారు. స్టెమ్ విభాగంలో (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) ఆధిపత్యంతో భారత్ నైపుణ్య కేంద్రంగా కొనసాగుతోందని.. పోటీతో కూడిన వేతనాలు, ప్రభుత్వ మద్దతుతో నైపుణ్యాల కల్పన, అంతర్జాతీయ క్యాపబులిటీ కేంద్రాల (జీసీసీలు) విస్తరణ ఇందుకు మద్దతుగా నిలుస్తున్నట్టు పేర్కొన్నారు.జీసీసీలు ఏఐ, ఆటోమేషన్, ఆర్అండ్‌డీపై దృష్టి సారించడం వల్ల ఆవిష్కరణలకు భారత్ కీలక కేంద్రంగా మారినట్టు చెప్పారు. స్కిల్ ఇండియా, ఏఐ ఆధారిత నైపుణ్యాల అభివృద్ధి నిపుణులకు ఉపాధి అవకాశాలను పెంచుతాయన్నారు. భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించాలంటే, నైపుణ్యాల అభివృద్ధిని వేగవంతం చేయాలంటూ.. ఏఐ, సెమీకండక్టర్ పరిశ్రమల్లో అధిక నైపుణ్య మానవ వనరుల అవసరం ఉంటుందని సూచించారు.ఉద్యోగం–వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం పెరుగుతున్నందున ఉత్పాదకత ఆధారిత పని నమూనాలపై కంపెనీలు దృష్టి సారించాల్సి ఉంటుందన్నారు. ఈవై జీసీసీ సర్వే, 2024ను ఉదహరిస్తూ.. అంతర్జాతీయ సంస్థల్లో 50 శాతం భారత్‌లో తమ జీసీసీ కార్యకలాపాలను విస్తరించాలని చూస్తున్నట్టు తెలిపారు.

## విపణి

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.05 | ₹ 4.07 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 89,450 | ₹ 97,580 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,10,000

# భారీగా పెరిగిన కొత్త డీమ్యాట్ అకౌంట్స్

## పెట్టుబడి రంగంలో విశేష మార్పులు



ముంబయి: భారతదేశంలో పెట్టుబడి రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) 84 లక్షలకు పైగా కొత్త డీమ్యాట్ ఖాతాలను జోడించింది. ఇది సంవత్సరానికి 20.5% వృద్ధిని సూచిస్తుంది. ప్రస్తుతం మొత్తం యాక్టివ్ డీమ్యాట్ ఖాతాల సంఖ్య 4.92 కోట్లకు చేరింది. ఈ వృద్ధిలో గ్రో అనే బ్రోకరేజ్ సంస్థ ముందంజలో నిలిచింది.ఇది మొత్తం కొత్త ఖాతాలలో 40% కంటే ఎక్కువ భాగాన్ని సొంతం చేసుకుంది. దీంతో గ్రో దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న బ్రోకరేజ్ వేదికగా నిలిచింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం.. గ్రో చురుకైన క్లయింట్ల సంఖ్య 2024 మార్చిలో 95 లక్షల నుండి 2025 మార్చి నాటికి 1.29 కోట్లకు పెరిగింది. ఇది 36% వృద్ధిని సూచిస్తోంది. ఇది పరిశ్రమ సగటు వృద్ధి కంటే గణనీయంగా ఎక్కువ.గ్రో యొక్క మార్కెట్ వాటా 23.28% నుండి 26.26%కు పెరిగింది, ప్రతి నెలా స్థిరమైన పురోగతిని నమోదు చేసింది. ఇతర బ్రోకరేజ్ సంస్థలతో పోలిస్తే, రెండో అతిపెద్ద బ్రోకర్ జీరోధా 5.8 లక్షల ఖాతాలను జోడించి, ఎన్ఎస్ఈ మొత్తం వృద్ధిలో 6.9% దోహదం చేసింది. ఏంజెల్ వన్ 14.6 లక్షల ఖాతాలను జోడించి 17.38% దోహదం చేసింది. వీటి మార్కెట్ వాటాలు వరుసగా 16% మరియు 15.38%గా ఉన్నాయి. 2025 జనవరిలో ఎన్ఎస్ఈ చురుకైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 5.02 కోట్లతో గరిష్ఠ స్థాయికి చేరింది. అయితే, ఆర్థిక సంవత్సరం చివరి రెండు నెలల్లో మార్కెట్ అస్థిరత కారణంగా స్వల్ప తగ్గుదల నమోదైంది.

**పెరుగుతున్న మహిళా పెట్టుబడిదారులు..**

గ్రో సగటు నెలవారీ క్లయింట్ వృద్ధి 3%గా ఉంది, ఇది పరిశ్రమ సగటు 1.74% కంటే ఎక్కువ. గ్రో యొక్క డిజిటల్–ప్రధాన విధానం, సరళమైన వినియోగదారు అనుభవం, టైర్ నగరాల నుండి మొదటిసారి పెట్టుబడిదారులతో బలమైన అనుబంధం ఈ వృద్ధికి కారణాలుగా చెప్పవచ్చు. ఈ డేటా వ్యక్తిగత పెట్టుబడుల పెరుగుదలను సూచిస్తుంది, ఇందులో యువ, సాంకేతిక పరిజ్ఞానం గల తరం సులభమైన వేదికలు, పారదర్శక ప్రక్రియలు, సరళమైన ఆన్‌బోర్డింగ్‌ను ఎంచుకుంటోంది. కొత్త డీమ్యాట్ ఖాతాదారుల సగటు వయస్సు క్రమంగా తగ్గుతోంది, దాదాపు 30 ఏళ్లలోపు వారు ఎక్కువగా ఉన్నారు. అంతేకాక, మహిళా పెట్టుబడిదారుల సంఖ్య కూడా పెరుగుతోంది. ప్రతి నలుగురు కొత్త పెట్టుబడిదారులలో ఒకరు మహిళగా ఉండటం ఆర్థిక భాగస్వామ్యంలో సానుకూల మార్పును సూచిస్తుంది.

# భారతీయ రైల్వే @173



**శతాబ్దాల ఘన చరిత్ర**

**మోనో, మెట్రో, లోకల్ రైళ్లతో దశలవారీగా**

రైల్వే అధికారులు, ప్రయాణికుల అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక సన్మానం 153లో ముంబై నుంచి తొలి రైలు పరుగులు..బుధవారంతో 172ఏళ్లు పూర్తి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఇండియన్ రైల్వే విజయవంతంగా 172 సంవత్సరాలు పూర్తిచేసుకుని 173వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినస్, థానేలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రయాణికుల అసోసియేషన్స్ సభ్యులు కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే ఎంపీ నరేష్ మస్కే థానే స్టేషన్ మాస్టర్ కేశవ్‌తావడేతోపాటు రైల్వే అధికారులు, ప్రయాణికుల సంఘటన పదాధికారులను ప్రత్యేకంగా సన్మానించారు.దేశ ఆర్థిక రాజధానిగా, మహారాష్ట్ర రాజధాని ముంబై నగర అభివృద్ధికి అనేక కారణాలున్నప్పటికీ వాటిలో రైల్వేవ్యవస్థది ప్రధానపాత్ర. 1843లో మొదలై నేటి వరకూ రైల్వే దేశవ్యాప్తంగా విస్తరించింది. ముఖ్యంగా మోనో, మెట్రో రైళ్ల ప్రవేశం రైల్వే విస్తరణలో కీలక ముందడుగు. వీటితో పాటు ఇటీవలే ప్రారంభించిన అత్యాధునిక వందేభారత్ రైలు, త్వరలో ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్న ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్‌రైలు రైల్వే కిరీటంలో కలికితురాళ్లు. ఈ నేపథ్యంలో ముఖ్యంగా ముంబై రవాణా వ్యవస్థలో కీలకమైన లోకల్ రైళ్ల గురించి కొన్ని వివరాలు తెలుసుకుందాం. అది 1843వ సంవత్సరం. ఏదో పని నిమిత్తం సైన్–భాండూప్ రోడ్డుపై వెళ్తున్న బ్రిటీష్ ఇంజినీర్ జార్జ్ క్లార్క్‌కు హఠాత్తుగా ముంబైలోని ద్వీపాలన్నింటిని కలుపుతూ ఒక రైల్వే లైన్‌ను వేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన మనసులోకి వచ్చింది. అనుకున్నదే తడవుగా ఉన్నతాధికారులతో చర్చించి పనులు ప్రారంభించారు. కేవలం పదేళ్లలో పనులు పూర్తిచేశారు.1853 ఏప్రిల్ 16వ తేదీ మొట్టమొదటి రైలు ముంబై నుంచి థాణేకి మధ్యాహ్నం 3.30 గంటలకు విజయవంతంగా బయలుదేరింది. అప్పటినుంచి రైల్వే ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోంది. ముంబై రవాణాలో బెస్ట్ బస్సులతో పాటు సబర్బన్ లోకల్ రైళ్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ఇవి 'ముంబై లైఫ్‌లైన్'లుగా పేరుపొందాయి. ఇక్కడ ప్రజలు నిరంతరం ఉరుకులు పరుగులతో బిజీగా ఉంటారు. వారి జీవన విధానానికి తగ్గట్లుగా లోకల్ రైళ్ల వ్యవస్థను రూపొందించారు. మూడు నుంచి అయిదు నిమిషాల తేడాతో నడిచే ఈ లోకల్ రైళ్లలో ప్రపంచంలోని ఎక్కడా లేని విధంగా ప్రతి రోజు సుమారు 65 లక్షలమందికిపైగా ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు.నగరంలో సెంట్రల్ రైల్వే, వెస్టర్న్ రైల్వే హెడ్ క్వార్టర్లున్నాయి. సెంట్రల్ రైల్వే పరిధిలో మెయిన్ (ప్రధాన), హార్బర్, ట్రాన్స్ హార్బర్, వెస్టర్న్‌రైల్వే పరిధిలో వెస్టర్న్ సబర్బన్ లోకల్‌తోపాటు మోనో, మెట్రో రైల్వే మార్గాలలో రైళ్లు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో లోకల్ రైల్వేస్టేషన్లను ఆనుకని వివిధ ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. ఇతర నగరాలలో మామూలుగా ఒకటి వెళ్లేందుకు, మరోటి వచ్చేందుకు ఇలా అప్, డౌన్ మార్గాలు (రైల్వేట్రాకులు) ఉంటాయి.కానీ లోకల్ రైలు సేవల కోసం మాత్రం ప్రత్యేకంగా నాలుగు ట్రాక్‌లు ఉన్నాయి. దీంతో స్లో, ఫాస్ట్ ఇలా రెండు రకాల లోకల్ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే రైళ్లకు పెద్ద అంతరాయం లేకుండా పోయింది. అదే విధంగా లోకల్ రైళ్ల వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు అయిదు, ఆరో ట్రాక్‌లు కొన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చాయి. ఇంకా కొన్ని ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. సాధారణంగా లోకల్ రైళ్లన్నీ డైరెక్ట్ కరెంట్ (డిసి)పై నడుస్తాయి. తరువాతి కాలంలోనుంచి ఆల్టర్‌నేట్ కరెంట్ (ఎసి)కి మార్చారు.

**చారిత్రక ఘట్టాలు...**


ప్రారంభంలో ముంబై ప్రజలు రైళ్లను 'బకరా గాడీ'లని పిలిచేవారు. 1853లో మొదటి రైలు ప్రారంభం తర్వాత 1856లో మొట్టమొదటి రైల్వే టైంటేబుల్ రూపొందించారు. 1886 నుంచి ప్లాట్‌ఫారం టిక్కెట్ల విక్రయం ప్రారంభించారు. 1874లో సైన్ రైల్వేస్టేషన్ నిర్మాణం, 1880లో ముంబై–కళ్యాణ్ రెండు వైపుల రైల్వే సేవలను ప్రారంభించారు. దేశంలోని చారిత్రక కట్టడాల్లో ఒకటైన నాటి విక్టోరియా టర్మినస్ 'నేటి ఛత్రపతి శివాజీ టర్మినస్)ను 1889లో, 1890లో డోంబివలి రైల్వేస్టేషన్ నిర్మాణాన్ని పూర్తిచేశారు. సర్వీసులను మరింత వేగవంతం చేసేందుకు 1929లో ముంబై–కళ్యాణ్‌ల మధ్య రైల్వేలైన్లను విద్యుదీకరించారు.

## జాతీయం అంతర్జాతీయం

# తర్వలో ఈపీఎఫ్ఓ 3.0

## కీలక వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో డిజిటల్‌గా కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు.ఈపీఎఫ్ఓ 3.0తో 9 కోట్ల మంది చందాదారులకు ప్రయోజనం చేకూరనుందని వివరించారు. మే లేదా జూన్‌కల్లా కొత్త వెర్షన్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ 'పీటీఐ'కిచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలు పంచుకున్నారు.ఈపీఎఫ్ఓ వెర్షన్ 3.0తో సేవలు మరింత సులభతరం కానున్నాయనని చెప్పారు. ఆటో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు, డిజిటల్ కరెక్షన్లు, ఏటీఎం ద్వారా విత్‌డ్రా వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈపీఎఫ్ఓను మరింత సౌకర్యంగా, సమర్థంగా తీర్చిదిద్దడమే ఈ మార్పుల వెనుక ముఖ్య ఉద్దేశమని వివరించారు.క్లెయిమ్‌లు, కరెక్షన్ల కోసం ఫారాలు నింపడం, కార్యాలయాల చుట్టూ తిరగడం వంటి ఇబ్బందులు ఈ కొత్త వెర్షన్‌తో తొలగబోతున్నాయని మాండవీయ తెలిపారు. వేగవంతమైన సెటిల్‌మెంట్ల వల్ల డబ్బులు వారి వారి బ్యాంక్ ఖాతాల్లో త్వరగా జమ అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 27 లక్షల కోట్ల విలువైన నగదు నిల్వలను ఈపీఎఫ్ఓ కలిగి ఉందని, ఈ మొత్తానికి ప్రభుత్వ హామీతో పాటు 8.25 శాతం వడ్డీని అందిస్తోందని చెప్పారు.సెంట్రలైజ్డ్ పెన్షన్ పేమెంట్ సిస్టమ్ వల్ల ఇప్పటికే దేశంలోని ఏ బ్యాంక్ నుంచైనా పెన్షన్ పొందే వెసులుబాటు కల్పించామని, దీనివల్ల 78 లక్షల మందికి ప్రయోజనం కలుగుతోందని వివరించారు. అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ బీమా యోజన, శ్రామిక్ జన్‌ధన్ యోజన వంటి పెన్షన్ పథకాలన్నింటినీ ఏకీకృతం చేసి పెన్షన్ కవరేజీని క్రమబద్ధీకరించడం, బలోపేతం చేసే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందన్నారు.




# మస్క్‌తో మోదీ మంతనాలు

వెల్లడించారు. "ఎలాన్ మస్క్‌తో పలుఅం శాలపై మాట్లాడా. ఈ ఏడాది ఆరంభంలో వాషింగ్టన్‌లో భేటీ సందర్భంగా చర్చకు వచ్చిన అంశాలనూ మేం ప్రసా _వించాం. సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహ కారానికి ఉన్న ప్రాముఖ్యతపై చర్చించాం. ఈ రంగాల్లో అమెరికాతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉంది" అని మోదీ రాసుకొచ్చా రు.ఎలాన్ మస్క్ నేతృత్వంలోని టెస్లా, స్టార్‌లింక్ ఇంటర్నెట్ సంస్థలు భారత మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఆసక్తి చూపుతున్న వేళ వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఫిబ్రవరిలో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ప్రధానితో మస్క్ భేటీ అయ్యారు. అంతరిక్షం, మొబిలిటీ, టెక్నాలజీ వంటి రంగాలపై వీరిద్దరూ చర్చలు జరిపారు. ఈ భేటీ జరిగిన కొన్ని రోజులకే.. భారత్‌లో ప్రక్రియ ప్రారంభించినట్లు కథనాలు వెలువడ్డాయి.

# త్వరలో ఆర్థిక మాంద్యం!




అమెరికా సుంకాలు ప్రపంచ వాణిజ్య యుద్ధాన్ని ప్రేరేపిస్తే కెనడాలో ద్రవ్యోల్బణం పెరుగుతుందని, దేశం తీవ్ర మాంద్యంలోకి వెళ్తుందని బ్యాంక్ ఆఫ్ కెనడా తెలిపింది.తీవ్ర అనిశ్చితి కారణంగా సెంట్రల్ బ్యాంక్ తన సాధారణ త్రైమాసిక ఆర్థిక అంచనాలను విడుదల చేయలేదు. దానికి బదులుగా భవిష్యత్తులో యూఎస్ ఆర్థిక వైఖరి కెనడాపై ఎలా ప్రభావం చూపుతుందో అంచనా వేసింది.బ్యాంక్ ఆఫ్ కెనడా తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి సందర్భంలో, చాలా సుంకాలు రద్దు చేస్తారు. కెనడాతోపాటు ప్రపంచ వృద్ధి తాత్కాలికంగా బలహీనపడుతుంది. కెనడా ద్రవ్యోల్బణం సంవత్సరానికి 1.5%కు పడిపోతుంది. తరువాత 2%కు చేరుతుంది. రెండో సందర్భంలో, సుంకాలు దీర్ఘకాలిక ప్రపంచ వాణిజ్య యుద్ధానికి దారితీస్తాయి. కెనడా భారీ మాంద్యంలోకి ప్రవేశిస్తుంది. ద్రవ్యోల్బణం 2026 మధ్యలో 3% కంటే ఎక్కువ పెరిగి 2% కు తిరిగి వస్తుంది. ఇంకా ఇతర పరిస్థితులు సాధ్యమేనని నొక్కిచెప్పిన బ్యాంక్ వార్షిక మొదటి త్రైమాసిక జీడీపీ 1.8%గా అంచనా వేసింది. ఇది జనవరి చివరిలో అంచనా వేసిన 2.0% కంటే తక్కువ.వాణిజ్య ఉద్రిక్తతలు, ద్రవ్య సర్దుబాట్ల పర్యవసానాలతో ఇన్వెస్టర్లు, విధాన నిర్ణేతలు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో రానున్న రోజుల్లో ఒడిదుడుకులు ఎదురవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ సంవత్సరం ద్వితీయార్ధంలో ఆర్థిక మాంద్యం ప్రమాదాలు పెరగవచ్చని చెబుతున్నారు. అందుకోసం ప్రభుత్వ వ్యూహాత్మక ఆర్థిక జోక్యాలు అవసరమని సూచిస్తున్నారు.




# ఉత్తరకొరియా మరో సంచలనం

## కిమ్ ప్లాన్‌తో ప్రపంచానికే హెచ్చరిక!

పాంగ్‌యాంగ్: ఉత్తరకొరియా తన శత్రు దేశాలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. నిత్యం క్షిపణి పరీక్షలతో కవ్వించే కిమ్.. ఇప్పుడు అత్యాధునిక యుద్ధనౌకను తయారుచేసే పనిలో స్పీడ్ పెంచారు.మాక్సర్ టెక్నాలజీస్, ప్లానెట్ ఉపగ్రహాలు తీసిన చిత్రాల ద్వారా ఈ విషయం బయటకు వచ్చింది. ప్రస్తుతం ఉత్తర కొరియా నౌకాదళంలో ఉన్న వార్‌షిప్‌ల కంటే ఇది దాదాపు రెండింతలు పెద్దదిగా ఉన్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.వివరాల ప్రకారం.. కిమ్ అధికారం చేపట్టాక సైనిక దళాలను అత్యంత వేగంగా ఆధునికీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉత్తర కొరియా నౌకాదళం ఓ అతిపెద్ద నౌకను తయారుచేసే పనిలో బిజీగా ఉంది. ప్రస్తుతం ఆ యుద్ధ నౌకపై ఆయుధ, అంతర్గత వ్యవస్థలను నిర్మిస్తున్నారు. దీని పనులు ఆ దేశ ఉత్తర తీరంలో జరుగుతున్నాయి. ఈ విషయాన్ని మాక్సర్ టెక్నాలజీస్, ప్లానెట్ ఉపగ్రహాలు పసిగట్టాయి. ప్రస్తుతం ఆ దేశ నౌకాదళంలో ఉన్న వార్‌షిప్‌ల కంటే ఇది దాదాపు రెండింతలు పెద్దదిగా ఉందని సమాచారం. దీని పొడవు సుమారు 140 మీటర్లుగా అంచనా వేశారు. దీని నిర్మాణానికి అవసరమైన టెక్నాలజీ మాస్కో నుంచి అంది ఉంటుందని దక్షిణ కొరియా నిపుణులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా.. అమెరికాకు చేరే స్థాయి ఖండాంతర క్షిపణులను ఇప్పటికే ఉత్తర కొరియా సమకూర్చుకొంది. ఈ ఆయుధాల తయారీకి అవసరమైన టెక్నాలజీ, పరికరాలను ఎవరూ ఉత్తరకొరియాకు విక్రయించకుండా ఐరాస ఆంక్షలు విధించింది. రష్యాతో మంచి సంబంధాలు ఉండటంతో ఆంక్షల ప్రభావం లేకుండా చూసుకొంది. మొత్తానికి ఈ భారీ నౌక నిర్మాణం ఉత్తర కొరియా సైనిక శక్తిని మెరుగుపరిచే మరో ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు. దీంతో, అమెరికా.. ఈ విషయంపై ఫోకస్ పెంచే అవకాశం ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
19 ఏప్రిల్ 2025

# సమాజ శాంతిని కమ్యూనిటీ పెద్దలు బాధ్యతగా తీసుకోవాలి



## హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్

**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 18 (జనం సాక్షి):**

సమాజంలో వ్యక్తులు, సమూహాల మధ్య వచ్చే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించి, శాంతియుతమైన సమాజాన్ని స్థాపించడానికి కమ్యూనిటీ పెద్దలు నడుం బిగించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించి ఆయా జిల్లాల న్యాయ సేవ సంస్థలు గుర్తించిన కమ్యూనిటీ మీడియేటర్ల మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలను చీఫ్ జస్టిస్ శుక్రవారం ఉదయం హనుమకొండలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ ప్రసంగిస్తూ ఏ వివాదమైనా, ఒక వ్యక్తి మధ్యనో లేదా వ్యక్తి సమూహాల మధ్యనో ఏర్పడుతుందని, అయితే ఆ వ్యక్తి గాని సమూహం గాని ఏదో ఒక కమ్యూనిటీకి చెందిన వారై ఉంటారన్నారు. అటువంటి పరిస్థితిల్లో అదే కమ్యూనిటీ కి చెందిన పెద్దవారు వారికి నచ్చచెప్పినట్లయితే వివాదాలు సహృద్భావ వాతావరణంలో పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని, ఈ బృహత్తర ఆలోచన నుంచి ఉద్భవించినదే కమ్యూనిటీ మీడియేషన్ విధానమన్నారు. మొదటిసారిగా భారతదేశంలో కేరళ రాష్ట్రంలో ఈ విధానం విజయవంతం అయిందని, సమాజంలోని కమ్యూనిటీ పెద్దలు కోర్టుల దాకా రాకుండా వేల సంఖ్యలో వివాదాలను పరిష్కరించారన్నారు. ఆ తరువాత ఈ విధానం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చేరి అక్కడ కూడా విజయవంతమైందన్నారు. అయితే 2023వ సంవత్సరంలో వచ్చిన మీడియేషన్ చట్టం ఈ విధానానికి చట్టబద్ధత కల్పించిందని ఆయన అన్నారు. ముఖ్యంగా గత కొన్ని దశాబ్దాలుగా భార్యాభర్తల మధ్య తగాదాలు మరియు తల్లిదండ్రులు, పిల్లల మధ్య తగాదాలు సమాజంలో పెరిగిపోతున్నాయని వీటికి చక్కటి పరిష్కారం కమ్యూనిటీ మీడియేషన్ అని జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, ఇంటిలో సర్ది చెప్పే పెద్దలు లేకపోవడం భార్యాభర్తల మధ్య ఈగో లు వారి మధ్య వివాదాలకు ఎక్కువగా కారణం అవుతున్నాయని వీటిని సమాజ కమ్యూనిటీ పెద్దలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయస్థానాలలోకేసులు ఉంటే, ఇరుపక్షాలలో ఒకరు గెలిస్తే మరొకరు పైకోర్టుకు వెళ్తారని కానీ కమ్యూనిటీ మీడియేషన్ విధానంలో వివాదం పరిష్కారమైతే వ్యక్తులే కాకుండా కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని ఇటువంటి గురుతర బాధ్యతను పెద్దలు తమ భుజస్కంధాల మీద వేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మధ్యప్రదేశ్లోని గ్వాలియర్ లో ఒక విశ్రాంత వైస్ ఛాన్సర్ కమ్యూనిటీ మీడియేటర్ గా సాధించిన విజయాలను వివరించారు. కలహిస్తున్న భార్య భర్తలకు ఒక తండ్రి లాగా తాత లాగ నచ్చచెప్పి వారిని కలిపినట్లు ఆయన చెప్పారన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్ పంచాక్షరి మాట్లాడుతూ నిజామాబాద్ కామారెడ్డి హైదరాబాద్ లో ఈ కమ్యూనిటీ మీడియేషన్ వాలంటీర్లు విజయవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. గత ఏప్రిల్ ఏడవ తారీకున కామారెడ్డి లో ఒకేసారి 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో వరంగల్ హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి. నిర్మలా గీతాంబ, సి.హెచ్. రమేష్ బాబు ఇతర జిల్లాల న్యాయమూర్తులు, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శులు ఎం.సాయి కుమార్, క్షమా దేశ్ పాండే తదితరులు పాల్గొన్నారు.

# వనజీవి రామయ్యకు హరిత నివాళి



## •రామయ్య జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలి
## : వన ప్రేమి డాక్టర్ పులుసం సాంబయ్య

**కొత్తగూడ ఏప్రిల్ 18 జనంసాక్షి:**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రం లో వన ప్రేమి జన ప్రేమి స్వచ్ఛంద సేవా సంఘం, అటవీ శాఖ,పర్యావరణ ప్రేమికుల ఆధ్వర్యంలో మండల కేంద్రం లో పద్మశ్రీ వన జీవి రామయ్య కు హరిత నివాళులు అర్పిస్తూ ర్యాలీ ప్రదర్శన నిర్వహించడం జరిగింది.అనంతరం అంగడి సెంటర్ లోని భారీ వృక్షానికి వన జీవి రామయ్య చిత్ర పటాన్ని ఏర్పాటు చేశారు.ప్రజలను ఉద్దేశించి వన ప్రేమి డాక్టర్ పులుసం సాంబయ్య మాట్లాడుతూ వనజీవి రామయ్య మన మధ్యలో లేకపోయినా ఆయన పర్యావరణానికి కోటికి పైగా వృక్షా లను నాటి భూమిమీద ఉన్న సమస్త జీవకోటికి ఆదర్శ ప్రాయుడు అయ్యాడు, భవిష్యత్ తరాలకు హరిత పితామహుడు అయ్యాడు భూమి మీద ఉన్న పశు పక్ష్యాధులకు తోబుట్టువు అయ్యాడు అందుకే ప్రతి ఒక్కరు పద్మశ్రీ వనజీవి రామయ్య జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకొని మొక్కలను విరివిగా పెంచి పర్యావరణ పరిరక్షణ కొరకు పాటుపడాలని అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణానికి రామయ్య చేసిన సేవను గుర్తించి ఏకో పార్కులకు పద్మ శ్రీ వన జీవి రామయ్య నామకరణం చేయాలని,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ట్యాంక్ బండ్ పై వన జీవి రామయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.అతని జీవిత చరిత్రను పాఠ్యంశాలలో చేర్చినట్లయితే విద్యార్థులు బాల్యం నుండే పర్యావరణం, మొక్కల పెంపకం పైన ఆసక్తి కనబరిచి పర్యావరణం కాపాడడంలో ఎంతో ఆసక్తి కనబరుస్తారని వన ప్రేమి డాక్టర్ పులుసం సాంబయ్య అన్నారు.ఈ కార్యక్రమం లో కొత్తగూడ మండల విద్యాశాఖధికారి గుమ్మడి లక్ష్మీనారాయణ, సాదిరెడ్డి పల్లి పాఠ శాల హెడ్ మాస్టర్ కల్తీ శ్రీనివాస్ పర్యావరణ ప్రేమికులు మంకిడి ఉపేందర్, గట్టి సమ్మయ్య, జోగా సంపత్, ఈసం సమ్మయ్య, పత్తిపాక వెంకన్న చారి,పూనెం సందీప్,ఏంపల్లి రమేష్,అటవీ శాఖ సిబ్బంది రాకేష్, అశోక్, రవి, రమేష్, భాగ్య, రజిని, లక్ష్మీ, వసుమతి, శిరీష పాల్గొన్నారు.

# 4 కోట్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన కేసీఆర్

## •25 వసంతాల గులాబీ జాతర విజయవంతం చేయండి
## •రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్

**గోదావరిఖని, జనం సాక్షి**



: 4 కోట్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి,సగర్వంగా నిలిపింది గులాబీ జెండా అని 25 వసంతాల గులాబీ జాతరను విజయవంతం చేయాలని రామగుండం మాజీ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు.

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా లక్ష్మీనగర్ పట్టణ కమిటి సమావేశాన్ని స్దానిక మార్కండేయ కాలని లక్ష్మి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించి, ప్రజలను కదిలించి ఉద్యమం చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలను నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారని, కానీ వచ్చిన అవకాశాన్ని ఆ పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోక ఆగమాగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని, అధికారం కోల్పో యినా ప్రజల వెంటనే ఉంటోందని, తమకు ఓట్లు వేయలేదని ప్రజ లను ఏనాడు పట్టించుకోకుండా ఉండలేదన్నారు. కేసీ ఆర్, బీఆర్ఎస్ ఒక్కటే ఈ రాష్ట్ర ప్రజలకు రక్షణగా ఉంటుందని స్పష్టం చేశారు. భారత రాష్ట్ర సమితి 25 వ సంవత్సరంలో అడుగెడుతున్న సందర్భంగా రజతోత్సవ వేడుకల్లో భారీ బహిరంగ సభకి రామగుండం నియోజకవర్గం లో ఉన్నటువంటి బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరు కూడా వేలాదిగా తరలిరావాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ

లక్ష్మి నగర్ అధ్యక్షుడు నూతి తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మం లో నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, చల్లా రవీందర్ రెడ్డి , ఆడప శ్రీనివాస్, శ్రీ రామోజీ మహేష్ ,నారాయణదాసు మారుతి, రాచకొండ శ్రీనివాస్, గాలి లింగన్న ,కాగితం శ్రీనివాస్, గుర్రం పద్మ, మంజుల భాను, ఐల్ల నాగరాజు, బొడ్డు స్వామి ,నాగరాజు, సంజీవ్, సురేష్ కాగితం, గూటం కొమురయ్య, పాల్గొన్నారు.

# దేశంలోనే రోల్ మోడల్గా భూ భారతి చట్టం

## మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్

**మహబూబాబాద్ బ్యూరో, ఏప్రిల్ 18( జనం సాక్షి):**



తెలంగాణ రాష్ట్రంలో భూ భారతి చట్టం క్రింద శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం పైలట్ ప్రాజెక్టు ఎంపిక కాగా వెంకటాపురం మండల పరిధిలోని రైతులకు భూ భారతి చట్టం పై నిర్వహించే రెవెన్యూ అవగాహన సదస్సు కార్యక్రమంలో రెవిన్యూ గృహ నిర్మాణాల ఐ,పి ఆర్ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి , అటవి పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి శ్రీమతి కొండా సురేఖ, స్థానిక శాసనసభ్యురాలు రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)తో కలిసి పాల్గొన్న మహబూబబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్.తొలుత ములుగు గట్టమ్మ తల్లి దగ్గర నుంచి వెంకటాపురం గ్రామం వరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ లో మంత్రులతో కలిసి ఎంపీ బలరాంనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. భూభారతి చట్టం పై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలనీ, భూ భారతి చట్టం వల్ల కలిగే ప్రయోజనాలను సరళమైన భాషలో ప్రజలకు వివరించాలనీ, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిలో చాలా పొరపాట్లు జరిగాయన్నారు. ధరణిని అడ్డంపెట్టుకొని గత పాలకులు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారన్నారు. ధరణి ద్వారా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. తెలంగాణను భూ సమస్యలు లేని రాష్ట్రంగా మార్చాలన్న లక్ష్యంతోనే భూ భారతి-2025 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చినట్లు తెలిపారు. భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రభుత్వానికి మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రజల తరఫున ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుతూ సంపూర్ణమైన సమస్యల పరిష్కారానికి సవరణలు సూచనలు అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# ధాన్యం చివరి గింజ వరకు కొంటాం

**శంకరపట్నం ఏప్రిల్ 18 (జనంసాక్షి):**



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ పేరిట కోతలు విధించకుండా కొనుగోళ్లు చేపడతామని మానకొండూర్ శాసనభ్యుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం శంకరపట్నం మండలంలోని తాడికల్, వంకాయగూడెం, కేశవపట్నం, కొత్తగట్టు, లింగాపూర్, మెట్టుపల్లి, మొలంగూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇక నుంచి తాలు, తేమ, తరుగు పేరిట ఎలాంటి కోతలు ఉండవని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని సూచించారు. దళారుల బారినపడకుండా ఉండేందుకు వరి, పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. రైతాంగానికి అండగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, అందుకే ఆ దిశగా ప్రభుత్వం పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రైతుల బాగు కోసం పాటుపడుతున్నదని పెర్కొన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధి రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ 500 బోనస్ ఇస్తున్నదన్నారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బత్తుల భాస్కర్, టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్, హుజురాబాద్ ఏఎంసి వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కొత్తగట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య, తాడికల్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బండారు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ




## విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ సమరశీల పోరాటాలు
## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఎస్ఎఫ్ఐ అని, నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, అందరికీ విద్య ఉపాధి అవకాశాల కోసం శాస్త్రీయ విద్య లక్ష్యంగా పనిచేస్తూ మహోన్నత ఆశయాలతో ఎస్ఎఫ్ఐ ముందుకు కొనసాగుతుందని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని యుటిఎఫ్ భవన్ లో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా నాలుగో మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.దేశ విద్యారంగాన్ని ప్రైవేట్, కార్పొరేట్ పరం చేయడానికి ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని అన్నారు.చదువుకునే రోజుల నుండి చదువును కొనే దుస్థితి ఏర్పడిందన్నారు.విద్యారంగానికి బడ్జెట్ కేటాయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు.యూనివర్సిటీలలో అన్ని పోస్టులను భర్తీ చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ లను పెండింగ్ లో ఉంచిందని, తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు విద్యార్థులు సిద్ధం కావాలన్నారు.ఈ నెల 25, 26, 27వ తేదీలలో ఖమ్మంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం

చేయాలని పిలుపునిచ్చారు.ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు, రైతు సంఘం నాయకులు మల్లు నాగార్జున్ రెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి,టీపీటీఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్ జె.నరసింహారావు సందేశాలు ఇచ్చారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ధనియాకుల శ్రీకాంత్ వర్మ, అక్కినపల్లి వినయ్, జిల్లా కార్యదర్శులుగా లోయ, తన్వేష్, దీపక్, పులుసు శ్రవణ్, జిల్లా కమిటీ సభ్యులుగా శృతి, జశ్వంత్, గణేష్, రవితేజ, జశ్వంత్, గోపి, చంద్ర శేఖర్, శివను ఎన్నుకున్నారు.


# సన్నధాన్యంతో మిల్లర్లు నష్టపోతారు

**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 18(జనంసాక్షి).**



2024- 25 రబీ సీజన్లో వచ్చేటువంటి సన్నధాన్యం ప్రభుత్వం 500 రూపాయలు బోనస్ ఇచ్చి కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్న గొప్ప ప్రభుత్వం కానీ ఈ సీజన్లో వచ్చేటువంటి సన్నధాన్యం దొడ్డు ధాన్యం ఏదైనా కూడా బాయిల్డ్ బియ్యం మాత్రమే అవుతాయి. ఏదేని ధాన్యం కొంత రా రైస్ అయినా అవి తినడానికి అన్నం సరిగా కాదు ప్రభుత్వ ఉద్దేశం పేద ప్రజలకు సన్న బియ్యం ఇవ్వాలనే సంకల్పం గొప్పది అయినప్పటికీ అవి అన్నం కాక ప్రభుత్వం, మిల్లర్లు బదనాం అయితారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించగా క్యాబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, గౌరవాధ్యక్షులు పల్లెపాటి సమ్మిరెడ్డి, రైస్ మిల్లర్లు అనిల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ హరినాథ్ పాల్గొన్నారు.

# అనిశాకు చిక్కిన సీసీసీ నస్పూర్ ఎస్సై
## బాధితుడి ఫిర్యాదు మేరకే తనిఖీలు



**నస్పూర్, ఏప్రిల్ 18, (జనంసాక్షి):** సీసీసీ నస్పూర్ ఎస్సై సుగుణాకర్ శుక్రవారం అనిషా వలకు చిక్కాడు. ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 25న నమోదు చేసిన ఓ కేసు విషయంలో 2 లక్షల రూపాయలు సీజ్ చేయడం జరిగిందని, అనంతరం బాధితుడు ప్రభంజన్ ఏప్రిల్ 4వ తేదీన కోర్టు నుంచి ఆర్డర్ తీసుకొని వచ్చి ఎస్సై సుగుణాకర్ ను డబ్బులు తిరిగి ఇవ్వాల్సిందిగా కోరగా, తిరిగి డబ్బులు చెల్లించకుండా బాధితుడిని స్టేషన్ చుట్టూ తిప్పుతుండటంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్లు తెలిపారు. ఏప్రిల్ 10న డబ్బులు చెల్లిస్తానని ఎస్ఐ స్టేషన్కు పిలిపించి 50,000 మాత్రమే ఉన్నాయని తీసుకొని వెళ్లాల్సిందిగా బాధితుడిని ఒత్తిడి చేసేటప్పుడు ఎస్సై మాట్లాడిన మాటలను రికార్డు చేసుకొని ఏసీబీకి అందజేశారన్నారు. బాధితుడికి డబ్బులు చెల్లించకుండా, సొంతానికి వినియోగించుకున్నందుకు సిసిసి ఎస్ఐ సుగుణాకర్ పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు స్వామి,కిరణ్ పాల్గొన్నారు.

# తార్నాక టీజీఎస్ఆర్టీసీ ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్ సేవలు



**హైదరాబాద్ బ్యూరో (జనంసాక్షి) :**

తార్నాకలోని టీజీఎస్ఆర్టీసీ ఆసుపత్రిలో గుండె జబ్బులకు సంబంధించిన క్యాథ్ ల్యాబ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. క్యాథ్ ల్యాబ్ తో పాటు 12 బెడ్లకు విస్తరించిన ఎమర్జెన్సీ కేర్ యూనిట్ను శుక్రవారం టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ప్రారంభించారు. ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ సహకారంతో తార్నాక ఆసుపత్రిలో క్యాథ్ ల్యాబ్ ను సంస్థ ఏర్పాటు చేయగా.. క్రిటికల్ కార్డియక్ కేర్ యూనిట్ కు అశోక్ లేలాండ్ సంస్థ సహకరించింది. అలాగే, ఎమర్జెన్సీ కేర్ యూనిట్ విస్తరణకు నిర్మాణ్ డాట్ ఓఆర్జీ అనే సంస్థ ద్వారా ఐఓసీఎల్ ఆర్థిక సాయం చేసింది. ప్రారంభోత్సవంలో వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. టీజీఎస్ఆర్టీసీకి ప్రధాన వనరులైన ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ ఆరోగ్యంగా ఉంటుందని యాజమాన్యం భావించి.. తార్నాక ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్గా తీరిదిద్దామని చెప్పారు. దేశంలో ఏ ఆర్టీసీలో లేనివిధంగా ఉద్యోగులకు ఇక్కడ కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా మెరుగైన వైద్య సేవలను ఉద్యోగులకు అందిస్తున్నట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలోనే తార్నాక ఆస్పత్రిలో 2021లో ప్రతి రోజు సగటున 600 అవుట్ పేషంట్లు రాగా.. ప్రస్తుతం దాదాపు అది 2 వేలకు పెరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వెంకన్న, తార్నాక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రీనివాస్ తో పాటు ఐఓసీఎల్ నుంచి సురజ్ కుమార్, భాస్కర్ రావు, కైలాస్ కాంత్, నిర్మాన్ ఆర్గనైజేషన్ నుంచి శాంతి కుమార్, అనురాధ, ఫ్యాక్ట్స్ ఫౌండేషన్ ఎండీ డాక్టర్ శ్రీనివాస్ కుమార్, అశోక్ లేలాండ్ ప్రతినిధులు నీరేష్ తివారి, సూర్యనారాయణ, రమేశ్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.




## జా మోరంట్ గాయం

### ఫీనిక్స్ సన్స్ యజమాని విమర్శలు

ఎన్‌బీఏలో మెంఫిస్ గ్రిజ్లీస్ ఆటగాడు జా మోరంట్ చీలమండ గాయం కారణంగా డల్లాస్ మావెరిక్స్‌తో ఈ రోజు జరిగే మ్యాచ్‌కు అనుమానంగా ఉన్నాడు. మోరంట్ ఈ సీజన్‌లో గ్రిజ్లీస్‌కు కీలక ఆటగాడిగా ఉన్నాడు, కానీ గాయాలు జట్టు పనితీరును దెబ్బతీస్తున్నాయి. మరోవైపు, ఫీనిక్స్ సన్స్ యజమాని మాట్ ఇష్బియా 2024-25 సీజన్‌ను "వైఫల్యం"గా అభివర్ణించాడు. సన్స్ ఈ సీజన్‌లో అనుకున్న స్థాయిలో రాణించలేకపోయింది, ప్లేఆఫ్స్ అవకాశాలు సందిగ్ధంగా మారాయి. ఎన్‌బీఏ ప్లేఆఫ్స్ నేడు (ఏప్రిల్ 19) ప్రారంభంకానున్నాయి, లుకా డాన్సిక్ ట్రేడ్, రికార్డ్ టీమ్ సేల్ వంటి సంఘటనలు ఈ సీజన్‌ను ఉత్తేజకరంగా మార్చాయి.




# హిట్‌మ్యాన్‌కు కోపమొచ్చింది




### అందరూ ఇంకాస్త ఎక్కువగా శ్రమించాలన్నాను
### వాళ్లు మాత్రం మైదానంలో సరదాగా తిరుగుతున్నారు
### అందరికీ ఆ రోజు ఉదయాన్నే గట్టిగా చెప్పాను

*టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మైదానంలో వ్యూహాలు రచించడం, సరదా చర్యలతో ఉండటమే కాదు.. సహచర ఆటగాళ్లతో అప్పుడప్పుడు కోపంగా కూడా ప్రవర్తిస్తాడన్న సంగతి తెలిసిందే. అందరిముందే వారిని గట్టిగా తిడుతూ కూడా కనిపిస్తుంటాడు. అలా 2024లో ఇంగ్లాండ్ తో టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో అతడు.. టీమ్ మేట్స్‌ను ఫ్రస్టేషన్‌తో అన్న మాటలు స్టంప్ మైకులో రికార్డై తెగ వైరల్ అయ్యాయి. తాజాగా ఆ సందర్భాన్ని గుర్తు చేసుకున్న హిట్ మ్యాన్.. అలా ఎందుకు అన్నాడో వివరించాడు.'*

*ఇక రీసెంట్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై జరిగిన మ్యాచ్‌లో కూడా రోహిత్ భారీ స్కోర్ చేయలేకపోయాడు. 16 బంతుల్లో 26 పరుగులు మాత్రమే చేశాడు. కానీ ఉన్నది కాసేపే అయినా తనదైన స్టైల్ లో దూకుడుగా అదిరిపోయే షాట్లు ఆడాడు. అందులో 3 సిక్సర్లు కూడా ఉన్నాయి.*

'మీరేమైనా గార్డెన్‌లో వాకింగ్ కు వచ్చారా..'' అంటూ సహచర ఆటగాళ్లను తీవ్ర స్వరంతో మందలించాడు రోహిత్ శర్మ. దాని గురించి మాట్లాడుతూ.. ''ఆరోజు వైజాగ్‌లో మ్యాచ్. అప్పుడు ఓవర్ ముగిసిన సమయంలో మా ఆటగాళ్లు.. ఏదో గార్డెన్ లో వాకింగ్‌కు వచ్చినట్లుగా ప్రశాంతంగా అటు ఇటు తిరుగుతున్నారు. ఒక్కరు కూడా పరిగెత్తడం లేదు. మైదానంలో చురుగ్గా అస్సలు కనిపించలేదు. నేను స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్నాను. మ్యాచ్ ఎక్కడ చేజారిపోతుందేమోనని అనిపించింది. అది మాకు ఎంతో ముఖ్యమైన గేమ్. మేం గెలిచి తీరాల్సిన మ్యాచ్ అది. అందుకే ఈరోజు అందరూ ఇంకాస్త ఎక్కువగా శ్రమించాలి అని అందరికీ ఆ రోజు ఉదయాన్నే గట్టిగా చెప్పాను. కానీ వాళ్లు మాత్రం మైదానంలో సరదాగా తిరుగుతున్నారు. దీంతో రెండు మూడు ఓవర్లు చూశా. క్రికెట్ ఇలా ఆడకూడదు. అందుకే నాకు కోపం వచ్చింది. ప్రత్యర్థి జట్టు భాగస్వామ్యాలను విడదీయాలని చెప్పాను. అలాంటి పరిస్థితుల్లో అందరూ కలిసి శ్రమిస్తేనే ఫలితం వస్తుంది. కానీ అప్పుడు మా వాళ్లంతా ఎవరి పనిలో వాళ్లు బిజీగా ఉన్నట్లు కనిపించింది. అందుకే అలా అన్నాను'' అని రోహిత్ శర్మ అప్పుడు జరిగిన సంఘటనను వివరించాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ.. ఐపీఎల్ 2025లో సరైన ప్రదర్శన చేయట్లేదు. ఈ సీజన్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ గా బరిలోకి దిగుతున్నాడు. ఇప్పటివరకు 6 మ్యాచ్‌లలో 13.67 సగటుతో కేవలం 82 పరుగులు మాత్రమే చేశాడు.

## ఐపీఎల్ మధ్యలోనే పాట్ కమిన్స్ ఇంటిదారి?




2025 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శన ఇంకా కొనసాగుతూనే ఉంది. రీసెంట్‌గా పంజాబ్‌పై విజయంతో ట్రాక్ ఎక్కిందనుకునే లోపే తాజాగా ముంబయితో మ్యాచ్‌లో డీలా పడింది. దీంతో 7 మ్యాచ్‌ల్లో కేవలం రెండు విజయాలతో పట్టికలో తొమ్మిదో స్థానంలో కొనసాగుతోంది. ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే ఇకపై మ్యాచ్‌లన్నీ నెగ్గాల్సిందే. ఇలాంటి పరిస్థితిలో హైదరాబాద్ అభిమానులకు షాకింగ్ న్యూస్. జట్టు కెప్టెన్ పాట్ కమిన్స్ ఐపీఎల్ మధ్యలోనే భారత్ వీడిచి ఆస్ట్రేలియాకు వెళ్లిపోనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కమిన్స్ భార్య సోషల్ మీడియాలోషేర్ చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. కమిన్స్ సతీమణి బెక్కీ కమిన్స్ ప్రస్తుతం భారత్‌లో ఉంటూ సన్‌రైజర్స్ టీమ్‌ను ప్రోత్సహిస్తోంది. తాజాగా ఆమె ఇండియాను వీడిచి వెళ్లిపోతున్నట్లు శుక్రవారం ఓ పోస్ట్ షేర్ చేసింది. 'గుడ్ బై ఇండియా. ఈ అందమైన దేశానికి రావడాన్ని ఎప్పుడూ ఇష్టపడతాం' అని పోస్ట్‌కు క్యాప్షన్ రాసుకొచ్చింది. అయితే ఎయిర్‌పోర్ట్‌లో దిగిన ఈ ఫొటోలో కమిన్స్ కూడా ఉన్నాడు. అంతేకాకుండా లగేజ్ కౌంటర్ వద్ద నిల్చొని ఉన్న కమిన్స్ ఫొటోను కూడా మరో పోస్ట్‌లో షేర్ చేసింది. 'కమిన్స్ లగేజ్ ఎల్లప్పుడూ ఎక్కువగానే ఉంటుంది' అని క్యాప్షన్ జోడించింది. దీంతో భార్యతోపాటు కమిన్స్ కూడా ఐపీఎల్ మధ్యలోనే ఇండియా విడిచి వెళ్లిపోతున్నాడంటూ ప్రచారం మొదలైంది. ఈ నేపథ్యంలోనే సన్‌రైజర్స్ అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. జట్టును ఇలాంటి పరిస్థితుల్లో వదిలి వెళ్లకూడదంటూ కామెంట్ చేస్తున్నారు. అయితే కమిన్స్ భారత్ విడిచి ఎక్కడకు వెళ్లడం లేదని తెలుస్తోంది. అతడు తన భార్యకు సెండాఫ్ ఇవ్వడం కోసమే ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లినట్లు సమాచారం. మరోవైపు కమిన్స్ జట్టును వీడడంపై కూడా సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ఎటువంటి అప్డేట్ ఇవ్వలేదు. అందుకే కమిన్స్ మిగిలిన సీజన్‌లో జట్టుతోనే ఉండే ఛాన్స్ ఉంది. కాగా, గురువారం ముంబయితో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 40 పరుగులు టాప్ స్కోరర్. అనంతరం ఈ లక్ష్యాన్ని ముంబయి 18.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విల్ జాక్స్ (36), రికెల్టన్ (31), రోహిత్ (26), సూర్య (26), పాండ్య (21), తిలక్ (21) ఫర్వాలేదనిపించారు.



## భారత సీనియర్ మహిళల జట్టులోకి పూజా యాదవ్

వారణాసికి చెందిన 21 ఏళ్ల యువ హాకీ క్రీడాకారిణి పూజా యాదవ్, పూర్వాంచల్ ప్రాంతం నుంచి మొదటి మహిళగా భారత సీనియర్ మహిళల హాకీ జట్టులో స్థానం సంపాదించింది. ఏప్రిల్ 26 నుంచి మే 4 వరకు ఆస్ట్రేలియా పర్యటనలో 26 మంది జట్టులో ఆమె ఆడనుంది. పూజా, తన కఠిన శిక్షణ, అంకితభావంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. ఆమె జూనియర్ స్థాయిలో అనేక విజయాలు సాధించి, ఇప్పుడు సీనియర్ జట్టులో అవకాశం పొందడం యువ ఆటగాళ్లకు స్ఫూర్తినిస్తోంది. ఈ పర్యటనలో భారత జట్టు ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది, ఇది 2026 హాకీ వరల్డ్ కప్‌కు సన్నాహకంగా ఉంటుంది. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ తిర్కీ, పూజా వంటి యువ ప్రతిభలు భారత హాకీ భవిష్యత్తును ప్రకాశవంతం చేస్తాయని పేర్కొన్నారు.




## యూరోపా లీగ్ సెమీ-ఫైనల్స్‌కు టాటెన్‌హామ్, చెల్సియా

యూరోపా లీగ్‌లో ఈ రోజు టాటెన్‌హామ్ హాట్‌స్పర్ మరియు చెల్సియా జట్లు సెమీ-ఫైనల్స్‌కు చేరుకున్నాయి. చెల్సియా, లెగియా వార్సావాపై 4-2 అగ్రిగేట్ స్కోర్‌తో విజయం సాధించింది. అయితే, చెల్సియా డిఫెండర్ రీస్ జేమ్స్ ఈ టోర్నమెంట్‌ను "గౌరవించలేదు" అని విమర్శించడం వివాదాస్పదమైంది. మరోవైపు, బోడో/గ్లిమ్ట్ గోల్‌కీపర్ నికితా హైకిన్ లాజియోపై పెనాల్టీ షూటౌట్‌లో అద్భుత ప్రదర్శనతో హీరోగా నిలిచాడు. మాంచెస్టర్ యునైటెడ్ కూడా హ్యారీ మాగ్వైర్ 121వ నిమిషంలో స్కోర్ చేసిన గోల్‌తో సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్ యూరోపా లీగ్ ఉత్కంఠభరిత మ్యాచ్‌లతో ఫుట్‌బాల్ అభిమానులను ఆకర్షిస్తోంది.




## ఎల్‌ఏ 2028 కోసం మహిళల ఫుట్‌బాల్ జట్ల సంఖ్య పెంపు

2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ కోసం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) మహిళల ఫుట్‌బాల్ జట్ల సంఖ్యను 12 నుంచి 16కి, పురుషుల జట్లను 16 నుంచి 12కి సవరించింది. ఈ నిర్ణయం మహిళల క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ, ఒలింపిక్స్‌లో లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే దిశగా ఒక అడుగుగా భావించబడుతోంది. అదనంగా, గోల్ఫ్‌లో మిక్స్‌డ్-టీమ్ ఈవెంట్‌ను పరిచయం చేస్తున్నారు, ఇది పురుషులు, మహిళలు కలిసి ఆడే తొలి ఒలింపిక్ గోల్ఫ్ ఫార్మాట్. యూఎస్ ఒలింపిక్ అండ్ పారాలింపిక్ కమిటీ (యూఎస్‌ఓపీసీ) ప్రకారం, వైట్ హౌస్ ఎల్‌ఏ 2028 కోసం వీసా సౌకర్యాలపై హామీ ఇచ్చింది. ఈ మార్పులు ఒలింపిక్స్‌ను మరింత ఆకర్షణీయంగా, సమగ్రంగా మార్చేందుకు దోహదపడతాయి.




## షెల్లీ-అన్ ఫ్రేజర్-ప్రైస్ స్కూల్ స్పోర్ట్స్ డేలో విజయం

జమైకా స్ప్రింట్ లెజెండ్, ఒలింపిక్ ఛాంపియన్ షెల్లీ-అన్ ఫ్రేజర్-ప్రైస్ తన కొడుకు జియాన్ స్కూల్ స్పోర్ట్స్ డేలో తల్లుల 100 మీటర్ల పరుగు రేసులో విజయం సాధించింది. 38 ఏళ్ల ఫ్రేజర్-ప్రైస్, మూడు ఒలింపిక్ గోల్డ్ మెడల్స్, 10 వరల్డ్ ఛాంపియన్‌షిప్ మెడల్స్‌తో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఈ రేసులో ఆమె తన వేగంతో స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులను ఆశ్చర్యపరిచింది. ఈ సంఘటన ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియో తో వైరల్ అయింది. ఫ్రేజర్-ప్రైస్, అథ్లెటిక్స్‌లో తన కెరీర్‌ను కొనసాగి స్తూనే, తల్లిగా తన బాధ్యతలను ఆనందంగా నిర్వహిస్తోంది. ఆమె ఈ విజయాన్ని "తల్లుల ఒదరికీ" అంకితం చేసింది, యువ అథ్లెట్లకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

*చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు అదిరే న్యూస్. గాయం కారణంగా టోర్నీకి దూరమైన పేసర్ గుర్జప్‌నీత్ సింగ్‌కు రిప్లేస్‌మెంట్ ప్రకటించింది.*

## మాస్టర్స్ 2025లో ఎల్‌ఐవీ గోల్ఫ్ ఆటగాళ్ల సంఖ్య తగ్గింపు

మాస్టర్స్ 2025 టోర్నమెంట్‌లో ఎల్‌ఐవీ గోల్ఫ్ ఆటగాళ్ల సంఖ్య 12కి తగ్గింది, ఇది 2023లో 18, 2024లో 13తో పోలిస్తే గణనీయమైన తగ్గుదల. మాస్టర్స్ చైర్మన్ ఫ్రెడ్ రిడ్లీ, ఎల్‌ఐవీ ఆటగాళ్ల కోసం ప్రత్యేక మినహాయింపు ఇవ్వడానికి ఎటువంటి ప్రణాళికలు లేవని స్పష్టం చేశారు. ఎల్‌ఐవీ గోల్ఫ్, సౌదీ అరేబియా మద్దతుతో నడిచే వివాదాస్పద లీగ్, గత కొన్ని సంవత్సరాలుగా సాంప్రదాయ పీజీఏ టూర్‌తో ఘర్షణలో ఉంది. ఈ తగ్గింపు ఎల్‌ఐవీ ఆటగాళ్ల ర్యాంకింగ్‌లు, అర్హత ప్రమాణాలపై ప్రభావం చూపుతోంది. అయినప్పటికీ, జోన్ రామ్, బ్రూక్స్ కోప్కా వంటి ఎల్‌ఐవీ ఆటగాళ్లు మాస్టర్స్‌లో ఆకట్టుకునే అవకాశం ఉంది. ఈ నిర్ణయం గోల్ఫ్ సమాజంలో చర్చనీయాంశంగా మారింది.

## అలెక్స్ ఓవెచ్కిన్ రికార్డ్ స్కోర్.. క్యాపిటల్స్ లక్ష్యం




వాషింగ్టన్ క్యాపిటల్స్ ఆటగాడు అలెక్స్ ఓవెచ్కిన్, ఏప్రిల్ 6, 2025న న్యూయార్క్ ఐలాండర్స్‌పై 895వ గోల్ స్కోర్ చేసి, వేన్ గ్రెట్జ్కీ ఎన్‌హెచ్‌ఎల్ ఆల్-టైమ్ గోల్ స్కోరింగ్ రికార్డ్‌ను బద్దలు కొట్టాడు. ఈ సాఫల్యాన్ని పురస్కరించుకుని వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 11న 'అలెక్స్ ఓవెచ్కిన్ దే'గా ప్రకటించింది. ఓవెచ్కిన్ ఈ రికార్డ్‌తో 'గ్రేట్ 8 చేజ్' పూర్తి చేసినప్పటికీ, క్యాపిటల్స్ జట్టు ఇప్పుడు స్టాన్లీ కప్ లక్ష్యంగా పోరాడుతోంది. 2024-25 సీజన్‌లో ఓవెచ్కిన్ నాయకత్వంలో క్యాపిటల్స్ ఈస్టర్న్ కాన్ఫరెన్స్‌లో బలమైన స్థానంలో ఉంది. ఈ సీజన్ ప్లేఆఫ్స్‌లో జట్టు విజయం కోసం ఓవెచ్కిన్ తన అనుభవాన్ని, నైపుణ్యాన్ని మీడియాతో పంచుకున్నాడు.

# 64 చెరువులను అభివృద్ధి చేస్తాం : పీఏసీ చైర్మన్ అరికపూడి





**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి డివిజన్ మసీదు బండ పరిధిలోగల కుడికుంట చెరువుతో పాటు నియోజకవర్గం పరిధిలోని మొత్తం 64 చెరువులను అన్ని రంగాలలో ఘనంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన కుడికుంట చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని 64 చెరువులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువుల సుందరికరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసి పడతామని ధీమాను వ్యక్తం చేశారు. చెరువుల జలకళ తో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే తన ధ్యేయంగా ముందుకు సాగుతానని, చెరువులను సంరక్షిస్తే భూగర్భ జలాల ద్వారా అవి తిరిగి మానవాళిని కాపాడుతాయని ఆయన జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రేగులకుంట చెరువు పరిశీలన...**

చందానగర్ డివిజన్ దీప్తి శ్రీ నగర్ కాలనీ పరిధి రేగుల కుంట చెరువును మరియు డంపింగ్ యార్డ్ ను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తోకలిసి రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేగుల కుంట చెరువుకు ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్య నేటి తో తీరనుందని, శాశ్వత పరిష్కారం దిశగా చెరువును అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర ప్రజాపతుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ తెలిపారు. చందానగర్ డివిజన్ పరిధిలో మురికి కూపంలా మారిన రేగులకుంట చెరువు స్వచ్ఛమైన మంచి నీరును అందించేలా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. ఈ క్రమంలో చెరువులో మురుగు నీరు కలవకుండా 60 లక్షల రూపాయలతో చెరువు చుట్టూ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మురుగు నీటి మళ్లింపు పనులు కొనసాగుతున్నాయన్నారు. యుజిడి పైప్ లైన్ నిర్మాణం పనులద్వారా చెరువులో కలుషిత నీరు కలవకుండా ఉంటుందని, స్వచ్ఛమైన వర్షం నీరుతో చెరువు నిండు ఉండే అవకాశం ఉందన్నారు. చుట్టపక్కల ప్రజలకు, వాకింగ్ వచ్చే ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం లభించనుందని అరికెపూడి గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన క్రమంలో అక్కడ జరుగుతున్న చెత్త సేకరణ, నిర్వహణ తీరు తెన్నులను గాంధీ పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను సిఅండ్‌డికి అప్పగించాలని భవన నిర్మాణ వ్యర్థాలను రోడుపై వేసి ప్రజలను అసౌకర్యానికి, ఇబ్బందికి గురి చేయవద్దని ఆయన ప్రజలను కోరారు. భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్డుపై పడి ఉండి ప్రజలకు ఇబ్బంది కలిగించిన నేపథ్యంలో అట్టి వ్యర్థాలను తొలగించుటకు టోల్ ఫ్రీ నంబర్ 1800-120-1159 కి ఒక కాల్ చేస్తే వారు ఘటన స్థలానికి వచ్చి భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించడం జరుగుతుందన్నారు. ఇంటికి వచ్చి భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తీసుకొని పోతారు అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్ ముదిరాజ్ మరియు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# నష్టపోయిన కౌలు రైతు

### ఈదురుగాలి వర్షానికి నేలకొరిగిన బొప్పాయి అరటి తోటలు

**మర్పల్లి ఏప్రిల్ 17(జనం సాక్షి) :** శుక్రవారం ఎదురుగాలివర్షానికి బొప్పాయి, అరటి తోటలు భారీగా దెబ్బతిన్నాయి. మర్పల్లి మండల పరిధిలోని కొత్లాపూర్, సిరిపురం, వీర్లపల్లి గ్రామాల్లో ఈదురు గాలి వర్షానికి రైతులు భారీగా నష్టపోయారు. కొత్లాపూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు వెంకటేశంకు చెందిన 2 ఎకరాల అరటి, 2 ఎకరాల బొప్పాయి తోటలు కురిసిన ఈదురు గాలులు వర్షానికి పూర్తిగా నీలకోరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. ఓ రైతుకు చెందిన 7 ఎకరాల పొలాన్ని 1 లక్ష 40 వేలు రూపాయలకు కౌలు చెల్లించి పంటలను సాగు చేసుకుంటున్నాడు. ఈ సంవత్సరం రెండు లక్షల పెట్టుబడి పెట్టి రెండు ఎకరాల్లో బొప్పాయి, 3 లక్షల పెట్టుబడితో రెండు ఎకరాల అరటి తోట పంటలను సాగు చేశాడు. చేతికొచ్చిన బొప్పాయి, మరో నెల రోజుల్లో చేతికి రానున్న అరటి తోటలు కురిసిన వర్షానికి గాలులకు పూర్తిగా నేలకోరిగాయని వెంకటేశం కన్నీరు మున్నీరయ్యారు. వ్యవసాయం చేసే కన్నా ప్రతిరోజు కూలి పని చేసుకోవడం మంచిదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏట రైతు ఏదో రకంగా నష్టాలు చవిచూస్తూనే ఉన్నాడని ప్రభుత్వాలు రైతు పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబించడంతోనే వ్యవసాయం లాభసాటి కావడంలేదని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వెంకటేశం కోరుతున్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే





- **ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని అమ్మి మద్దతు ధరను పొందాలి**
- **కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
- **మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ్మ**

**తలకొండపల్లి, ఆమనగల్ ఏప్రిల్ 18 (జనంసాక్షి):** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.ఆమనగల్ మార్కెట్ యార్డ్,తలకొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం,చుక్కాపూర్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ,తలకొండపల్లి పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి,లతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఆరుగాలం రైతులు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చి మద్దత్తు ధర రూ,2320,తో పాటు క్వింటల్ వడ్లకు బోనస్ గా రూ,500,లు పొందాలని అన్నారు.రైతులు వరి ధాన్యాన్ని 17 శాతం తేమతో కొనుగోలు కేంద్రాలకు తీసుక రావాలని,దళారీలకు విక్రయించి మోసాలకు గురికావద్దని ఆయన తెలిపారు.రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులకు గన్ని సంచుల కొరత,ఇతరత్రా సమస్యలు ఉంటే నేరుగా తనకు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

ఈ కొనుగోలు కేంద్రాలను రైతుల ప్రయోనం కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,ఏఎంసి డైరెక్టర్లు అంజయ్య గుప్తా,వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి,అజీమ్,శ్రీశైలం, రవీందర్ యాదవ్, రమేష్, తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,ఆమనగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్,నాయకులు గుర్రం కేశవులు,డేవిడ్,డిగ్రీ కృష్ణ,ఆరిఫ్ చెన్నకేశవులు, శ్రీకాంత్, రంగారెడ్డి, యాదయ్య, రైతులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు,మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

# టి-సాట్‌లో జి-మ్యాట్ స్పెషల్ క్లాసులు

- **జి-మ్యాట్ 2025 కోసం టి-సాట్‌లో వరల్డ్ ఎర్త్ డే ప్రత్యేక లైవ్ కార్యక్రమం**



**హైదరాబాద్, (జనంసాక్షి) :** తెలంగాణ సాఫ్ట్‌నెట్ (టి-సాట్) నెట్‌వర్క్, గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (జి-మ్యాట్) 2025కు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఏప్రిల్ 19 నుంచి ప్రత్యేక పాఠశాల ప్రసారాలను ప్రారంభించనుంది. టి-సాట్ సీఈవో బొదనపల్లి వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం జారీ చేసిన పత్రికా ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. కంప్యూటర్ ఆధారిత, బహుళ ఎంపిక పద్ధతిలో జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పోటీ పరీక్ష, విదేశీ విద్య, బిజినెస్, మార్కెటింగ్ రంగాల్లో అవకాశాలను కోరుకునే వారికి మార్గదర్శకం. ఈ ప్రసారాలు అభ్యర్థుల నైపుణ్యాలను పెంపొందించేలా రూపొందించబడ్డాయని సీఈవో పేర్కొన్నారు.

మే 2025లో జరిగే జి-మ్యాట్ పరీక్షను లక్ష్యంగా చేసుకుని, ఏప్రిల్ 19 (శనివారం) నుంచి 30 రోజుల పాటు ప్రతి రోజూ ఒక పాఠశాల కార్యక్రమం ప్రసారం కానుంది. ఈ ప్రసారాలు ఉదయం 8:00 నుంచి 8:30 గంటల వరకు నిపుణ ఛానల్‌లో, సాయంత్రం 6:00 నుంచి 6:30 గంటల వరకు విద్య ఛానల్‌లో అరగంట పాటు అందుబాటులో ఉంటాయి. క్వాంటిటేటివ్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, డేటా ఇన్‌సైట్స్ సిలబస్‌లను ఆధారంగా చేసుకుని, ఆల్జీబ్రా, అరిథ్ మెటిక్, రీడింగ్ కాంప్రహెన్షన్, క్రిటికల్ రీజనింగ్, డేటా సఫిషి యన్సీ, మల్టీ-సోర్స్ రీజనింగ్ వంటి అంశాలపై ప్రశ్నావళి సిద్ధం చేయబడిందని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బిజినెస్ స్కూల్స్‌లో విద్యను అభ్యసించి, యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, ఇటలీ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాలను ఆశించే అభ్యర్థులు ఈ ప్రసారాలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని సీఈవో సూచించారు.

**వరల్డ్ ఎర్త్ డే ప్రత్యేక లైవ్ కార్యక్రమం**

ఏప్రిల్ 22 (మంగళవారం) 'వరల్డ్ ఎర్త్ డే' సందర్భంగా, టి-సాట్ నెట్‌వర్క్ ఉదయం 11:00 గంటలకు ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్, సామాజిక వేత్తలు పాల్గొని 'వరల్డ్ ఎర్త్ డే' ప్రాధాన్యతను వివరిస్తారని సీఈవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

# సింగరేణి చైర్మన్‌కు బీఎంఎస్ అభినందనలు

**నైని బొగ్గు గని ప్రారంభించడం గొప్ప మైలురాయి**
**కార్మికులకు ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని విన్నపం**
(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)




హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం (ఐ ఆర్ ఎస్)ని బీఎంఎస్ నాయకులు పి. మాధవ నాయక్ (ఏబి కెఎం ఎస్)కార్యదర్శి, జెబిసిసిఐ, సిపిఆర్ఎం ఎస్,బిఎస్ ఈ (బోట్) సభ్యుడు), కార్పొరేట్ ఏరియా ఉపాధ్యక్షులు, కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి, ఉట్ల గణేష్, శ్యామ్ లాల్ తదితరులు శుక్రవారం అభినందనలు తెలియజేస్తూ పూల బొకేతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పి. మాధవ నాయక్ మాట్లాడుతూ ఒడిశాలో నైని బొగ్గు గని ప్రారంభం కావడం వల్ల సింగరేణికి వచ్చే 34 సంవత్సరాల బలమైన భవిష్యత్తు ఏర్పడిందన్నారు. ఈ గనిలో 340 మిలియన్ టన్నుల నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, ప్రతి సంవత్సరం దాదాపు 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ గని కేంద్ర ప్రభుత్వం 2015లో కేటాయించినప్పటికీ, గత ఒడిశా ప్రభుత్వ భూమి సేకరణ, పర్యావరణ అనుమతుల్లో ఆలస్యం చేయడం వల్ల ప్రారంభం కావడంలో అడ్డంకులు ఎదురయ్యాయని, ప్రస్తుతం ఒరిస్సాలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరియు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చొరవతో ఈ గని ప్రారంభమయ్యిందని తెలిపారు. ముఖ్యంగా సింగరేణి సిఎండి యన్. బలరాం తన పరిపాలనా నైపుణ్యం, సమన్వయంతో కేంద్రం, రాష్ట్రాల నుండి అవసరమైన అనుమతులు సాధించి, అత్యంత వేగంగా బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం చారిత్రాత్మక విషయమని పేర్కొన్నారు. ఇది సింగరేణి చరిత్రలో ఒక కీలక ఘట్టమని కొనియాడారు.

అదే విధంగా, సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు అందరికీ ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని, 1992లో జెబిసిసి ఐ యాజమాన్యం చేసుకున్న ఎంఓయు ప్రకారం ప్రస్తుతం కొత్తగా చేరిన వారందరికీ కూడా ఐడి కార్డులు జారీ చేయాలని ఒక మెమోరాండం ద్వారా సిఎండి కి వినతి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని జీవీ కృష్ణా రెడ్డి, బిఎంఎస్ ఉపాధ్యక్షులు ఊట్ల గణేష్, కార్యదర్శి యూనియన్ కార్పొరేట్ ఏరియా పేర్కొన్నారు.

# ధన్‌ఖడ్ వ్యాఖ్యలు సుప్రీంపై దాడే

- వక్ఫ్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమే
- ఏపీ సిపిఐ కార్యదర్శి రామకృష్ణ విమర్శలు



**విజయవాడ, ఏప్రిల్18 (జనంసాక్షి) :** న్యాయవ్యవస్థపై ముఖ్యంగా సుప్రీం తీరుపై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. జడ్జీలకు బాధ్యత లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన.. సుప్రీంకోర్టు తాజా తీర్పు రాష్ట్రపతిని ఆదేశిస్తోందని. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు అని కామెంట్ చేశారు.. అయితే, ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలను సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నాం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. భారతదేశంలో అధికారంలో ఉన్న పెద్దలు న్యాయవ్యవస్థ పై దాడి చేస్తున్నారు.. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యలు సుప్రీంకోర్టుపై దాడిగానే భావిస్తున్నాం.. రాష్ట్రాల గవర్నర్ల పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆయనకు నచ్చడం లేదు.. దేశంలో ఎమర్జన్సీ నాటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు.. ?వక్ఫ్ లో ఇతర మతస్తులను పెట్టొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.. వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగం పై దాడిగా పేర్కొన్నారు. వక్ఫ్ బిల్లు పై సొలిసిటర్ జనరల్ కూడా సుప్రీంకోర్టును అవమానించే పద్ధతిలో మాట్లాడుతున్నారు.. ప్రమాదకరమైన వక్ఫ్ బిల్లు పాస్ కావడానికి టీడీపీ కారణమవ్వడం దురదృష్టకరం అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతిచ్చి చంద్రబాబు, నితీష్ కుమార్.. దేశవ్యాప్తంగా చిచ్చు పెట్టారు.. చంద్రబాబు ఇచ్చిన సవరణలను ఆమోదించకపోయినా.. ఎందుకు బిల్లుకు మద్దతు తెలిపారు? అని నిలదీశారు.. చంద్రబాబు తన స్వార్థ రాజకీయాలు పక్కన పెట్టాలని సూచించారు. ఏపీలో కామెడీ రాజకీయం నడుస్తోంది.. రకరకాల కారణాలతో గోశాల ఆవులు చనిపోయుండొచ్చు.. దానికి అంత చర్చ దేనికి..? ఆవుల మృతి పై కరుణాకర్ రెడ్డి చేసిన సూచనలు తీసుకుంటే తప్పేముంది? కూటమి పార్టీలన్నీ కలిసి పక్కా కామెడీ ట్రాక్ నడిపిస్తున్నారు అంటూ ఎద్దేవా చేశారు.. రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు పారదర్శకంగా వ్యవహరించాలని రామకృష్ణ సూచించారు .. రాజధాని అప్పులకు కేంద్రమే ష్యూరిటీ– ఇస్తుందని.. చివరకు హడ్కో, వరల్డ్ బ్యాంక్, ఏషియన్ బ్యాంకు నుంచి అప్పులు తెచ్చారన్న ఆయన.. జర్మనీ సంస్థ నుంచి ఐదువేల కోట్లు– అప్పుతెచ్చారు.. అమరావతి కోసం 62 వేల కోట్లు అప్పులు తెచ్చారు .. ఈ అప్పుల్లో కేంద్రం ఏమైనా గ్రాంట్ ఇచ్చిందా..? ఈ అప్పును కేంద్రం చెల్లిస్తుందా..? అని ప్రశ్నించారు. సెల్ఫ్ స్టసైనబుల్ ప్రాజెక్ట్ అని చెప్పి మరో 44 వేల ఎకరాలు తీసుకోవాలని చూడటమేంటి..? అని నిలదీశారు.. సీఎం సొంతజిల్లా చిత్తూరులో అన్నీ మూతపడ్డాయి.. కడప స్టీల్ ఫ్యాక్టరీ గురించి చంద్రబాబు మాట్లాడటం లేదు.. 26 జిల్లాల్లో అత్యధికంగా వలసలున్న జిల్లా కర్నూలు.. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు ఎవరడిగారు నిన్ను.. మే2వ తేదీ మళ్లీ ప్రధాని రావడం దేనికి? అంటూ సీఎం చంద్రబాబుపై సీపీఐ కార్యదర్శి రామకృష్ణ ప్రశ్నల వర్షం కురిపించారు.

# 20న బీసీ గురుకులాల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి పరీక్ష

- గురుకులాల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న 6, 7, 8, 9వ తరగతుల సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 20న నిర్వహించే ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు, ఐఎఫ్ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. 6,7,8,9 వ తరగతుల్లో మొత్తం 6832 బ్యాగ్ లాగ్ సీట్లు ఉండగా 26884 దరఖాస్తులు వచ్చాయని ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20, 2025 (ఆదివారం) ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే అభ్యర్థులందరూ హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకున్నారని, ఇంకా హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకొని వాళ్ళు ఎవరైనా ఉంటే వెంటనే **www.mjptbcwreis.telangana.gov.in** లేదా **https://mjptbcadmissions.org** వెబ్‌సైట్ల నుంచి డౌన్లోడ్ ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

# ట్రైన్‌లో లైంగికదాడి ఘటన అంతా..ఉత్తిదే

- యువతి నాటకం నడిపినట్లు గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్18 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైన్‌లో అత్యాచారయత్నం ఘటన కేసు ఇప్పుడు సంచలన మలుపు తిరిగింది. యువతి పై జరిగినదన్న అత్యాచారం అబద్ధంగా తేలింది. ఈ కేసులో రైల్వే పోలీసులు చేపట్టిన లోతైన దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ ట్రైన్ లోనుండి జారిపడిన యువతి, అనంతరం తనపై అత్యాచారం జరిగిందని కథ అల్లింది. ఆమె కథనాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో అనుమానితులుగా 100 మందిని పోలీసులు విచారించగా, అసలు విషయానికి దగ్గరయ్యారు. కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పోలీసులు 250 సీసీటీవీ కెమెరాల ఫుటేజీ ని పరిశీలించారు. అనేక కోణాల్లో వీడియోలను అధ్యయనం చేసిన అనంతరం, యువతి కథనాల్లో అనేక అనుమానాస్పద అంశాలు బయటపడ్డాయి. ఎటువంటి ఆధారాలు ఆమె చెప్పిన కథనాలను సమర్థించలేదని పోలీసులు తేల్చారు. విచారణలో చివరికి యువతి అసలు విషయం వెల్లడించింది. రీల్స్ చేస్తూ ట్రైన్ నుంచి జారిపడిన విషయాన్ని దాచిపెట్టి, అత్యాచారం జరిగినట్టు అబద్ధం చెప్పినట్టు– ఒప్పుకుంది. పోలీసులు లీగల్ ఒపీనియన్ తీసుకుని, ఎటు–వంటి అత్యాచారం జరగలేదని నిర్ధారించి కేసును మూసివేశారు.

# బెట్టింగ్ యాప్‌లపై త్వరలోనే నిసేధం

- సమగ్రచట్టం తెస్తామన్న మంత్రినారా లోకేశ్



**అమరావతి, ఏప్రిల్18 (జనంసాక్షి) :** బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్రంలో ఉక్కుపాదం మోపుతామని మంత్రి లోకేష్ హెచ్చరించారు. బెట్టింగ్ యాప్‌లపై లోకేష్ స్పందించారు. బెట్టింగ్ యాప్‌ల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని తనకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఎక్స్‌లో పెట్టిన ఒక పోస్టుపై లోకేష్ తీవ్రంగా స్పందించారు. బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్రంలో ఉక్కుపాదం మోపుతామన్న లోకేష్.. ఏపీలో బెట్టింపు యాప్‌ల నిషేదానికి సమగ్ర విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. ఇది దేశానికే ఆదర్శంగా ఉండే విధానంగా ఉంటుందని చెప్పారు. న్యాయపరమైన అన్ని అవకాశాలను ఉపయోగించుకుని బెట్టింగ్ సంస్కృతిని ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. బెట్టింగ్ యాప్‌ల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. అనేక మంది బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులై ఆర్థికంగా దెబ్బతింటున్నారని, ఇట–వంటి పరిస్థితి నుంచి వారిని కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బెట్టింగ్ యాప్‌లలో జూదం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు కూడా చైతన్యం కావాల్సి ఉందన్నారు.

# భగవద్గీతకు యునెస్కో గుర్తింపు పట్ల హర్షం

- ఇది సంతోషకరమైన వార్త అంటూ పవన్ పోస్ట్



**అమరావతి, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** యునెస్కో మెమరీ ఆఫ్ ది వరల్డ్ రిజిస్టర్ లో భగవద్గీత, భరతముని నాట్య శాస్త్రాలకు చోటు దక్కడంపై డిప్యూటీ సీఎం పవన్ స్పందించారు. ఎక్స్ వేదికగా సుదీర్ఘ పోస్టు చేశారు. మన సంస్కృతి మన దేశానికి ఆత్మ లాంటిదన్నారు. ఈ సంస్కృతి ఎన్నడూ గుర్తింపు కోరుకోలేదని.. మానవాళికి మంచిని అందించడమే దాని ఉద్దేశం అన్నారు. ఇప్పుడు యునెస్కో మన సంస్కృతిని గుర్తించడం చాలా సంతోషంగా ఉందన్నారు. భారతదేశం సనాతన ధర్మానికి శాశ్వత చిహ్నంగా, ఆధ్యాత్మిక సత్యానికి అమర మార్గదర్శిగా ఉందని చెప్పుకొచ్చారు. భగవద్గీత ప్రపంచానికే మార్గదర్శి.. వేల ఏళ్ల నాటి నాట్య కళకు భారత దేశం ప్రతీక. నాగరికతను నేర్పించిందే మన భగవద్గీత. మన నమ్మకాలను, వ్యవస్థలను పెంచడానికి ఈ గుర్తింపు చాలా అవసరం. మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రపంచ వ్యాప్తంగా మన ధర్మం గురించి చేస్తున్న కృషి వల్లే ఇది సాధ్యం అయింది. మన దేశ కల్చర్ శాఖ కూడా దీని వెనకాల ఉంది. ఇది మనందరికీ గొప్ప విషయం' అంటూ తెలిపారు పవన్ కల్యాణ్. ఆయన చేసిన ట్వీట్ కొద్ది క్షణాల్లోనే వైరల్ అయిపోయింది.

# అనతి కాలంలోనే అనేక సంక్షేమ పథకాలు





- ఓర్వలేక బురదజల్లే ప్రయత్నంలో ప్రతిపక్షాలు
- మంత్రులు పొంగులేటి, సీతక్క
- భూ భారతిలో రైతులకు అవగాహన

**ఆదిలాబాద్ ప్రతినిధి18, (జనంసాక్షి) :** అనతి కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా బొరాజ్ మండలంలోని పుసాయి గ్రామంలో అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లాకు చేరుకున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కలకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిలేష్ మహాజన్ లు, ఖానాపూర్ ఎంఎల్‌ఏ వెడమ బొజ్జు, కాంగ్రెస్ శ్రేణులు స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పూసాయి గ్రామంకు చేరుకున్న అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రులు పొంగులేటి, సీతక్క లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతూ ముందుకెళ్తుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కొన్ని పార్టీలు కావాలని కాంగ్రెస్ పార్టీపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రైతులకు అవగాహన కల్పించారు. గత ప్రభుత్వ హయంలో ప్రవేశపెట్టిన ధరణి వల్ల రైతులకు మేలు జరగలేదన్నారు. ఇప్పుడు కొత్తగా ప్రవేశెట్టిన ఈ భూ భారతి వల్ల రైతులకు అన్ని విధాల న్యాయం జరిగే అవకాశం ఉందని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు తరలి వచ్చారు.

## మద్యం మత్తులో యువకుల వీరంగం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని బహదూర్‌పల్లిలో మందుబాబులు రెచ్చిపోయారు. మద్యం మత్తులో ఓ గేటెడ్ కమ్యూనిటీలోకి అక్రమంగా ప్రవేశించిన యువకులు.. అడ్డుకున్న సెక్యూరిటీ గార్డుపై దాడికి దిగబడ్డారు. వారిని అడ్డుకోబోయిన మహిళలను బండబూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన మన్నె గణేశ్ అలియాస్ లల్లు (24), వారాల అజయ్ (24), నితిన్ (24), తిరుమలేశ్ (27) తోపాటు మరో యువకుడు కారు(ఏపీ28– బీయూ 6886)లో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో కొంపల్లి వైపు నుంచి బహదూర్‌పల్లి మీదుగా సూరారం వెళ్తున్నారు. ఈ క్రమంలో బహదూర్‌పల్లిలోని అయోధ్య విల్లాల వద్దకు రాగానే షార్ట్‌కట్‌లో వెళ్లొచ్చని గేటెడ్ కమ్యూనిటీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్‌గా విధులు నిర్వహిస్తున్న నేపాల్‌కు చెందిన దిలీప్ వారిని అడ్డుకున్నాడు. దీంతో తీవ్ర ఆగ్రహం, అసహనానికి గురైన యువకులు పక్కనే ఉన్న మరో కారును తమ కారుతో ఢీకొట్టారు. అనంతరం కారులో నుంచి కిందకు దిగి.. మమ్మల్నే అడ్డుకుంటావా అని సెక్యూరిటీ గార్డును చితకబాదారు. సెక్యూరిటీ గార్డుపై దాడి చేయడం గమనించిన స్థానిక మహిళలు అడ్డుకోబోయారు. కానీ రెచ్చిపోయిన యువకులు సదరు మహిళలను కూడా బండబూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు.

# ఏపీలో ఎస్సీ రిజర్వేషన్లపై నోటిఫికేషన్

- ఆయా వర్గాలకు రిజర్వేషన్ల వర్తింపు

**అమరావతి, ఏప్రిల్18 (జనంసాక్షి) :** ఎస్సీ వర్గీకరణపై ఉపకులాలకు వర్తించే రిజర్వేషన్లను నిర్వచిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి గురువారం ప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. తాజాగా రిజర్వేషన్ నిబంధనలు, మార్గదర్శకాలు విడుదల చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిబంధనలు తక్షణం అమల్లోకి వస్తాయని పేర్కొంది. దీని ప్రకారం.. మొదటి గ్రూప్‌లో ఉన్న రెల్లి సహా 12 ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్ వర్తించనుంది. రెండో గ్రూప్‌లో మాదిగ సహా 18 ఉపకులాలకు 6.5 శాతం రిజర్వేషన్, మూడో గ్రూప్‌లో మాల సహా 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. ఎస్సీ వర్గీకరణ కింద మొత్తం 15 శాతం రిజర్వేషన్ కల్పించేలా ప్రభుత్వం నిబంధనలు జారీ చేసింది. మొత్తం 200 రోస్టర్ పాయింట్లను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మూడు కేటగిరిల్లోనూ మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒక వేళ అర్హులు లేకుంటే తదుపరి నోటిఫికేషన్‌కు ఖాళీలను బదలాయిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# 21 నుంచి 23 వరకు నిజామాబాద్‌లో రైతు మహోత్సవం

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఐఏఎస్, డాక్టర్ బి. గోపి

**హైదరాబాద్, ఏప్రిల్ 18 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 21 నుండి 23 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రైతు మహోత్సవం జరగనున్నట్లు వ్యవసాయ శాఖ సంచాలకులు ఐఏఎస్ డాక్టర్ బీ. గోపి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్థానిక జిజి కాలేజీ గ్రౌండ్ లో జరిగే ఈ రైతు మహోత్సవంను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఇక మూడు రోజులపాటు జరిగే ఈ రైతు మహోత్సవంలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు, వారు పండించిన ఉత్పత్తులు రైతు మహోత్సవ ప్రదర్శనలో పెట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులు సైతం రైతు మహోత్సవంలో ఉండనున్నట్లు అగ్రికల్చర్ డైరెక్టర్ బీ. గోపీ తెలిపారు. దాదాపు 150 కిపైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో వ్యవసాయం మరియు అనుబంధ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, స్టార్టప్‌లు, ఎఫ్‌పీవోలు, ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన స్టాల్స్ ఉంటాయన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు ప్రగతిశీల/ అవార్డు గ్రహీత రైతులచే కొత్త సాంకేతికత పద్ధతులపై 3 రోజుల వర్క్‌షాప్ ఉంటుందని వ్యవసాయ శాఖ సంచాలకులు బీ గోపి తెలిపారు. మూడు రోజులపాటు జరిగే రైతు మహోత్సవం కు వేలాదిమంది రైతులు పాల్గొనే అవకాశం ఉందని, ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

# దివంగత అధ్యక్షుడు జిమ్మీకార్టర్‌పై ప్రేలాపన

- జో బైడెన్ చెత్త అధ్యక్షుడని గుర్తించాడని వ్యాఖ్య



**వాషింగ్టన్, ఏప్రిల్18 (జనంసాక్షి) :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మాజీ అధ్యక్షుడి మరణంపై అనుచితంగా మాట్లాడారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ పరిపాలన గురించి మాట్లాడుతూ ఇటీ–వల మరణించిన మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ మరణంపై ట్రంప్ అవహేళనగా మాట్లాడారు. జో బైడెన్ తన కంటే 'చెత్త' అధ్యక్షుడు అని తెలుసుకుని జిమ్మీ కార్టర్ సంతోషంగా కన్నుమూశారని వ్యాఖ్యానించారు. గురువారం ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీతో కలిసి ఓవల్ ఆఫీసులో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ ఈ అనుచిత వ్యాఖ్యలు చేశారు. జో బైడెన్ పరిపాలన చాలా భయంకరమైందన్నారు. ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడంలో సమర్థులని వ్యాఖ్యానించారు. ఆ అసమర్థులు ప్రజలకు ఏమీ చేయలేకపోయారని ధ్వజమెత్తారు. అమెరికా చరిత్రలోనే బైడెన్‌ది చెత్త పరిపాలన అంటూ మండిపడ్డారు. జిమ్మీ కార్టర్ కంటే బైడెన్ అధ్వానంగా పరిపాలించారని.. ఈ విషయం తెలుసుకుని కార్టర్ సంతోషంగా కన్నుమూశారని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా 39వ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ బాధ్యతలు నిర్వర్తించారు. గతేడాది డిసెంబరు 29న ఆయన మరణించారు. జనవరిలో జరిగిన అంత్యక్రియలకు ట్రంప్‌తో సహా పలువురు మాజీ అధ్యక్షుల దంపతులు హాజరయ్యారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370